PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

# ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 186 | విజయవాడ, శనివారం 10 ఫిబ్రవరి 2024 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Saturday 10 February 2024 | Rs

## స్టాక్ మార్కెట్లోకి మరిన్ని పిఎఫ్ నిధులు..!

- ఇపిఎఫ్‌పై వడ్డీ తగ్గింపు
- సిబిటి ప్రతిపాదన

6

## బిల్లులు చెల్లించాల్సిందే

- ఆర్థికశాఖ ప్రధాన కార్యదర్శికి హైకోర్టు ఆదేశం

**ప్రజాశక్తి-అమరావతి**

ప్రభుత్వ భవనాలు, రోడ్ల నిర్మాణం చేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించాలన్న గత ఆదేశాలను అమలు చేయని ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి షంషేర్ సింగ్ రావత్‌పై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. వచ్చే విచారణ నాటికి బిల్లులు చెల్లించాలని, లేనిపక్షంలో అప్పుడు కోర్టుకు వ్యక్తిగతంగా హాజరై వివరణ ఇవ్వాలంది. గత ఆదేశాల మేరకు కోర్టుకు హాజరుకాకపోవడంపై ఆగ్రహించింది. కనీసం వ్యక్తిగత హాజరు నుంచి మినహాయించాలని పిటిషన్ కూడా వేయలేదని తప్పుపట్టింది. కోర్టు ధిక్కార చట్టం కింద ఆయనకు ఫాం-1 నోటీసు జారీ చేసింది. విచారణను నాలుగు వారాలకు వాయిదా వేస్తూ న్యాయమూర్తి వడ్డిబోయన సుజాత శుక్రవారం ఆదేశాలిచ్చారు. ఆర్అండ్‌బి పరిధిలోని నిర్మాణాలకు బిల్లులు చెల్లించడం లేదంటూ పలువురు కాంట్రాక్టర్లు గతేడాది వేసిన పిటిషన్లపై హైకోర్టు విచారణ జరిపింది.



# పివికి భారత రత్న

## ఈ ఏడాదిలో ఇప్పటి వరకు ఐదుగురికి ఈ పురస్కారం

- చరణ్ సింగ్, స్వామినాథన్‌లకు కూడా

**ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో**

భారత మాజీ ప్రధాని, తెలుగు తేజం పివి నరసింహారావుకు మరణానంతరం 'భారతరత్న' పురస్కారం లభించింది. దేశంలో అత్యున్నతమైన ఈ పౌర పురస్కారం ఒక తెలుగోడికి దక్కడం ఇదే మొదటిసారి. పివితోబాటు మరో మాజీ ప్రధాని చౌదరి చరణ్ సింగ్, హరిత విప్లవ పితామహుడు, ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్‌లను కూడా భారత రత్నతో సత్కరిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం శుక్రవారం ప్రకటించింది. ప్రధాని నరేంద్ర మోడీ ఈ విషయాన్ని ఎక్స్‌లో ట్వీట్ చేశారు. కొన్ని రోజుల క్రితమే మాజీ ఉప ప్రధాని, బిజెపి సీనియర్ నేత ఎల్ కె అద్వానీ, బీహార్ మాజీ ముఖ్యమంత్రి కీ.శే. కర్పూరీ ఠాకూర్‌కు కేంద్రం భారతరత్న పురస్కారం ప్రకటించిన సంగతి తెలిసిందే. గతంలో ఎన్నడూ లేని రీతిలో ఈ ఏడాదిలో ఇప్పటి వరకూ ఐదుగురికి భారతరత్న అవార్డులు ప్రకటించింది. ఒక ఏడాదిలో ముగ్గురికి భారత రత్న అవార్డులు ప్రకటించడం ఇంతవరకు ఉన్న రికార్డు. మోడీ ప్రభుత్వం ఇప్పుడు దానిని బ్రేక్ చేసింది. శుక్రవారం ముగ్గురికి భారత రత్న ప్రకటించడాన్ని కాంగ్రెస్ స్వాగతించింది. వీరంతా భారత రత్నకు అర్హులని పేర్కొంది.

ఎంఎస్ స్వామినాథన్‌కు భారత రత్న ప్రకటించడంపై ఆయన కుమార్తె, డబ్ల్యూహెచ్ఓ మాజీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ సౌమ్య స్వామినాథన్ స్పందిస్తూ వ్యవసాయ రంగానికి, రైతులకు చేసిన సేవలకు గాను ఈ గుర్తింపు దక్కడంపై సంతోషంగానూ, గర్వంగానూ ఉందన్నారు. ఆయన జీవితకాలంలో ఈ అవార్డు దక్కి ఉంటే కచ్చితంగా సంతోషించేవారని ఆమె అభిప్రాయపడ్డారు. అయితే ఆయన ఎప్పుడూ అవార్డుల కోసం పని చేయలేదని, గుర్తింపుకోసం ఎదురు చూడలేదని, జీవితమంతా రైతుల ప్రయోజనాల కోసమే తపించేవారని ఆమె పేర్కొన్నారు. సమాజంలో రైతులు, పేదల కోసం ఆయన నిర్విరామంగా కృషి చేశారని అన్నారు.

# మోడీతో జగన్ భేటీ

- ప్రత్యేక హోదా కోసం వినతి
- ఎత్తులు, పొత్తులపై చర్చ!
- నిర్మలా సీతారామన్‌తో విడిగా భేటీ



ప్రధాని మోడీతో సమావేశమైన సిఎం జగన్

**ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో**

తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు ఢిల్లీలో బిజెపి పెద్దలను కలుసుకుని వచ్చిన మరుసటి రోజే, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి హుటా హుటిన ఢిల్లీ వెళ్లి ప్రధాని నరేంద్రమోడీని కలిశారు. ఏం చర్చించిందీ బయటకు అధికారికంగా వెల్లడించనప్పటికీ ఎన్నికలు, ఎత్తులు. పొత్తుల గురించే ప్రధానంగా చర్చ జరిగినట్లు సమాచారం. రాజకీయ ప్రత్యేక హోదా, రాష్ట్రానికి సంబంధించిన ఇతర డిమాండ్లను ప్రధాని దృష్టికి తీసుకెళ్లడానికే కలిశారని బయటకు చెప్పినప్పటికీ, అంతకుమించిన ఎజెండా ఉందని పరిశీలకులు పేర్కొంటున్నారు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను విడివిడిగా కలిసిన జగన్మోహన్ రెడ్డి కొన్ని డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని వారికి అందజేశారు.అందులో ఒక్కటి కూడా కొత్త డిమాండ్ లేదు. అన్నీ ఇదివరకు నివేదించినవే. పోలవరం నిధులు, విభజన హామీలు అమలు, ప్రత్యేక హోదా, తెలంగాణ నుంచి విద్యుత్ బకాయిలు, విశాఖ మెట్రోకు వీలైనంత త్వరగా ఆమోదం, మెడికల్ కాలేజీలకు ఆర్థిక సహకారం వంటివి వీటిలో ఉన్నాయి. నిర్మలా సీతారామన్‌తో భేటీలో "పోలవరం ప్రాజెక్ట్‌లో కాంపొనెంట్ వారీగా సీలింగ్ ఎత్తివేయాలని ముఖ్యమంత్రి మిగతా 7లో

# బిజెపిని, ఆ పార్టీతో పొత్తు కలిసే టిడిపి-జనసేన, నిరంకుశ వైసిపిని ఓడించండి

- సిపిఎం, సిపిఐ పిలుపు
- వామపక్ష, లౌకిక శక్తులను గెలిపించాలని విజ్ఞప్తి
- 20న విజయవాడలో రాష్ట్ర సదస్సు



మీడియాతో మాట్లాడుతున్న వి శ్రీనివాసరావు, కె రామకృష్ణ, వేదికపై సిపిఎం, సిపిఐ నాయకులు

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

రాష్ట్రానికి ద్రోహం చేసిన బిజెపిని, ఆ పార్టీతో పొత్తు పెట్టుకుంటున్న జనసేన- తెలుగుదేశం కూటమిని, రాష్ట్రంలో నిరంకుశ వైసిపిని ఓడించాలని సిపిఎం, సిపిఐ రాష్ట్ర కార్యదర్శులు వి. శ్రీనివాసరావు, కె.రామకృష్ణ పిలుపునిచ్చారు. శుక్రవారం ఉదయం సిపిఎం రాష్ట్ర కార్యాలయంలో సమావేశమైన రెండు పార్టీల ప్రతినిధులు ఈ మేరకు ఉమ్మడి అవగాహనకు వచ్చారు. అనంతరం బాలోత్సవ్ భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో వామపక్ష, లౌకిక పార్టీలను బలపరచాలని విజ్ఞప్తి చేస్తూ 20వ తేదీన విజయవాడలో రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బిజెపితో పొత్తు పెట్టుకోవడమంటే రాష్ట్రాన్ని సుడిగుండంలోకి నెట్టడమేనని, టిడిపికి మరణశాసనమన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వకుండా విభజన హామీల అమలు జరపకుండా విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని తెగ నమ్ముతూ రాష్ట్ర అభివృద్ధిని దెబ్బ తీసిన బిజెపితో ఎలా కలుస్తున్నారో చెప్పాలని తెలుగుదేశం పార్టీని ప్రశ్నించారు. 2019లో ఎన్‌డిఏ నుంచి ఏ కారణం చేత బయటికి వచ్చారో, ఇప్పుడు ఆ సమస్యలు ఏమయ్యాయో తెలుగు ప్రజలకు సంజాయిషీ ఇవ్వాలని తెలుగుదేశం జనసేన పార్టీలను కోరారు. దేశంలో అనేక రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీలు బిజెపితో కలిసి నాశనం అయ్యాయని అన్నారు రాష్ట్ర హక్కులు హరించి నిరంకుశత్వాన్ని బిజెపి దేశంపై రుద్దుతున్నదని, మతోన్మాదాన్ని ఇప్పుడు ఎజెండాగా చేపట్టి రాష్ట్రాన్ని దేశాన్ని బలహీన పరుస్తుందనీ, మతాల విభజన తెచ్చి మైనార్టీలను అభద్రతాభావం లోకి నెట్టిందని, మెజారిటీ మతస్తులైన హిందువులలో కుల విభజన తెచ్చి సనాతన కుల వ్యవస్థని పునరుద్ధరించాలని చూస్తున్నదని అన్నారు. అటువంటి పార్టీతో కలిసి మీరు మైనార్టీలకు ఏమి చెబుతారని నిలదీశారు. కేవలం తమ స్వార్థ రాజకీయ ఎజెండా కోసం, పదవుల కోసం, అధికారం కోసం తప్ప రాష్ట్ర ప్రజల ప్రయోజనాలను పణంగా పెట్టి తెలుగుదేశం జనసేనలు తప్పు చేస్తున్నాయన్నారు. ఇటువంటి పార్టీలను రానున్న ఎన్నికల్లో మిగతా 2లో

# ప్రాథమిక హక్కులపై దాడిని తిప్పికొట్టండి

- మెడికల్ రెప్రజెంటేటివ్‌ల రాష్ట్ర మహాసభలో ఎమ్మెల్సీ లక్ష్మణరావు




మహాసభలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

ప్రాథమిక హక్కులపై జరుగుతున్న దాడిని తిప్పి కొట్టడం ద్వారా రాజ్యాంగ పరిరక్షణకు నడుం బిగించాలని మెడికల్ రెప్రజెంటేటివ్‌లకు ఎంఎల్‌సి కె.ఎస్ లక్ష్మణరావు పిలుపునిచ్చారు. శుక్రవారం విజయవాడలోని ఎంబివికెలో ఆంధ్రప్రదేశ్ మెడికల్ అండ్ సేల్స్ రెప్రజెంటేటివ్స్ యూనియం (ఎపిఎంఎస్ఆర్‌యు) 39వ రాష్ట్ర మహాసభలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈనెల 11వ తేదీ దాకా మూడు రోజులపాటు జరిగే ఈ మహాసభలను రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ కుమార్ జెండాను ఆవిష్కరించి ప్రారంభించారు. ఈ మహాసభ ప్రారంభ కార్యక్రమానికి ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ పదేళ్ల కాలంలో రాజ్యాంగం ఇచ్చిన ప్రాథమిక హక్కులపై దాడి విపరీతంగా పెరిగిందన్నారు. ప్రాథమిక హక్కులు లేకుంటే కార్మికులకు ఎలాంటి హక్కులు వుండవని అన్నారు. ప్రాథమిక హక్కులు, భావప్రకటనా స్వేచ్ఛ లేకుంటే కార్మిక సంఘాలు హక్కులను కూడా సాధించుకోలేవని తెలిపారు. ఇప్పటికే కార్మిక హక్కులను పూర్తిగా రద్దుచేసి నాలుగు లేబర్‌కోడ్‌లను తీసుకొచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. సమాఖ్య స్ఫూర్తిని పూర్తిగా ధ్వంసం చేసేలా దేశాన్ని అధ్యక్షతరహాపాలన కిందికి తీసుకొచ్చేందుకు కుట్ర జరుగుతోందన్నారు. కార్మిక హక్కుల పరిరక్షణ కోసం ప్రజలతో మమేకం అయి బలమైన ఉద్యమాలను నిర్మించాలని కోరారు. ఈ సందర్భంగా ఎపిఎంఎస్ఆర్‌యు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ కుమార్ మాట్లాడుతూ దేశంలో కోవిడ్ ప్రజల ప్రాణాలతోపాటు మన హక్కులను కూడా తీసుకెళ్లిందని అన్నారు. కోవిడ్ వైద్యరంగంలో వున్న డొల్లతనాన్ని చాటిచెప్పిందని అన్నారు. క్యాన్సర్ పేషంట్ వాడే మందులపై 5శాతం జిఎస్‌టి వుంటే బంగారంపై మూడు శాతం వుందన్నారు.

అలాగే పౌష్టికాహారంపై 20శాతం జిఎస్‌టి వుంటే వజ్రాల మీద ఒక శాతం మాత్రమే ఉందన్నారు. మందులు, వైద్యపరికరాలపై పెద్దఎత్తున జిఎస్‌టి వుందని, దేశంలో ఆరోగ్యవంతుల కంటే అనారోగ్యంగా వున్నవారే అధికపన్నులు కడుతున్నారని చెప్పారు. మందుల ధరలను నియంత్రించకుండా జనరిక్స్ పేరుతో కేంద్రం మోసం చేస్తోందని చెప్పారు. నియంత్రణలేక పోతే జనరిక్స్ మందుల ధరలు కూడా పెరిగిపోయే మిగతా 2లో

## దేశంలో 96 కోట్లకు పైగా ఓటర్లు

- ప్రపంచంలోనే అత్యధికం
- కేంద్ర ఎన్నికల సంఘం

**న్యూఢిల్లీ :** త్వరలో జరిగే లోక్‌సభ ఎన్నికల్లో ఓటు వేసేందుకు దేశవ్యాపితంగా మొత్తం 96.88 కోట్ల మంది అర్హులుగా తేలారని కేంద్ర ఎన్నికల సంఘం శుక్రవారం వెల్లడించింది. 2024 సాధారణ ఎన్నికల కోసం కేంద్ర ఎన్నికల సంఘం ఓటర్ల జాబితాను తాజా పరిచింది. కచ్చితమైన ప్రణాళిక, సమన్వయం, రాజకీయ పార్టీల భాగస్వామ్యంతో ఓటర్ల జాబితాలో మార్పులు చేర్పుల ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసినట్లు ఎన్నికల సంఘం ఒక ప్రకటనలో తెలిపింది. తుది జాబితా ప్రకారం ప్రపంచంలోనే అత్యధిక సంఖ్యలో ఓటర్లు భారత్‌లో ఉన్నారు. 2019 లోక్‌సభ ఎన్నికలతో పోల్చుకుంటే ఆరు శాతం ఓటర్లు పెరిగారు. 18 ఏళ్ల దాటిన కొత్త ఓటర్ల సంఖ్య 2.63 కోట్లు అని ఎన్నికల సంఘం తెలిపింది. అలాగే 2023లో ప్రతి వెయ్యిమంది పురుషులకు, 940గా ఉన్న మహిళా ఓటర్ల నిష్పత్తి 2024లో 948కి పెరిగింది. వచ్చే ఎన్నికల్లో ఓటింగ్ శాతం మరింత మెరుగుపడేలా చూసేందుకు ఎన్నికల సంఘం కసరత్తు చేస్తోంది.

# సచివాలయాల్లో బదిలీలకు ఓకే

- పాత జిల్లాల యూనిట్ ప్రకారమే రేషనలైజేషన్
- స్పౌస్ కోటాలో అంతర్ జిల్లాల బదిలీలకు గ్రీన్‌సిగ్నల్

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ, వార్డు సచివాలయాల్లోని ఉద్యోగుల బదిలీలకు ప్రభుత్వం మరోసారి పచ్చ జెండా ఊపింది. ఈ మేరకు జిఓ ఎంఎస్ నెంబరు 1001ని శుక్రవారం విడుదల చేసింది. పాత జిల్లాల యూనిట్ ప్రకారమే రేషనలైజేషన్ ప్రకియ ఉంటుందని అందులో స్పష్టం చేసింది. స్పౌస్ కేటగిరిలో భార్య, భర్తలకు జిల్లా/అంతర్ జిల్లాల బదిలీలు చేయొచ్చని కూడా జిఓలో పేర్కొంది. జిల్లాల్లో అవసరమైన పోస్టులకు బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించాలని తెలిపింది. ఎనిమిది మంది కంటే ఎక్కువ సచివాలయ ఉద్యోగులు ఉన్న గ్రామ, వార్డు సచివాలయాల నుంచి ఎనిమిది మంది కంటే తక్కువ ఉన్న సచివాలయాలకు సిబ్బందిని బదిలీలు చేయనున్నారు. బదిలీల ప్రక్రియలో హోదాల ప్రాధాన్యతా క్రమంలో నాలుగు అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని ప్రభుత్వం పేర్కొంది. గ్రామీణ ప్రాంతాల్లోనైతే మొదటి ప్రాధాన్యతగా సంక్షేమం, విద్య అసిస్టెంట్/వార్డు సంక్షేమం అభివృద్ధి కార్యదర్శి (డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు డిఎస్), రెండో ప్రాధాన్యతగా గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శి (మహిళా పోలీస్ (జిఎంఎస్‌కె)), మూడో ప్రాధాన్యత గా డిజిటల్ అసిస్టెంట్లు, నాలుగో ప్రాధాన్యతగా పంచాయతీ కార్యదర్శి గ్రేడ్, పట్టణాల్లో ప్రాధాన్యత వార్డు సంక్షేమం, అభివృద్ధి కార్యదర్శి, రెండో ప్రాధాన్యతగా వార్డు మహిళలు, బలహీనుల విభాగం రక్షణ కార్యదర్శి (మహిళా పోలీస్), మూడో ప్రాధాన్యతగా వార్డు విద్య, డేటా ప్రాసెసింగ్ కార్యదర్శులుగా ప్రాధాన్యతల వారీ బదిలీల ప్రక్రియ ఉండనుంది.


## అక్రమ అరెస్టులు దారుణం

- ఆశాలపై పెట్టిన కేసులను తక్షణమే ఎత్తేయాలి
- సమస్యలు పరిష్కరించాలని డిమాండ్
- రాష్ట్ర వ్యాప్తంగా విధుల బహిష్కరణ

లోపలి పేజీలో..

## టిడిపి, వైసిపిలకు ఓటు వేస్తే బిజెపికి వేసినట్టే

- పిసిసి అధ్యక్షులు వైఎస్.షర్మిల



రచ్చబండలో మాట్లాడుతున్న షర్మిల

**ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి, చాగల్లు**

బిజెపికి గులాంగిరీ చేసే పార్టీలను ఓడించాలని పిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల కోరారు. రానున్న ఎన్నికల్లో టిడిపి, వైసిపిలకు ఓటు వేస్తే బిజెపికి వేసినట్టేనని విమర్శించారు. బిజెపికి బానిసలుగా మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు, ప్రస్తుత ముఖ్య మంత్రి జగన్ మారిపోయారని ఆరోపించారు. వారి స్వార్థ ప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రయోజనాలను బిజెపికి తాకట్టుపెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బిజెపితో పొత్తు కోసం ఈ రెండు పార్టీలు ఉవ్విళ్లూరుతున్నాయన్నారు. ప్రత్యేక హోదా, పోలవరానికి నిధులు ఇవ్వకుండా పదేళ్లుగా రాష్ట్రాన్ని బిజెపి దారుణంగా మోసం చేసిందని మండిపడ్డారు. తూర్పుగోదావరి జిల్లా చాగల్లులో ఆ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రైతు సంఘం నాయకులు గారపాట వెంకట సుబ్బారావు మాట్లాడుతూ.. చాగల్లులో షుగర్ ఫ్యాక్టరీ ప్రారంభిస్తే వందల కుటుంబాలకు ఉపాధి లభిస్తుందని, ప్రతిపక్ష నేతగా జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ అమలుకు నోచుకోలేదని గుర్తు చేశారు. దళిత నాయకులు బొంత శ్యామ్‌ప్రకాష్ మాట్లాడుతూ.. హోం మంత్రి నియోజకవర్గంలోనే దళితులకు రక్షణ లేదన్నారు. రవాణా రంగ కార్మికులు మాట్లాడుతూ.. కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో వైసిపి అనుసరిస్తోన్న విధానాల ఫలితంగా రవాణా రంగం పూర్తిగా కుదేలైందని చెప్పారు. ఈ సందర్భంగా షర్మిల మాట్లాడారు. దళిత మహిళ హోంమంత్రిగా ఉన్న రాష్ట్రంలో దళిత మహిళలకు, దళితులకు రక్షణ లేకుండా పోవడం శోచనీయమన్నారు. వెంటనే హోం మంత్రి తానేటి వనిత తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. వైసిపి ప్రభుత్వ హయాంలో అన్ని ధరలూ విపరీతంగా పెరిగిపోయాయని, సామాన్యులు బతికే పరిస్థితి లేదన్నారు. ఖర్చులు మిగతా 2లో

# ఆహారధాన్యాల సాగు, ఉత్పత్తి ఈ ఏడాదే అతి తక్కువ

- ఇంకా పెరగనున్న బియ్యం ధరలు

**ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి**

అన్నపూర్ణ, ఆహారాంధ్రప్రదేశ్ అని ప్రభుత్వం ఒక వైపు ప్రచారం ఎత్తుకోగా మరో వైపు అదే ప్రభుత్వం ఈ ఏడాదికి వ్యవసాయోత్పత్తులపై వేసిన రెండవ ముందస్తు అంచనాల్లో ఐదేళ్లలోకెల్ల అతి తక్కువ ఆహార ధాన్యాల ఉత్పత్తి ఉంటుందని వెల్లడించింది. వరి ఉత్పత్తి సైతం ఇప్పుడే కనిష్టంగా ఉంటుందని పేర్కొంది. 2023-24లో ఖరీఫ్, రబీ కలుపుకొని 85 లక్షల ఎకరాల్లో ఆహార పంటలు సాగవుతాయని, 154 లక్షల టన్నుల దిగుబడులొస్తాయని ఎస్టిమేట్ చేసింది. ఐదేళ్లల్లో ఆహార ధాన్యాల సాగు, ఉత్పత్తి ఇదే కనిష్టం. ఇక ఆహార పంటల్లో ప్రధానమైన వరి పంటదీ ఇదే పరిస్థితి. ఈ సంవత్సరం రెండు సీజన్లూ కలుపుకొని 49.25 లక్షల ఎకరాల్లో వరి సాగవుతుందని, 118.40 లక్షల టన్నుల ధాన్యం దిగుబడి లభిస్తుందని ప్రభుత్వ అర్థ గణాంకశాఖ తన రెండవ ముందస్తు అంచనాల్లో తెలిపింది. కరువు, అకాల భారీ వర్షాలు, మిచౌంగ్ తుపాన్ ప్రభావంతో ఈ తడవ అతి తక్కువ ఆహార ధాన్యాల ఉత్పత్తి వస్తోంది. విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కోవడంలో, ముందుగా అప్రమత్తం కావడంలో, రైతులకు సహాయ సహకారాలు అందించడంలో ప్రభుత్వం వైఫల్యం చెందడం వలన ఆహార ధాన్యాల సాగు, ఉత్పత్తి తగ్గుతోందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. వరి ధాన్యం దిగుబడి తగ్గుతోందన్న సూచనలతో ఇటీవలి కాలంలో బహిరంగ మార్కెట్‌లో అమాంతం పెరుగుతున్న బియ్యం ధరలు ప్రజలను ఠారెత్తిస్తున్నాయి. బియ్యం ఉత్పత్తి ఇంకా తగ్గుతున్న పక్షంలో ధరలకు మరింతగా రెక్కలొచ్చే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు తెలుపుతున్నాయి.



**ఐదేళ్లలో సాగు, ఉత్పత్తి**

| | ఆహార ధాన్యాలు | | వరి | |
|---|---|---|---|---|
| సంవత్సరం | ఏరియా | ఉత్పత్తి | ఏరియా | ఉత్పత్తి |
| 2019-20 | 102.17 | 164.69 | 55.62 | 130.62 |
| 2020-21 | 103.32 | 164.17 | 61.27 | 131.39 |
| 2021-22 | 103.60 | 169.57 | 60.50 | 135.24 |
| 2022-23 | 98.97 | 169.30 | 56.25 | 133.65 |
| 2023-24 | 85.12 | 154.73 | 49.25 | 118.40 |

ఏరియా: లక్షల ఎకరాలు, ఉత్పత్తి: లక్షల టన్నులు

### వైపరీత్యాల ప్రభావం

2023 ఖరీఫ్‌ను వర్షాభావం వెంటాడింది. కరువు మండలాల ప్రకటనలో ప్రభుత్వం అనావృష్టి తీవ్రతను తక్కువ చేసి చూపించింది. తుపాన్ నష్టం అంచనాల్లోనూ అలాగే వ్యవహరిం చింది. కానీ పంటల సాగు, దిగుబ డుల దగ్గర దాచలేకపోయింది. రబీలో ఫిబ్రవరి 7 నాటికి ఆహార ధాన్యాల సాగు ఏమంత ఆశాజ నకంగా లేదు. ఆహార ధాన్యాలు సాధారణ సాగులో 67 శాతమే సాగయ్యాయి. వరి 65 శాతమే సాగైంది. ప్రభుత్వం వేసిన ముందస్తు అంచనాల మేరకు కూడా పంటలు సాగయ్యే పరిస్థితి కనిపించట్లేదు.

### ఇంకా తగ్గొచ్చు

రెండవ ముందస్తు అంచనాలు డిసెంబర్, జనవరిలో వస్తాయి. ఖరీఫ్ ఎస్టిమేషన్స్ కొంత వరకు దగ్గరగా ఉంటాయి తప్ప రబీకి సంబంధించి ఊహలుగానే ఉంటాయి. చివరాఖరుకొచ్చేసరికి ఇప్పుడు వేసిన అంచనాలు తగ్గిన సందర్భాలున్నాయి. 2021-22లో ఆహారధాన్యాల దిగుబడులు 169 లక్షల టన్నులొస్తాయని రెండవ మిగతా 7లో



సంబరాల్లో మునిగిన పిటిఐ కార్యకర్తలు

## ఇమ్రాన్ పార్టీ ముందంజ

- పాక్ ఎన్నికల ఫలితాలు

**ఇస్లామాబాద్ :** పాకిస్తాన్ సార్వత్రిక ఎన్నికల్లో మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ నేతృత్వంలోని పాకిస్తాన్ తెహ్రిక్ ఇ ఇన్సాఫ్ (పిటిఐ) పార్టీ అన్యూహమైన విజయాలను సాధించింది. ఆ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఇమ్రాన్‌ఖాన్ జైలులో ఉండడం...ఎన్నికల్లో పోటీకి ఆయనను అనర్హుడిగా ప్రకటించడం,.. ఆ పార్టీ ఎన్నికల గుర్తును రద్దు చేయడం.. ప్రచారం కూడా సరిగా చేసుకోనివ్వకపోవడం.. ఇన్ని ప్రతికూల పరిస్థితుల మధ్య ఆ పార్టీ ఇతర ప్రధాన పార్టీలను వెనక్కు నెట్టి అత్యధిక స్థానాలు గెలుచుకోవడం విశేషం. ప్రజాస్వామ్యం పట్ల పాక్ ప్రజల్లో పెరుగుతున్న ఆకాంక్షకు ఇదొక నిదర్శనం. 265 స్థానాలకు నేరుగా జరిగిన ఈ పార్లమెంటు ఎన్నికల్లో ఇంతవరకు 217 సీట్ల ఫలితాలను ప్రకటించారు. ఇందులోపిటిఐ మద్దతుతో పోటి చేసిన మిగతా 7లో

## నోడల్ అధికారులకు ఒక రోజు శిక్షణ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో త్వరలో జరుగనున్న సాధారణ ఎన్నికల నేపథ్యంలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల నిర్వహణ ( ఇవిఎం మేనేజ్‌మెంట్ సిస్టమ్ -ఇఎంఎస్ 2.0)పై నోడల్ అధికారులకు హైదరాబాద్‌కు చెందిన ఇసిఐఎల్ అధికారుల బృందం ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించింది. సచివాలయంలోని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. బీహార్, గోవా రాష్ట్రాలతో పాటు లడక్, లక్ష్యద్వీప్, పుదుచ్చేరి, చండీఘర్ కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన నోడల్ అధికారులు ,సాంకేతిక సహాయకులు ఆన్‌లైన్ ద్వారా పాల్గొన్నారు.

వీరితో పాటు రాష్ట్రం నుంచి అదనపు సిఇఒ ఎమ్ఎన్ హరీందర్‌ప్రసాద్, హైదరాబాద్‌కు చెందిన ఇసిఐఎల్ సీనియర్ అధికారి డిజిపిఎం ఎపి రాజు,నేతృత్వంలోని అధికారుల బృందం పాల్గొని నోడల్ అధికారులకు సమగ్రమైన అవగహన కల్పించారు. ఇవిఎంల నిర్వహణలో ఎటువంటి సాధారణ ,సాంకేతిక సమస్యలు ఉత్పన్నమైనా వాటిని తక్షణమే ఏ విధంగా ఎదుర్కోవాలనే అంశంపై శిక్షణా కార్యక్రమంలో నోడల్ అధికారులకు వివరించారు. ఇవిఎంల మొదటి స్థాయి తనిఖీ, కమిషనింగ్ పాటు మొదటి, రెండవ రాండమైజేషన్ ఏ విధంగా చేయాలి? పనిచేయని ఇవిఎంలను ఏ విధంగా మరమ్మతు చేయాలి? ఎన్నికలరోజు, ఓట్ల లెక్కింపురోజు వాటిని ఏ విధంగా వినియోగించాలనే అంశాలపై శిక్షణలో అధికారులు వివరించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో హైదరాబాద్‌కు చెందిన ఇసిఐఎల్‌కు చెందిన టెక్నికల్ మేనేజరు ఎం.శంకర్, ఇంజనీరు సిజి ఆదిత్యతో పాటు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయపు అధికారులు పాల్గొన్నారు.

**ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006**

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.
అభిప్రాయాలు పంపదలిస్తే..
**స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,**
**ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,**
**అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,**
**గుంటూరు జిల్లా - 522 501**కు కానీ
**editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

## 33 పోస్టుల భర్తీకి ఎపిపిఎస్‌సి నోటిఫికేషన్లు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభుత్వ శాఖల్లోని 33 పోస్టుల భర్తీకి ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఎపిపిఎస్‌సి) నోటిఫికేషన్లు విడుదల చేసింది. కాలుష్య నియంత్రణ మండలిలో గ్రేడ్-2 విశ్లేషకుల పోస్టులు 18, ఎపి టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ సర్వీస్‌లో అసిస్టెంట్ డైరెక్టరు పోస్టులు 7, మెడికల్ ఎడ్యుకేషన్ సర్వీస్‌లో లైబ్రేరియన్ పోస్టులు 4, వికలాంగ, వృద్ధుల, ట్రాన్స్‌జెండర్ సంక్షేమ సర్వీస్‌లో అసిస్టెంట్ డైరెక్టరు పోస్టులు 2, గిరిజన సంక్షేమశాఖలో అసిస్టెంట్ ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్, ఎపి గ్రౌండ్ వాటర్ సర్వీస్‌లో అసిస్టెంట్ కెమిస్ట్ పోస్టులు ఒకటి చొప్పున భర్తీకి నోటిఫికేషన్లు విడుదల చేశారు. దరఖాస్తుల ప్రారంభ తేదీలు, ఇతర వివరాల కోసం కమిషన్ psc.ap.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని కమిషన్ కార్యదర్శి ప్రదీప్ కుమార్ పేర్కొన్నారు.

## ఓటర్ల నమోదులో అవకతవకలపై మరో ఉద్యోగి సస్పెన్షన్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

తిరుపతి నియోజకవర్గం ఉప ఎన్నికకు చెందిన ఓటర్లకు సంబంధించి దొంగ ఓటర్ల నమోదు ఘటనలో మరో అధికారిపై వేటు పడింది. తిరుపతి ఉప ఎన్నిక సమయంలో తిరుపతి మున్సిపల్ కమిషనరుగా పనిచేసి, ప్రస్తుతం విజయవాడ మెప్మా అసిస్టెంట్ డైరెక్టరుగా ఉన్న పి చంద్రమౌళీశ్వర్‌రెడ్డిని శుక్రవారం ప్రభుత్వం సస్పెండ్ చేసింది. ఈ మేరకు జిఓ 154ను మున్సిపల్‌శాఖ విడుదల చేసింది.

సుమారు 35 వేల డిజిటల్ ఎపిక్ కార్డులు, ఓటర్లకు సంబంధించి ఇఆర్ఓఎన్‌ఇటి నుంచి డౌన్‌లోడ్ చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న కేసులో ప్రభుత్వం సస్పెండ్ చేసింది. ఇదే విషయంపై అన్నమయ్య జిల్లా కలెక్టరు గిరీశాను ప్రభుత్వం ఇటీవల సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే.

## రమణయ్య హత్య కేసులో దోషులను శిక్షించాలి : బొప్పరాజు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

తహశీల్దారు రమణయ్య హత్య కేసులో దోషులను ప్రభుత్వం సత్వరమే అరెస్టు చేసి శిక్షించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎపి రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బొప్పరాజు వెంకటేశ్వర్లు, కె రమేష్‌కుమార్ నేతృత్వంలోని ప్రతినిధుల బృందం.. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేసింది. విచారణ పేరుతో దోషులను శిక్షించేందుకు కాలయాపన చేస్తున్న విషయాన్ని ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోవాలని కోరారు. సిఎస్, సిసిఎల్ఎను కలిసిన వారిలో అసోసియేషన్ రాష్ట్ర సహాధ్యక్షులు పితాని త్రినాథరావు, గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ సాంబశివరావు ఉన్నారు.

# ప్రత్యేక హోదా సాధనకు ఉద్యమం తీవ్రతరం

- సదస్సులో వక్తల పిలుపు




సదస్సులో నినాదాలు చేస్తున్న లక్ష్మీనారాయణ, చలసాని శ్రీనివాస్, రాము, ప్రసన్న, అశోక్, జయచంద్ర తదితరులు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ప్రత్యేక హోదా సాధనకు ఉద్యమం తీవ్రతరం చేయాల్సిన అవసరం ఉందని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. ప్రత్యేక హెూదా, విభజన హామీల సాధన సమితి ఆధ్వర్యంలో "ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హెూదా ఇవ్వాలి, విభజన సమస్యల పరిష్కారం" అనే అంశంపై శుక్రవారం నాడిక్కడ ఇండియన్ ఇంటర్నేషనల్ సెంటర్ (ఐసిసి)లో సిబిఐ మాజీ అధ్యక్షుడు జెడి లక్ష్మీనారాయణ అధ్యక్షతన సదస్సు జరిగింది. ప్రత్యేక హెూదా, విభజన హామీల సాధన సమితి అధ్యక్షులు చలసాని శ్రీనివాస్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌కు తీవ్ర అన్యాయం జరిగిందని, ఇలాంటి సదస్సు ద్వారా మేధావుల అభిప్రాయాలను తెలుసుకొని ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామన్నారు. ప్రతి రాజకీయ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రత్యేక హెూదా అంశాన్ని చేర్చాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని ప్రధాన రాజకీయ పక్షాలు ఢిల్లీలో తిష్టవేసి పొత్తుల కోసం ఆరాటపడుతున్నాయని, అంతేతప్ప ప్రత్యేక హెూదా గురించి మాట్లాడటం లేదని విమర్శించారు. సిబిఐ మాజీ డైరెక్టర్ జెడి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ రాష్ట్రం అప్పుల్లో మునిగిపోయిందని, పరిపాలన దెబ్బ తిన్నదని విమర్శించారు. ప్రొఫెసర్ కేశవ్ కుమార్ "లక్ష్యాలను సాధించడానికి రాజకీయ వ్యవస్థను ఎలా ప్రభావితం చేయాలి", ప్రొఫెసర్ చిట్టిబాబు " ప్రత్యేక హెూదా-నిరుద్యోగం, ప్రొఫెసర్ సుకుమార్ "పౌర సమాజాన్ని ఎలా సమీకరించాలి ?", డాక్టర్ పెంటపాటి పుల్లారావు "పోలవరం-నిర్వాసితులు ", ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్ "తెలుగు రాష్ట్రాల ప్రస్తావనతో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం", ప్రొఫెసర్ ఎన్.ఆర్. సదా శివ రెడ్డి "ప్రత్యేక హెూదా ప్రయాణం-పోరాటం" వంటి అంశాలపై మాట్లాడారు. ఈ సదస్సులో డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు వై.రాము, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కె.ప్రసన్న కుమార్, ఎ. అశోక్, డివైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు జయచంద్ర, శివ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఎపిలో సంక్షేమ కార్యక్రమాలు భేష్

- ఎన్‌డిసి ఎయిర్‌వైస్ మార్షల్ మనీష్‌కుమార్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో పేదల అభ్యున్నతికి ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ కార్యక్రమాలు, పథకాలు అద్భుతమని ఢిల్లీ నేషనల్ డిఫెన్స్ కళాశాల సీనియర్ డైరెక్టింగ్ స్టాఫ్, ఎయిర్‌వైస్ మార్షల్ మనీష్ కుమార్ గుప్తా తెలిపారు. కళాశాలకు చెందిన 20 మంది ప్రతినిధుల బృందం మనీష్‌కుమార్ నేతృత్వంలో రాష్ట్రంలో పర్యటించింది. ఇందులో భాగంగా సచివాలయంలో శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో సమావేశమైంది. ఈ సందర్భంగా మనీష్ మాట్లాడుతూ.. విశాఖపట్నం, అరకు తదితర ప్రాంతాల్లో రెండు రోజులు పర్యటించి రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యం, మహిళా, రైతు సంక్షేమ పరంగా అమలు చేస్తున్న పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించామని చెప్పారు. దేశంలో వివిధ రాష్ట్రాల్లో పర్యటించి ఆయా రాష్ట్రాలు అమలు చేస్తున్న పథకాలు, కార్యక్రమాలను పరిశీలించామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్ మాట్లాడుతూ.. విద్య, వైద్యం, మహిళా, రైతు సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతను ఇచ్చి పలు కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను పాఠశాల విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. జెన్‌కో ఎమ్‌డి కెవిఎన్ చక్రధరబాబు మాట్లాడుతూ.. రాష్ట్రంలో 24 గంటల నిరంతర విద్యుత్ అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు. వ్యవసాయ రంగ అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను వ్యవసాయశాఖ కమిషనరు జి శేఖర్‌బాబు వివరించారు.

## 72 కేజీల గంజాయి పట్టివేత

- రవాణాకు సహకరించిన రైల్వే పోలీసులు, ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం (శ్రీకాకుళం జిల్లా)

ఒడిశా నుంచి పూణేకు తరలిస్తున్న 72 కేజీల గంజాయిని శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గంజాయిని తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులతోపాటు డబ్బులు తీసుకుని రవాణాకు సహకరించిన ఇద్దరు రైల్వే పోలీసులను అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను సిఐ ఇమాన్యుల్ రాజు శుక్రవారం మీడియాకు వెల్లడించారు. ఒడిశా రాష్ట్రం పర్లాకిమిడికి చెందిన ఉత్తరగౌడ్, కుషా బియాన్, కుంజు గొమాంగ్ ఈ నెల 7న బరంపురం నుంచి ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్‌కు నాలుగు బ్యాగులు, నాలుగు సూట్‌కేసులతో కారులో వచ్చారు. అక్కడ నుంచి కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో పూణే వెళ్లేందుకు వేచి ఉండగా ఆర్‌పిఎఫ్ కానిస్టేబుళ్లు దుదిస్ట్ బెహరా, బినోద్ బెహరా వారిని గమనించారు. వారిని విడిచిపెట్టేందుకు రూ.20 వేలు డిమాండ్ చేశారు. రైల్వేస్టేషన్ బయట ఎటిఎంకు వెళ్లి రూ.18 వేలు డ్రా చేసి వారికిచ్చే లోగా రైలు వెళ్లిపోయింది. స్టేషన్ సమీపంలోని ఆలయం వద్ద అనుమానాస్పదంగా ఉన్న వీరిని ఎస్ఐ వి.సత్యనారాయణ అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద ఉన్న నాలుగు బ్యాగులు, నాలుగు సూట్‌కేసుల్లో ఉన్న 72 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వీరిని విచారించగా రైల్వే పోలీసుల వ్యవహారం బయటకు రావడంతో వారినీ అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

# ఆర్థిక విధానాలతో రాష్ట్రం సర్వనాశనం

- యనమల రామకృష్ణుడు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరు విధ్వంసకర ఆర్థిక విధానాలతో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని శాసనమండలి ప్రతిపక్షనేత యనమల రామకృష్ణుడు విమర్శించారు. బ్యాడ్‌డెట్, హైకరెప్షన్, హై ఇన్‌ఫ్లేషన్, హై అన్ ఎంప్లాయిమెంట్, హై డెఫిసిట్స్, సిస్టమ్స్ కొలాప్స్ వంటి విధానాలు అమలు చేస్తున్నారని శుక్రవారం ఒక ప్రకటనలో విమర్శించారు. ఐదేళ్లలో రూ.6 లక్షల కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. 2-3 శాతం కంటే ఎక్కువ ఉండకూడని ద్రవ్యోల్బణం 8.5 శాతంగా ఉందని పేర్కొన్నారు. రాష్ట్రంలో 24 శాతం పట్టభద్రులు నిరుద్యోగులుగా ఉన్నారని తెలిపారు. 2018-19లో రూ.35,467 కోట్లుగా ఉన్న ద్రవ్యలోటు 2022-2023 నాటికి రూ.52,508 కోట్లకు చేరుకుందని, రెవెన్యూ లోటు రూ.13,899 కోట్ల నుంచి రూ.43,487 కోట్లకు చేరుకుందని వివరించారు. టిడిపి హయాంలో రెవెన్యూ రాబడుల్లో 12.12 శాతం ఉంటే ప్రస్తుతం 28 శాతంగా ఉందన్నారు. ఆర్థిక దుస్థితిపై అసెంబ్లీ సాక్షిగా చేదు నిజాలను దాచిపెట్టి మసిపూసి మారేడు కాయ చేయాలని ప్రభుత్వం చూస్తోందని విమర్శించారు.

ఐదేళ్లలో రూ.5 లక్షల కోట్లు కేవలం బడ్జెటేతర అప్పులు తెచ్చారని పేర్కొన్నారు. 2021-22లో రూ.11,22,837 కోట్లుగా ఉన్న స్థూల ఉత్పత్తి 2022-23లో రూ.13,17,728 కోట్లకు పెరిగిందని తప్పుడు లెక్కలు ప్రచురించారని విమర్శించారు. ఆర్‌బిఐ ద్వారా 2022-23లో తీసుకున్న రూ.1,18,039 కోట్లు ఏం చేశారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. జగన్ పాలనలో పేదలు మరింత పేదలయ్యారని తెలిపారు. పేదల ఆరోగ్యం కోసం ఖర్చు చేయాల్సిన ఆరోగ్యశ్రీకి రూ.1,200 కోట్లు ప్రభుత్వం బకాయి పెట్టిందని, పేదరిక నిర్మూలన అంటే ఇదేనా అని ప్రశ్నించారు.

**బిసి కులగణనకు విశ్వసనీయత ఉంటుందా?**
**మాజీ మంత్రి కొల్లు రవీంద్ర**

వలంటీర్లు చేస్తున్న బిసి కులగణనకు విశ్వసనీయత, చట్టబద్ధత ఉంటుందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పగలరా? అని మాజీ మంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కొల్లు రవీంద్ర ప్రశ్నించారు. కేవలం బిసిల్ని మరోసారి వంచించి ఎన్నికల్లో లబ్ధిపొందడానికే హడావుడిగా కేంద్రాన్ని సంప్రదించకుండా కులగణనకు శ్రీకారం చుట్టారని విమర్శించారు. టిడిపి కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కులగణన పేరుతో ప్రజల వ్యక్తిగత వివరాలు సేకరించి ఎన్నికల వేళ వారిని భయపెట్టి లబ్ధిపొందాలన్నదే జగన్ కపట ఆలోచన అని విమర్శించారు.

జగన్ పతనం ప్రారంభమైందని తాజాగా జరిగిన బడ్జెట్ సమావేశాలు చూశాక ప్రజలకు అర్థమైందని టిడిపి నేత బొండా ఉమామహేశ్వరరావు విమర్శించారు. 26 మంత్రుల్లో కేవలం ముగ్గురు, నలుగురు మాత్రమే సభకు రావడం అందుకు నిదర్శనమని అన్నారు. జగన్ హడావుడిగా పరుగులు పెట్టి మరీ ఢిల్లీ వెళ్లినా అమిత్ షా ముఖం చాటేశారని పేర్కొన్నారు. రాజ్యసభ అభ్యర్థుల ఎంపికలో సొంత సామాజిక వర్గానికే పెద్దపీట వేశారని టిడిపి ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ విమర్శించారు.

## నైపుణ్యాభివృద్ధిలో 8 ఎంఒయులు

- దేశంలో స్కిల్ డిజైన్ రాష్ట్రాల్లో ఎపికి అగ్రస్థానం
- విశాఖలో ఎపిఎస్ఎస్‌డిసి సదస్సును ప్రారంభించిన ఆర్థిక మంత్రి




సదస్సులో మాట్లాడుతున్న మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

రాష్ట్రంలో వివిధ రంగాలకు చెందిన పలు సంస్థలతో నైపుణ్య శిక్షణలో ఎనిమిది అవగాహనా ఒప్పందాలను రాష్ట్ర ప్రభుత్వం కుదుర్చుకుందని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఉదయం విశాఖ రుషికొండ బీచ్‌రోడ్డులో గల రాడిసన్ బ్లూ హోటల్‌లో నేషనల్ స్కిల్ కాన్‌క్లేవ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా 'స్కిల్ కాస్కేడింగ్ పారడైమ్'ను ఆవిష్కరించారు. గడచిన 30 ఏళ్లలో చాలా మార్పులు సంభవించాయని, తమ హయాంలో అందుబాటులో ఉన్న వనరులను బట్టి నైపుణ్య శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించే చర్యలు చేపట్టామని అన్నారు. తమ ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో నైపుణ్యాభివృద్ధి కోసం జరిగిన కృషిని వీడియో ప్రదర్శన ద్వారా వివరించారు. రెండున్నరేళ్లలో రాష్ట్రంలో నైపుణ్యాభివృద్ధి కోసం ప్రభుత్వం జరిపిన కృషితో దేశంలో స్కిల్‌ను డిజైన్ చేసిన రాష్ట్రాల్లో ఎపి నెంబర్ వన్ స్థానంలో ఉందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 192 స్కిల్ హబ్స్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. ఈ డెవలప్‌మెంట్ హబ్స్‌లో స్థానిక పరిశ్రమలకు 50 శాతం వరకూ సరిపడా పదో తరగతి వరకూ చదివిన వారికి శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించేలా చర్యలు చేపట్టామన్నారు. మిగతా సగం మందికి దేశంలో ఇతర ప్రాంతాలకు సరిపడేలా ట్రైనింగ్ ఇస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో సెంటర్ ఆఫ్ ఎక్సెలెన్స్‌కు 27 కేంద్రాలు ఏర్పాటు చేశామని, ఇక్కడ కోర్సు పూర్తిచేసి బయటకొస్తే రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకూ జీతం లభించనుందని అన్నారు. కార్యక్రమంలో ఎపిఎస్-ఎస్‌డిసి ఎమ్‌డి, సిఇఒ డాక్టర్ వినోద్ కుమార్, ఛైర్మన్ కె.అజయ్ రెడ్డి, ఎపిలోని పలు పరిశ్రమలు, విద్యాసంస్థల నుంచి 194 మంది ప్రతినిధులు పాల్గొన్నారు.

## వైఎస్ బొమ్మ పెట్టుకుని ఓట్లడిగే వైసిపి నాయకులకు సిగ్గులేదు

- రాష్ట్ర ప్రజలను మోడీ మోసం చేశారు
- మాజీ ఎంపి కెవిపి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వైఎస్ రాజశేఖర్‌రెడ్డి బొమ్మ పెట్టుకుని ఓట్లడిగే వైసిపి నాయకులకు సిగ్గులేదని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కెవిపి రామచంద్రరావు అన్నారు. శుక్రవారం పిసిసి కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలవరంపై రాష్ట్ర ప్రభుత్వ వైఖరి ఏమిటో తెలియడం లేదని, ఈ విషయంలో ఎపిలోని భావితరాలు జగన్ ప్రభుత్వాన్ని, గతంలో ఉన్న టిడిపి ప్రభుత్వాన్ని క్షమించబోవని పేర్కొన్నారు. పోలవరం పూర్తయితే చాలా వరకూ ఎత్తిపోతల పథకాలు నిర్మించుకునే వీలుందని, రెండువేల టిఎంసిల నీరు వినియోగించుకోవచ్చని తెలిపారు. వైసిపి ప్రభుత్వం పోలవరాన్ని ఎటిఎంలా వాడుకుంటోందని కేంద్రంలో ఉన్న వ్యక్తులు తనకు చెప్పారని కెవిపి పేర్కొన్నారు. అది బ్యారేజీలా మిగిలిపోకూడదని అన్నారు. ఢిల్లీ వెళ్లిన సిఎం జగన్ కేంద్రం నుండి ఏం సాధించుకొచ్చారో తెలియదని, పాత అంశాలనే చెప్పి చెప్పి మళ్లీ ప్రజలను మభ్యపెడుతున్నారని వివరించారు. సొంత చెల్లెలు, తల్లిపై అసభ్య పదజాలంతో పోస్టులు పెడుతున్న వారిపై చర్యలు తీసుకోలేని అసమర్థ ప్రభుత్వం ఎపిలో ఉందని తెలిపారు. ఎపిలో కేసులు పెడితే తీసుకోరని, పొరుగు రాష్ట్రంలో పెడితే సహకరించరని పేర్కొన్నారు. ప్రధాని మోడీ ప్రజలను, ఎపిని మోసం చేశారని, హోదా ఇస్తానని తిరుపతిలో చేసిన ప్రకటన ఏమైందో తెలియదని పేర్కొన్నారు. టిడిపి అధినేత చంద్రబాబు పొత్తులు మార్చడంలో బీహార్లో నితీష్‌కుమార్‌ను మించిపోయారని అన్నారు. రాష్ట్రానికి బిజెపి ఏమి చేసిందో వైసిపి, టిడిపి నాయకులు చెప్పాలని డిమాండ్ చేశారు.

# బిజెపిని, ఆ పార్టీతో పొత్తు కలిసే టిడిపి-జనసేన, నిరంకుశ వైసిపిని ఓడించండి

(మొదటిపేజీ తరువాయి)

ఓడించి బుద్ధి చెప్పాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలో అమిత్ షాతో చంద్రబాబు సమావేశమై చర్చిస్తుండగానే రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మోడీ నుండి సమన్లు అందుకుని పరుగులు తీశారన్నారు. ఒక చేత్తో వైసిపిని మరో చేత్తో తెలుగు దేశం పార్టీని ఆడిస్తూ రాష్ట్రాన్ని వినాశపుటంచలకు నెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మూడు పార్టీలు బిజెపి పల్లకి మోస్తూ రాష్ట్ర ప్రయోజనాల్ని పణంగా పెట్టి ప్రజలకు అన్యాయం చేస్తున్నాయని విమర్శించారు. నిరంకుశ పద్ధతుల్లో ప్రజలను అణిచివేస్తూ రాష్ట్రంలో వైసిపి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం బిజెపి కొమ్ముకాస్తున్నదని, ప్రజల తీర్పుకు భిన్నంగా ఈ పార్టీలు ప్రజాభీష్టానికి వ్యతిరేకంగా నడుచుకుంటున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**ఫిబ్రవరి 20 విజయవాడలో రాష్ట్ర సదస్సు**

బిజెపి-టిడిపి- జనసేన కూటమిని ఈ ఎన్నికల్లో ఓడించాలని విజ్ఞప్తి చేశారు. సిపిఎం, సిపిఐ సంయుక్త ఆధ్వర్యంలో ఫిబ్రవరి 20 తేదీన విజయవాడలో రాష్ట్ర సదస్సు నిర్వహించనున్నట్లు, ఆ సదస్సుకు బిజెపి కి మద్దతు నిచ్చే వైసీపీ టిడిపి జనసేన మినహా మిగతా లౌకిక పార్టీలను ఆహ్వానించనున్నట్లు తెలిపారు. ఈ సదస్సులో రాజకీయ పార్టీలతో పాటు ప్రముఖ ప్రజాస్వామిక లౌకికవాదులు కూడా పాల్గొంటారని తెలిపారు.

**ఫిబ్రవరి 16 దేశవ్యాప్త కార్మిక రైతుల ఆందోళనకు మద్దతు**

ఫిబ్రవరి 16న దేశవ్యాప్తంగా జరగనున్న కార్మిక కర్షక ఆందోళనను బలపరచాలని వి. శ్రీనివాసరావు, రామకృష్ణ విజ్ఞప్తి చేశారు విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం, రైతుల గిట్టుబాటు ధరల కోసం, రుణ విముక్తి కోసం, కార్మికుల కనీస వేతనాల కోసం, బిజెపి మతోన్మాదానికి వ్యతిరేకంగా ఈ ఆందోళన సాగుతున్నదని తెలిపారు. రాష్ట్ర ప్రజలంతా దీనిని బలపరచాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, సిహెచ్.బాబూరావు, డి.రమాదేవి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జెల్లి విల్సన్, అక్కినేని వనజ పాల్గొన్నారు.

## మున్సిపల్ ఉపాధ్యాయుల సర్వీస్ రూల్స్ విడుదల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మున్సిపల్ పాఠశాలల్లోని ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వం సర్వీస్ రూల్స్ విడుదల చేసింది. ఈ మేరకు 7, 8, 9, 10 జిఓలను పాఠశాల విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ శుక్రవారం విడుదల చేశారు. మున్సిపాల్టీ, కార్పొరేషన్, గ్రేటర్ కార్పొరేషన్‌లలో ఉన్న ఉపాధ్యాయులు ఏ పరిధిలో అయితే పనిచేస్తున్నారో ఆ పరిధిలోనే బదిలీ అవుతారు. 2016 ప్రకారం సర్వీస్ రూల్స్ నిబంధనలు ఉన్నాయి.

# భారతరత్న అవార్డుపై స్పందనలు

**గర్వకారణం : గవర్నరు**

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మాజీ ప్రధానులు పివి నరసింహారావు, చరణ్‌సింగ్, ఎంఎస్ స్వామినాథన్‌కు కేంద్ర ప్రభుత్వం దేశ అత్యున్నత పురస్కారమైన భారతరత్న అవార్డును ప్రకటించడం పట్ల గవర్నరు అబ్దుల్ నజీర్ హర్షం వ్యక్తం చేశారు. పివి నరసింహారావు కేంద్ర స్థాయిలో వివిధ హోదాల్లో పనిచేశారని, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా, ప్రధానిగా దేశ ఆర్థిక సరళీకరణ, అభివృద్ధి, సంక్షేమానికి గట్టి పునాది వేశారని గవర్నరు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తన జీవితమంతా రైతుల హక్కులు, సంక్షేమం కోసం అంకితం చేసిన మాజీ ప్రధాని చరణ్‌సింగ్, హరిత విప్లవ పితామహుడు ఎంఎస్ స్వామినాథన్‌కు వ్యవసాయ రంగంలో చేసిన సేవలకు గుర్తింపుగా, దేశం వ్యవసాయ రంగంలో స్వావలంభన సాధించడంలో ఆయన పాత్ర ఎంతో కీలకమైందని అన్నారు.

**విలువలు కలిగిన నేత పివి : సిఎం జగన్**

రాజనీతిజ్ఞుడు, రాజకీయ, నైతిక విలువలు కలిగిన పండితుడు, మాజీ ప్రధాని పివి నరసింహారావు అత్యున్నత పౌరపురస్కారం భారతరత్న అవార్డు పొందడం తెలుగు మాట్లాడే ప్రజలందరికీ ఇది గౌరవమని సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. రైతాంగం కోసం పోరాడిన మాజీ ప్రధాని చౌదరి చరణ్‌సింగ్, హరిత విప్లవ పితామహుడు ఎంఎస్ స్వామినాథన్‌కు భారతరత్న ప్రదానం చేయడం యావత్ జాతి గర్వించదగ్గ విషయమని పేర్కొన్నారు.

**జాతి గర్వించదగిన నేత పివి : చంద్రబాబు**

తెలుగు జాతి గర్వించదగిన మహోన్నత వ్యక్తిత్వం కలిగిన రాజనీతిజ్ఞుడు మాజీ ప్రధాని పివి నరసింహారావు అని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆయనకు భారతరత్న ఇవ్వడం సంతోషకరమని అన్నారు. దేశం ప్రపంచ స్థాయిలో పోటీపడేలా తీర్చిదిద్దడంతోపాటు దేశ వ్యాప్తంగా ఎందరికో ఆయన స్ఫూర్తి ప్రధాత అని పేర్కొన్నారు.

**పివికి సముచిత గౌరవం : పవన్‌కల్యాణ్**

ఆర్థిక వ్యవస్థలో ఆర్థిక సంస్కరణలకు నాంది పలికిన నాయకుడు పివి నరసింహారావు అని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సిఎంగా, దేశ, రక్షణ, దౌత్య సంబంధ విషయాల్లో గణనీయమైన విజయాలు సాధించారన్నారు. మరణానంతరం ఆయనకు భారతరత్న రావడం తెలుగుజాతి అందరికీ గర్వకారణమని అన్నారు.

**భారతావని గర్వించదగిన రత్నాలు : పురందేశ్వరి**

భారతావని గర్వించదగిన రత్నాలు మాజీ ప్రధాని పివి నరసింహారావు, హరిత విప్లవ పితామహులు ఎంఎస్ స్వామినాథన్‌కు భారతరత్న ఇవ్వడం హర్షించదగిన పరిణామమని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పురందేశ్వరి పేర్కొన్నారు. నిజమైన రాజనీతిజ్ఞుడు పివి, నేల పుత్రుడు ఎంఎస్ స్వామినాథన్ ఈ గౌరవానికి అర్హులు అని అన్నారు.



దీక్షల్లో కూర్చున్న స్టీల్‌ప్లాంట్ కార్మికులు

## రైతు ఉద్యమ స్ఫూర్తితో 'ఉక్కు' పోరాటం

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

నల్ల వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా విజయం సాధించిన రైతు ఉద్యమ స్ఫూర్తితో వైజాగ్ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు పోరాటం కొనసాగిస్తున్నట్లు విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు తెలిపారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు శుక్రవారానికి 1093వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షల్లో స్టీల్ కోక్ ఓవెన్ విభాగానికి చెందిన ఉద్యోగులు కూర్చున్నారు. వారినుద్దేశించి పోరాట కమిటీ నాయకులు పివిఎస్‌బి శ్రీనివాసరాజు మాట్లాడుతూ ఒకవైపు ఉత్పత్తిని కొనసాగిస్తూనే మరోవైపు ప్లాంటును కాపాడుకోవడానికి కార్మికులు అహర్నిశలూ కష్టపడుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం వెనక్కి తగ్గి విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలోనే కొనసాగిస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తమ పోరాటం రానున్న కాలంలో మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు.

## మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తాం

- సింఅండ్‌డిఎంఎ శ్రీకేష్ బి లత్కర్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మున్సిపల్ కార్మికులు 16 రోజులు చేపట్టిన సమ్మె సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటామని సి అండ్ డిఎంఎ శ్రీకేష్ బి లత్కర్ హామీ ఇచ్చారు. శుక్రవారం ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ఉమామహేశ్వరరావు, నాయకులు బి ముత్యాలరావు, చైతన్య, మహేష్, శ్రీకాంత్ తదితరులు సి అండ్ డిఎంఎ శ్రీకేష్ బి లత్కర్‌ను కలిశారు. ఇంజినీరింగ్ విభాగంలోని సర్టిఫికెట్స్ లేని వివిధ సెక్షన్ల కార్మికులకు ట్రైనింగ్ ఇవ్వడానికి ఇప్పటికే చర్యలు తీసుకున్నామని వివరించారు. శిక్షణ అవసరమైన కార్మికుల వివరాలను పంపాలని అన్ని మున్సిపాలిటీలకు ఉత్తర్వులు ఇచ్చామని తెలిపారు. అలాగే రూ.21 వేలు, రూ.24 వేల వేతనాలకు సంబంధించి జిఓలపై ప్రభుత్వంతో చర్చిస్తున్నామని, త్వరలో జిఓలు వస్తాయని హామీ ఇచ్చారు. ఇంజినీరింగ్ విభాగంలో పనిచేసేవారి సమస్యలపై తొమ్మిది మంది అధికారులతో వేసిన కమిటీ నివేదిక ఇచ్చిందని, దానిపై అధ్యయనం చేస్తున్నామని తెలిపారు.




రాష్ట్ర మహాసభల సందర్భంగా జెండా ఆవిష్కరిస్తున్న సిహెచ్ కుమార్

## ప్రాథమిక హక్కులపై దాడిని తిప్పికొట్టండి

(మొదటిపేజీ తరువాయి)

ప్రమాదం వుందన్నారు. మెడికల్ రెప్రజెంటేటివ్‌లు ప్రజాపోరాటాల్లో భాగస్వామ్యం అవుతున్నందునే రాష్ట్రంలో 50ఏళ్లుగా ఎపిఎంఎస్‌ఆర్‌యు పటిష్టంగా వుందన్నారు. . ఈ ప్రారంభసభలో ఎపిఎంఎస్‌ఆర్‌యు రాష్ట్ర ప్రధానకార్యదర్శి యువి కృష్ణయ్య, సీనియర్ నాయకులు రాజ్‌మోహన్, తెలంగాణా నాయకులు నాగేశ్వరరావు, కర్నాటక నాయకులు చంద్రకుమార్, సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు, ఎఫ్ఎంఆర్ఐ జాతీయ ప్రధానకార్యదర్శి రమేష్ సుందర్, నాయకులు సునీల్‌కుమార్, సుబ్రాంషు, బెఫి రాష్ట్ర ప్రధానకార్యదర్శి అజయ్‌కుమార్, సీమాంధ్ర కెమిస్ట్రి డ్రగ్స్ అసోషియేషన్ కోశాధికారి సాదు ప్రసాద్, సిఐటియు నాయకులు ఎన్‌సిహెచ్ శ్రీనివాస్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## టిడిపి, వైసిపిలకు ఓటు వేస్తే బిజెపికి వేసినట్టే

(మొదటిపేజీ తరువాయి)

కొండత.. సంక్షేమ పథకాల లబ్ధి గోరంత అన్నట్టుగా ఉందని విమర్శించారు. అమ్మఒడి కింద ఒక్క బిడ్డకు రూ.13 వేలు ఇస్తే కుటుంబంలో మిగిలిన పిల్లల పరిస్థితి ఏంటి? అని ప్రశ్నించారు. జగన్ అన్న పథకాలు ఒక చేత్తో ఇస్తూ...మరో చేత్తో గుంజుకొనేలా ఉన్నాయని విమర్శించారు. మద్యం పేర సర్కారు దోపిడీకి పాల్పడుతుందని, జాబ్ క్యాలెండర్ పేరుతో నిరుద్యోగులను మోసం చేస్తోందని అన్నారు. గతంలో ఏడు వేల పోస్టులతో డిఎస్‌సి ప్రకటించిన చంద్రబాబును హేళన చేసిన జగన్, ఇప్పుడు చేసింది ఏంటి? అని ప్రశ్నించారు. ఇది దగా డిఎస్‌సి కాదా? అని అన్నారు. మోసపూరిత ప్రలోభాలకు లొంగకుండా రాష్ట్ర భవిష్యత్తు కోసం కాంగ్రెస్‌కు ఓటువేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు జెడి. శీలం, రఘువీరారెడ్డి, గిడుగు రుద్రరాజు, సుంకర పద్మశ్రీ, ఎ.అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగం రాలేదని వికలాంగురాలు ఆత్మహత్య

ప్రజాశక్తి- సింగరాయకొండ (ప్రకాశం జిల్లా)



కుసుమ (ఫైల్)

పిజి చదివినా ఉద్యోగం రాలేదని ఓ యువతి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న ఘటన సింగరాయకొండ రైల్వేస్టేషన్లో శుక్రవారం చోటు చేసుకుంది. ప్రకాశం జిల్లా జరుగుమల్లి మండలం, ఎడ్లూరుపాడు గ్రామానికి చెందిన దళిత యువతి పోకూరి కుసుమ (27) పుట్టుకతోనే వికలాంగురాలు. చదువుకు తగ్గ ఉద్యోగం రాలేదని మానసిక వేదనకు గురయ్యేవారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం ఎనిమిది గంటలకు సింగరాయకొండ రైల్వే స్టేషన్‌కు వచ్చారు. కృష్ణా ఎక్స్‌ప్రెస్ కింద పడేందుకు ప్రయత్నించినప్పటికీ కుదరకపోవడంతో ఆ తర్వాత వచ్చిన గూడ్స్‌బండి కింద పడ్డారు. పోలీసులు అప్రమత్తమై రైలును నిలుపుదల చేసి పరిశీలించగా..అప్పటికే ఆమె తల, మొండం రెండుగా విడిపోయి మరణించారు. పిజి వరకు కష్టపడి చదువుకుందని, ఉద్యోగం రాలేదని మానసికంగా ఆలోచిస్తూ ఉండేదని, ఇలా చేస్తుందని అనుకోలేదని తండ్రి రామయ్య బోరున విలపించారు. మృతదేహాన్ని ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## ఒకటినే వేతనాలు చెల్లించాలి

- ఎపి విద్యుత్ ట్రేడ్ యూనియన్ స్ట్రగుల్ కమిటీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు ప్రతినెలా ఒకటినే వేతనాలు చెల్లించాలని ఎపి విద్యుత్ ట్రేడ్ యూనియన్ స్ట్రగుల్ కమిటీ డిమాండ్ చేసింది. వేతనాల చెల్లింపులు ప్రతినెలా ఆలస్యమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగేళ్ల నుంచి ఏనాడూ ఒకటో తేదీన వేతనాలు ఇవ్వడం లేదని, ఎప్పుడు ఇస్తారో కూడా తెలియని పరిస్థితి ఉందని కమిటీ ఛైర్మన్ పి సుదర్శన్‌రెడ్డి, జనరల్ సెక్రటరీ వెన్నపూస సుబ్బిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఎపిజెన్‌కో విద్యుదుత్పత్తిలో దేశంలోనే ముందు వరుసలో ఉందని, ఎపి డిస్కమ్‌లు ఉత్తమ విద్యుత్ పంపిణీ సంస్థలు అవార్డులు పొందుతున్నాయని పేర్కొన్నారు. అందుకు కారణమైన ఉద్యోగులకు సకాలంలో వేతనాలు ఇవ్వకుండా ఉండటం ఏమిటని ప్రశ్నించారు. వేతనాల కోసం ఉద్యోగులు ఉద్యమాలు చేయాల్సిన పరిస్థితి కల్పించడం దారుణమని, యాజమాన్యాల్లో చీమకుట్టినట్లుగా కూడా స్పందన లేదని పేర్కొన్నారు.

ఉద్యోగుల ఆర్థిక సమస్యలను దృష్టిలో పెట్టుకుని సకాలంలో వేతనాలు చెల్లించాలని కోరారు. ఈ అంశంపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలని కోరారు. లేదంటే సోమవారం నుంచి ఆందోళనబాట పడతామని హెచ్చరించారు.

# అక్రమ అరెస్టులు దారుణం

- ఆశాలపై పెట్టిన కేసులను తక్షణమే ఎత్తేయాలి
- సమస్యలు పరిష్కరించాలని డిమాండ్
- రాష్ట్ర వ్యాప్తంగా విధుల బహిష్కరణ



తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద బైఠాయించి నిరసన తెలుపుతున్న ఆశావర్కర్లు

ప్రజాశక్తి-యంత్రాంగం

'చలో విజయవాడ' సందర్భంగా పోలీసుల అక్రమ అరెస్టులు, నిర్బంధాలను నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ఆశా వర్కర్లు శుక్రవారం విధులు బహిష్కరించి ధర్నాలు, ఆందోళనలు చేశారు. కనీస వేతనం అమలు చేయాలని, రాజకీయ వేధింపులు ఆపాలని, పని ఒత్తిడి తగ్గించాలని, హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహిళలని చూడకుండా పోలీసులు తమ పట్ల దారుణంగా వ్యవహరించారని అన్నారు. 'చలో విజయవాడ'కు వెళ్లిన వారిపై పెట్టిన అక్రమ కేసులను తక్షణమే ఎత్తేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. పశ్చిమగోదావరి జిల్లాలో పిహెచ్‌సిలు, అర్బన్ హెల్త్ సెంటర్ల వద్ద ధర్నాలు నిర్వహించారు. ఏలూరులోని అర్బన్ హెల్త్ సెంటర్‌లు, పిహెచ్‌సిలతోపాటు చాట్రాయిలో ర్యాలీ, బయ్యన్నగూడెంలో రాస్తారోకో చేపట్టారు. బుట్టాయగూడెంలో రాస్తారోకో చేపట్టి అనంతరం పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజుకి సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద బైఠాయించి ఆందోళన చేశారు.

కాకినాడ జిల్లా ఏలేశ్వరంలో మానవహారం చేపట్టారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ జిల్లాల్లోని తహశీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నాలు నిర్వహించారు. ఈ ధర్నాలకు సిపిఎం, సిఐటియు నాయకులు మద్దతు తెలిపారు. విశాఖలోని జగదాంబ సెంటర్ వద్ద ధర్నా, గాజువాక, భీమిలిలో ర్యాలీలు, మానవహారాలు చేపట్టారు. అనకాపల్లి జిల్లా వ్యాప్తంగా రాస్తారోకోలు, అల్లూరి జిల్లా పాడేరు, రంపచోడవరం డివిజన్లలో నిరసనలు తెలిపారు. నంద్యాల జిల్లా ఆత్మకూరులో ర్యాలీ చేపట్టారు. ఆశావర్కర్లపై పెట్టిన కేసులను తక్షణమే ఎత్తేయాలని డిమాండ్ చేస్తూ తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. తిరుపతి జిల్లా గూడూరు టవర్ క్లాక్ సెంటర్ నుంచి ఆర్‌డిఒ కార్యాలయం వరకు నిరసన ప్రదర్శన చేశారు. సూళ్లూరుపేటలో సిఐటియు కార్యాలయం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ చేపట్టారు. విజయనగరం కలెక్టరేట్ ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. నెల్లూరు జిల్లా ఇందుకూరుపేట, టిపిగూడూరు, కావలిరూరల్‌లో పోలీసుల వైఖరిని నిరసిస్తూ ధర్నాలు చేశారు. బాపట్ల జిల్లా రేపల్లెలోని ప్రభుత్వ ఆస్పత్రి వద్ద నిరసన, ప్రకాశం జిల్లా గిద్దలూరులో నిరసన ర్యాలీ, వెలిగండ్లలో రాస్తారోకో చేశారు. గుంటూరు, కృష్ణా, ఎన్‌టిఆర్ జిల్లాల్లో ఆందోళనలు చేశారు.




సమావేశంలో మాట్లాడుతున్న సిహెచ్.నర్సింగరావు

## రవాణా సమ్మె విజయవంతం చేయాలి

- సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు పిలుపు

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

రవాణా రంగం కార్మిక హక్కుల సాధన కోసం కేంద్ర కార్మిక సంఘాలు ఈ నెల 16న దేశ వ్యాప్తంగా చేపట్టే రవాణా రంగం సమ్మెను విజయవంతం చేయాలని విశాఖ మోటారు ఓనర్స్ అండ్ డ్రైవర్స్ యూనియన్ల ఐక్య కార్యాచరణ కమిటీ పిలుపునిచ్చింది. విశాఖలోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో కమిటీ సమావేశం శుక్రవారం సిఐటియు నాయకులు పి.రాజ్‌కుమార్ అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు పాల్గొని మాట్లాడుతూ.. రవాణా రంగాన్ని, రోడ్లను నేషనల్ మానిటైజేషన్ పైపులైన్ కింద ప్రయివేటు వారికి ధారదత్తం చేస్తున్నారని విమర్శించారు. ఓనర్ కమ్ డ్రైవర్లు లేకుండా చేయడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని, అందులో భాగంగానే మోటారు ట్రాన్స్‌పోర్టు చట్టం, సెక్షన్ 106 (1, 2) పేరిట దాడులు చేస్తున్నారన్నారు. రవాణా రంగంలో డ్రైవర్లదే కీలకపాత్ర అని, వారికి ప్రభుత్వాలు ఏ విధమైన సహాయమూ అందించడం లేదని తెలిపారు. రవాణా రంగ కార్మికుల ద్వారా ప్రభుత్వాలకు లక్షల కోట్ల రూపాయల ఆదాయం వస్తున్నా వారి సంక్షేమానికి ఎటువంటి చట్టమూ లేకపోవడం శోచనీయమన్నారు. డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, పెట్రోల్, డీజిల్‌లో పన్ను మినహాయింపు ఇవ్వాలని, రవాణా కార్మికులకు ఉరితాడు వంటి సెక్షన్ 106 (1, 2), మోటారు ట్రాన్స్‌పోర్టు సవరణ చట్టం 2019, జిఒ నెంబరు 21లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

## జగన్‌పై హత్యాయత్నం కేసులో నిందితుడు విడుదల

ప్రజాశక్తి - ఆరిలోవ (విశాఖపట్నం)

ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో విశాఖ విమానాశ్రయంలో ఆయనపై జరిగిన హత్యాయత్నం కేసులో నిందితునిగా ఉన్న జనిపల్లి శ్రీనివాసరావు విశాఖ కేంద్ర కారాగారం నుంచి బెయిల్‌పై విడుదలయ్యారు. శుక్రవారం మధ్యాహ్న సమయానికే కేంద్ర కారాగారం వద్దకు శ్రీనివాసరావు తండ్రి తాతారావుతోపాటు కుటుంబ సభ్యులు, దళిత సంఘాల నాయకులు చేరుకున్నారు. సాయంత్రం 6.30 గంటల సమయంలో కేంద్రకారాగారం నుంచి శ్రీనివాసరావు బయటకు వచ్చారు. ఆయనకు కెవిపిఎస్, విశాఖ దళిత హక్కుల పరిరక్షణ సంఘం, ముస్లిం సంఘాల నాయకులు స్వాగతం పలికారు. బయటకు వచ్చిన అనంతరం శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ కేసులో తన తరపున వాదించిన న్యాయవాదులకు, అండగా నిలిచిన దళిత సంఘాల నాయకులకు, మీడియాకు ధన్యవాదాలు తెలిపారు.

**నిజం గెలిచింది : న్యాయవాది సలీం**

రిమాండ్ ఖైదీగా సుమారు ఐదేళ్లు జైల్లో ఉన్న జనపల్లి శ్రీనివాసరావు కేసులో ఎట్టకేలకు నిజం గెలిచిందని, అబద్ధం ఓడిపోయిందని శ్రీనివాసరావు తరపు న్యాయవాది సలీం అన్నారు. శ్రీనివాసరావుకు ఎటువంటి రక్షణా అవసరం లేదని, ప్రజలే ఆయనకు రక్షణ అని తెలిపారు. శ్రీనివాసరావుకుగానీ, ఆయన తరపున పోరాడిన న్యాయవాదులకు, ప్రజా సంఘాల నాయకులకుగానీ ఎటువంటి ప్రాణహాని కలిగినా దానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిదే బాధ్యత అని అన్నారు. శ్రీనివాసరావుకు స్వాగతం పలికిన వారిలో కెవిపిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు భాగం లక్ష్మి, నాయకులు ఎంవి.ప్రసాదరావు ఉన్నారు.

## దేవినేని కుటుంబానికి భువనేశ్వరి పరామర్శ

కంచికచర్ల (ఎన్‌టిఆర్ జిల్లా)

మాజీ మంత్రి, టిడిపి నేత దేవినేని ఉమామహేశ్వరరావు సోదరుడు దేవినేని చంద్రశేఖర్ కుటుంబ సభ్యులను మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సతీమణి, ఎన్‌టిఆర్ ట్రస్ట్ ఛైర్మన్ నారా భువనేశ్వరి పరామర్శించారు. దేవినేని చంద్రశేఖర్ అనారోగ్యంతో మతి చెందిన విషయం తెలిసిందే. శుక్రవారం ఎన్‌టిఆర్ జిల్లా కంచికచర్లలోని దేవినేని చంద్రశేఖర్ నివాసానికి చేరుకుని ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. చంద్రశేఖర్ సతీమణి పల్లవి, కుమారుడు సూర్య ప్రదీత్, కుమార్తె సిరిచందనలను ఓదార్చారు. దేవినేని ఉమా తల్లి సీతమ్మ, ఉమా కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ముందుగా చంద్రశేఖర్ చిత్రపటానికి పూల మాలవేసి నివాళులర్పించారు. ఆమె వెంట ఎన్‌టిఆర్ జిల్లా టిడిపి అధ్యక్షులు నెట్టెం రఘురాం, కేశినేని ఫౌండేషన్ చైర్మన్, కేశినేని శివనాథ్ (చిన్ని), మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య తదితరులు ఉన్నారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, మాజీ ఎంపి కొనకళ్ళ నారాయణ నివాళులర్పించారు.

## పోటీకి సిద్ధం

- ప్రముఖ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్


**నెల్లూరు:** జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఆదేశిస్తే ఎక్కడి నుంచి అయినా ఎమ్మెల్యేగా పోటీ చేయడానికి తాను సిద్ధంగా ఉన్నానని ప్రముఖ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ తెలిపారు. నెల్లూరు జర్నలిస్ట్ భవన్‌లో జరిగిన విలేక రుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మా నేత పవన్ కల్యాణ్ ఆశయ బాటలో నా ప్రయా ణం కొనసాగుతుందన్నారు. టిడిపి హయాంలో నిర్మించిన టిడ్కో ఇళ్లను ఇప్పటివరకు ఇవ్వకపోవడం ప్రజలను మోసం చేయడమేనని విమర్శించారు. పేదల సొంత ఇంటి కల, కలగానే మిగిలిపోయిందన్నారు. వైసిపి పాలనకు ప్రజలు చరమగీతం పాడే సమయం ఆసన్నమైందని పేర్కొన్నారు. ప్రభుత్వ అన్యాయనికి వ్యతిరేకంగా ఈనెల 10న మినర్వా గ్రాండ్ నుంచి వెంకటేశ్వరపురం టిడ్కో ఇళ్ల వరకు మహాధర్నాను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.





## జనరిక్ మందులపై మెడ్‌ప్లస్ దృష్టి

- ఔషదాలపై 80 శాతం వరకు డిస్కౌంట్
- 70% అవసరాలను తీర్చగలవు
- మరిన్ని రాష్ట్రాలకు విస్తరణ
- మరో 600 స్టోర్లు తెరుస్తాం
- సంస్థ ఎండి, సిఇఒ గంగడి మధుకర్ రెడ్డి వెల్లడి




**హరిద్వార్ :** ప్రముఖ ఔషధ ఉత్పత్తుల రిటైలర్ చెయిన్ మెడ్‌ప్లస్ హెల్త్ సర్వీసెస్ జనరిక్ ఉత్పత్తుల రంగంలోని విస్తృత అవకాశాలపై కీలక దృష్టి కేంద్రీకరించింది. ఇందుకోసం తన ఉత్పత్తుల పోర్టుపోలియోను పెంచుతోన్నట్లు ప్రకటించింది. అదే విధంగా కొత్త స్టోర్ల ఏర్పాటులోనూ వేగాన్ని పెంచుతోన్నట్లు వెల్లడించింది. హరిద్వార్‌లో అకూమ్స్ డ్రగ్స్ అండ్ ఫార్మాస్యూటికల్స్ లిమిటెడ్ జాయింట్ ఎండి సందీప్ జైన్‌తో కలిసి మెడ్‌ప్లస్ హెల్త్ సర్వీసెస్ ఎండి, సిఇఒ గంగడి మధుకర్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. ప్రస్తుతం తమ 706 ఔషదాల్లో 550 కూడా జనరిక్ ఉత్పత్తులేనని మధుకర్ రెడ్డి వెల్లడించారు. ఇందులో 450 మెజారిటీ ఉత్పత్తులను అకూమ్స్‌తో కాంట్రాక్ట్ డ్రగ్ మానుఫాక్చరింగ్స్ (సిడిఎంఎస్) ఒప్పందం ద్వారా తయారు చేస్తున్నామన్నారు. తమ సొంత నెట్‌వర్క్‌లో ఇంతక్రితం బ్రాండెడ్, జనరిక్ ఉత్పత్తులపై కనీసం 10 తగ్గింపు ధరలను ఇవ్వగా.. ఇటీవల దీన్ని 20 శాతానికి పెంచామని.. మెడ్‌ప్లస్ బ్రాండ్ ఉత్పత్తులపై 80 శాతం వరకు డిస్కౌంట్‌ను ఇస్తున్నామన్నారు. తమ ఉత్పత్తులు 70 శాతం అవసరాలను తీర్చగలవన్నారు. ఇతర దిగ్గజ ఫార్మా విక్రయ సంస్థలు కూడా జనరిక్ ఉత్పత్తుల గురించి మాట్లాడుతున్నాయని ఆయన గుర్తు చేశారు. ప్రస్తుతం ఏడు రాష్ట్రాల్లోని 4200 పైగా తమ స్టోర్లలో ఈ తగ్గింపు ధరలకు ఔషదాలను విక్రయిస్తున్నామన్నారు. దీని ద్వారా గడిచిన ఆరు నెలల్లో 26.2 లక్షల వినియోగదారులకు దాదాపు రూ.140కోట్లు ఆదా అయ్యిందన్నారు. సరసమైన ధరలో విస్తృత శ్రేణిలో నాణ్యమైన జనరిక్ ఔషధాలను అందిస్తున్నామన్నారు. కొత్తగా తాము కేరళ, చత్తీస్‌ఘడ్, మధ్యప్రదేశ్‌లకు విస్తరిస్తున్నట్లు గంగడి మధుకర్ రెడ్డి తెలిపారు. వచ్చే ఏడాది కాలంలో కొత్తగా 600 స్టోర్లను తెరవాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. మెడ్‌ప్లస్ అమ్మకాల్లో 7-8 శాతం రెవెన్యూ ఆన్‌లైన్ అమ్మకాల ద్వారా చేకూరుతుందన్నారు. హైదరాబాద్‌లోని 12 డయగ్నస్టిక్ కేంద్రాలు బాగా పని చేస్తున్నాయన్నారు. ఇప్పటికీ పైలట్ ప్రాజెక్టులోనే ఇవి నడుస్తోన్నాయన్నారు. మెడ్‌ప్లస్ ప్రతి నెలా కోటి మంది వినియోగదారులకు సేవలందిస్తుందన్నారు.

## ఎల్ఐసి ఎంఎఫ్ నుంచి కొత్త ఫండ్

**ముంబయి :** ఎల్ఐసి మ్యూచువల్ ఫండ్ అసెట్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ కొత్త ఫండ్ ఆఫర్ (ఎన్ఎఫ్ఒ)ను ఆవిష్కరించినట్లు ప్రకటించింది. 'ఎల్ఐసి ఎంఎఫ్ నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 ఈటిఎఫ్'ని విడుదల చేసినట్లు ప్రకటించింది. ఇది ఫిబ్రవరి 8న తెరబడిందని.. 12న మూసివేయనున్నట్లు తెలిపింది. ఈ ఫండ్ నిరంతర విక్రయం, పునర్ కొనుగోలు కోసం 19 ఫిబ్రవరి 2024న తిరిగి తెరవబడుతుందని ఎల్ఐసి మ్యూచువల్ ఫండ్ సిఇఒ, ఎండి రవి కుమర్ ఝా తెలిపారు. ఎన్ఎఫ్ఒలో కనీస పెట్టుబడి రూ.500గా నిర్ణయించామన్నారు.

## మారుతి సుజుకి 10 లక్షల ఎర్టిగా అమ్మకాలు




**న్యూఢిల్లీ :** ప్రముఖ ఆటోమొబైల్ కంపెనీ మారుతి సుజుకి భారత్‌లో ఇప్పటి వరకు తన మల్టీ పర్పస్ వెహికల్ (ఎంపివి) ఎర్టిగా మోడల్‌లో 10 లక్షల యూనిట్లను విక్రయించినట్లు ప్రకటించింది. ఈ మైలురాయి చేరడం సంతోషంగా ఉందని మారుతి సుజుకి ఇండియా సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శశాంక్ శ్రీవాత్సవ తెలిపారు. పట్టణ, గ్రామీణ మార్కెట్లలోనూ మారుతి ఎర్టిగా దూసుకెళ్తుందన్నారు. ఎంపివి సెగ్మెంట్‌లో ఎర్టిగా 37.5 శాతం వాటా కలిగి ఉందన్నారు. 2012లో తొలుత ఎర్టిగాను ఆవిష్కరించగా.. 2018లో కొత్త వర్షన్‌ను అందుబాటులోకి తెచ్చింది. దీని ప్రారంభ ధర రూ.8.69 లక్షలుగా ఉంది.

## పేటియం బ్యాంక్‌కు ఇద్దరు స్వతంత్ర డైరెక్టర్ల రాజీనామా

**న్యూఢిల్లీ :** పేటియం పేమెంట్ బ్యాంక్‌కు మరో షాక్ తగిలింది. ఇప్పటికే ఆర్‌బిఐ ఆంక్షలతో పీకల్లోతూ కష్టాల్లోకి జారిన ఆ సంస్థకు చెందిన ఇద్దరు స్వతంత్ర డైరెక్టర్లు రాజీనామా చేశారు. పిపిబిఎల్ ఇండిపెండెంట్ డైరెక్టర్‌గా బ్యాంక్ ఆఫ్ అమెరికా, ప్రైస్ వాటర్ హౌస్ కూపర్స్ (పిడబ్ల్యుసి) మాజీ ఎగ్జిక్యూటివ్ షింజిని కుమార్ గత డిసెంబర్‌లోనే రాజీనామా చేశారని పేటీఎం సన్నిహిత వర్గాలు తెలిపాయి. ఎస్‌బిఐ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ మంజు అగర్వాల్ కూడా పేటియం బోర్డు నుంచి వైదొలిగారని సమాచారం. మరోవైపు వచ్చే వారం నేషనల్ హైవే అథారిటీ (ఎన్‌హెచ్ఎఐ), కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పిసిఐ) ప్రతినిధులతో ఆర్‌బిఐ భేటీ కానుంది. ఈ సమావేశంలో పేటియంపై విధించిన ఆంక్షల నేపథ్యంలో ఆ సంస్థ వినియోగదారుల భద్రతపై కీలక నిర్ణయాలు తీసుకోనున్నట్లు తెలుస్తోంది.

సంపాదకీయం


# ఫెడరలిజం పరిరక్షణ!

కేరళ పట్ల కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వివక్షాపూరిత విధానాలకు వ్యతిరేకంగా కేరళ ముఖ్యమంత్రి, మంత్రులు, ప్రజాప్రతినిధులు దేశ రాజధానిలో చేసిన ధర్నా ఫెడరలిజం పరిరక్షణకు జరుగుతున్న పోరాటంలో ముఖ్యమైన ఘట్టంగా పేర్కొనవచ్చు. పన్ను వాటాను నిరాకరించడం, గ్రాంట్లు నిలిపివేయడం, రుణ పరిమితిని కుదించడం వంటి కేంద్ర ప్రభుత్వ దురుద్దేశపూరిత చర్యలను ధర్నా ద్వారా ఎండగట్టారు. ఈ ఆందోళన ద్వారా బిజెపి యేతర ప్రతిపక్ష పార్టీలు పాలిస్తున్న రాష్ట్రాలపై మోడీ ప్రభుత్వం చూపుతున్న వివక్షపై దేశవ్యాపిత చర్చ ముమ్మరమైంది. కేంద్ర-రాష్ట్ర సంబంధాల సమతుల్యతను కాపాడుకోవడం, రాష్ట్రాలకు సమాన హోదా కోసం, సమాఖ్య నిర్మాణాన్ని పరిరక్షించడం కోసమే ఈ పోరాటమని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ తమ లక్ష్యాన్ని స్పష్టం చేశారు. 'యూనియన్ ఆఫ్ స్టేట్స్' అనే భావనపై ఆధారపడిన ప్రజాస్వామ్యం 'యూనియన్ ఓవర్ స్టేట్స్' అనే అత్యంత అప్రజాస్వామిక పరిస్థితిలోకి నెట్టబడుతున్నదన్న ఆయన విమర్శ అక్షర సత్యం. అయితే, దీన్ని ఉత్తర-దక్షిణ సమస్యగా చిత్రీకరించేందుకు ప్రధాని యత్నించడం బాధ్యతారాహిత్యమే!

ఎన్నో ఇబ్బందులు ఉన్నప్పటికీ, కేరళ ప్రభుత్వ సొంత ఆదాయం అనూహ్యంగా పెరిగింది. కేంద్రం దెబ్బ తిన్నప్పుడు కూడా కేరళలో ఆర్థిక స్తబ్ధత లేదు. అభివృద్ధి పథకాలను అమలు చేసేందుకు రుణాలు తీసుకోకుండా అడ్డంకులు సృష్టిస్తున్నారు. కేరళ ప్రస్తుత జిఎస్‌డిపి దాదాపు రూ.11 లక్షల కోట్లు. రుణ పరిమితుల కారణంగా కేరళ ఇందులో 10 శాతం నష్టపోతోంది. పన్ను ఆదాయంలో ఉత్తరప్రదేశ్‌కు 100కి 46, బీహార్‌కు 100కి 70 ఇస్తే, కేరళకు 100కి 21 మాత్రమే ఇచ్చారు. ఇది వివక్ష కాదా? పన్నుల్లో వాటాను 3.89 శాతం నుంచి 1.92 శాతానికి తగ్గించడం వల్ల కేరళకు అపార నష్టం వాటిల్లింది. కేంద్రం వివక్షను, రాష్ట్రాలకు జరుగుతున్న అన్యాయాన్ని ఎత్తిచూపుతూ కేంద్రానికి లేఖలు రాసినా, వ్యక్తిగతంగా కలిసి విజ్ఞప్తి చేసినా ఫలితం లేకపోయింది. కేరళ విపత్తును ఎదుర్కొంటున్న తరుణంలోనూ కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర వ్యతిరేక చర్యలు కొనసాగించింది. ఈ నేపథ్యంలోనే ఫిబ్రవరి 8న జరిగిన ధర్నాకు 'ఇండియా' వేదిక లోని డిఎంకె, ఆప్, నేషనల్ కాన్ఫరెన్స్ తదితర పార్టీలు ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రులు, మంత్రులు పాల్గొని సంఘీభావం తెలపడం ముదావహం.

రాష్ట్ర జాబితాలో శాంతిభద్రతలు సహా వ్యవసాయం, ఇంధనం, ఆరోగ్యం, విద్య, సహకారం వంటి అంశాలపై రాష్ట్రాల అధికారాలను హరించివేసే చట్టాలను కేంద్రం చేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వాలను లొంగదీసుకోవడానికి, హింసించడానికి గవర్నర్ల వ్యవస్థను దుర్వినియోగం చేస్తున్నది. రాజ్యాంగం ప్రకారం, భారతదేశం రాష్ట్రాల యూనియన్. కానీ బిజెపి మోడీల దృష్టిలో రాష్ట్రాలు లేవు. యూనియన్ మాత్రమే ఉంది. 'రాష్ట్రాలు జోలె పట్టి కేంద్రాన్ని దేబిరించాలని వారు కోరుకుంటున్నారు. అలా ఎన్నటికీ జరగనివ్వరాదు. మోడీ రాష్ట్రాలను మున్సిపాలిటీలుగా భావిస్తున్నారన్న తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ విమర్శ సత్యదూరం కాదు. విద్యా హక్కులను, భాషా హక్కులను, చట్టపరమైన హక్కులను ఇలా అన్నింటినీ లాక్కుంటున్నారు. ప్రతిపక్ష పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాల మంత్రులను, నాయకులను కేంద్ర దర్యాప్తు సంస్థలు వేటాడుతున్నాయి. గతంలో ఎవరైనా నేరారోపణలు వచ్చినప్పుడు దాన్ని కూలంకషంగా విచారించి దోషిగా తేలి జైలుకెళ్లేవారు. కానీ, ఇప్పుడు ఆ వ్యక్తిని ముందుగా అరెస్ట్ చేసి జైల్లో పెడతారు. ఆ తర్వాత కేసు పెడతారు. ప్రభుత్వాలను కూలదోస్తారు. తాజాగా, వారు జార్ఖండ్ ముఖ్యమంత్రిని అరెస్టు చేశారు. రేపు ఇంకొక ముఖ్యమంత్రినో మంత్రులనో అరెస్టు చేయవచ్చు. అటు ఆర్థికంగా ఇటు చట్టపరంగా మరోవైపు గవర్నర్లను, కేంద్ర దర్యాప్తు సంస్థలనూ సాధనాలుగా చేసుకుని ప్రతిపక్ష పార్టీ పాలిత రాష్ట్రాలను బిజెపి కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా దెబ్బతీస్తోంది. ఫెడరల్ వ్యవస్థను ధ్వంసం చేస్తున్న ఈ పరిస్థితిని వ్యతిరేకిస్తూ రాష్ట్రాలన్నీ ఒక్క తాటిపైకి రావాలి. అన్ని రాష్ట్రాలను సమానంగా గౌరవించే కేంద్ర ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకునేందుకు మతతత్వ కార్పొరేట్ కూటమిని ఓడించాలి.

మహనీయుల మాట



**దేశమంటే సామాన్యులు. సామాన్యుల విద్యా వికాసం పైన, సాంస్కృతిక పునరుజ్జీవనం పైనే దేశ భవిష్యత్తు ఆధారపడి వుంది. ప్రజా చైతన్యం ద్వారానే ప్రజాస్వామ్యం బలపడుతుంది.**

**- గ్రుండ్‌విగ్,**
**ఫోక్ స్కూల్ రూపకర్త, డెన్మార్క్,**

# అయోధ్య వివాదం దేనికోసం?

విశ్లేషణ



**హర్ష మందర్**


జనవరి 22వ తేదీన ప్రధాని నరేంద్ర మోడీ, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ అధినేత మోహన్ భగవత్ సమక్షంలో 51 అంగుళాల నల్లరాతితో ఐదేళ్ల బాల రాముని విగ్రహాన్ని, అయోధ్యలో పాక్షికంగా నిర్మితమైన రామమందిరంలో ప్రతిష్ఠించారు. ఈ ఆలయాన్ని, 1992లో ఒక అల్లరిమూక కూల్చివేసిన మధ్యయుగాల నాటి మసీదు ఉన్న స్థలంలో నిర్మిస్తున్నారు. సరయూ నదీ తీరానగల ఈ తీర్థయాత్ర పట్టణాన్ని మార్చేందుకు ప్రభుత్వ ఖజానాకు రూ.57 వేల కోట్ల వ్యయం అవుతుందని అంచనా వేశారు.

ఈ విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవంలో భారతీయులందరికీ ప్రాతినిధ్యం వహించడానికి ఆ భగవంతుడు తనను ఎంపిక చేయడం చాలా ఆనందంగా ఉందనీ, తన ఆనందాన్ని వ్యక్తం చేయడానికి "మాటలు లేవ"ని మోడీ అంటున్నారు.

స్వాతంత్ర్యం సిద్ధించిన కొన్ని సంవత్సరాలకే సౌరాష్ట్ర ప్రభుత్వం సోమనాథ దేవాలయ పునర్నిర్మాణానికి 5 లక్షల రూపాయలు కేటాయించినప్పుడు, భారత ప్రథమ ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ అన్న మాటలు నాకు గుర్తుకొస్తున్నాయి. "ఏ ప్రభుత్వమైనా ఇలా చెయ్యడం పూర్తిగా సరైంది కాదని నాకనిపిస్తుంది. ఆ ప్రకారమే, నేను ఆ ప్రభుత్వానికి లేఖ రాశా"నని చెప్పారు. ఆ లేఖలో ఆయనిలా అన్నారు: "ఏ సమయంలోనైనా ఇది ఆమోదయోగ్యం కాదు. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో, దేశం ఆకలితో అలమటిస్తున్న సమయంలో జాతీయ ఆర్థిక వ్యవస్థ, ఆర్థిక సంక్షోభం గురించి మనం మాట్లాడుకునే సమయాన ప్రభుత్వం ఈ ఖర్చుకు పూనుకోవడంతో నేను దిగ్భ్రాంతికి లోనయ్యాను. మనం విద్య, ఆరోగ్యం ఇంకా అనేక ప్రయోజనకరమైన సేవలపై ఖర్చు నిలిపివేశాం. ఎందుకంటే, మనకు సాధ్యపడదని చెప్తున్నాం. అయినా ఒక రాష్ట్ర ప్రభుత్వం కేవలం ఒక ఆలయ ప్రతిష్టాపన ఉత్సవాల కోసం పెద్ద మొత్తంలో డబ్బును ఖర్చు చేయగలుగుతుంది."

అయితే, ఒక మతపరమైన కార్యక్రమంలో లౌకికరాజ్యం ప్రమేయాన్ని, ఒక మతపరమైన మందిర పునర్నిర్మాణానికి ప్రభుత్వ నిధుల కేటాయింపును, 1951లో ఆలయ ప్రారంభోత్సవం సమయంలో రాష్ట్రపతితో సహా సీనియర్ అధికారులు హాజరు కావడాన్ని నెహ్రూ వ్యతిరేకించాడు. రాజ్యాంగ నిబంధనలకు భిన్నంగా ఒక్క మతానికే ప్రాధాన్యతనిచ్చే ఎలాంటి చర్యనూ ఆయన సమర్థించలేదు. ఆయన తన అసమ్మతిని కూడా మర్యాదగా రాజేంద్రప్రసాద్‌కు ఇలా తెలియజేశారు: "సోమనాథ ఆలయ ప్రారంభ మహోత్సవంలో మీరు స్వయంగా పాల్గొనడమనే ఆలోచన నాకు నచ్చలేదని చెప్పవలసి వుంది. ఇది కేవలం మీరు లేదా మరెవరైనా చేయగలిగే దేవాలయ సందర్శన మాత్రమే కాదు. దురదృష్టవశాత్తు ఈ ముఖ్యమైన కార్యక్రమంలో పాల్గొనడం వల్ల కొన్ని చిక్కులు కూడా ఉంటాయి."

అయితే ఒక లౌకికరాజ్యం, ఆలయ నిర్మాణం లాంటి కార్యాలకు దూరంగా ఉండాలన్న నెహ్రూ డిమాండ్ గురించి, దశాబ్దాల తర్వాత మోడీ చాలా కఠినంగా ఇలా మాట్లాడారు. "సోమనాథ దేవాలయానికి వ్యతిరేకంగా వ్యవహరించిన వారిని సాహసవంతు లైన ప్రజలకు చెందిన ఈ నేల క్షమించద"ని ప్రకటించారు.




> **అయితే నేను ఇంతకు ముందు రాసినట్లు...ఇది ఉత్తరప్రదేశ్‌లో ధూళిమయంగా ఉన్న ఒక చిన్న పట్టణంలో రెండు ఫుట్‌బాల్ మైదానాల పరిమాణంలో ఉండే చిన్నపాటి భూమికి సంబంధించిన వివాదం కాదు. ఇది మధ్య యుగాల నాటి మసీదు (ఇప్పుడు నేలమట్టం చేయబడిన)కు, ఆలయానికి మధ్య పోటీ కూడా కాదు. ఇది ఏ రకమైన దేశం? భవిష్యత్తులో ఎలాంటి దేశంగా ఉంటుంది? ఈ దేశానికి చెందిన వారెవరు? ఎలాంటి షరతులపైన ఆధారపడి భిన్న అస్తిత్వాలు, భిన్న విశ్వాసాలు కలిగిన ప్రజలు ఈ విశాలమైన భూమిపై కలిసి జీవించాలనే విషయం గురించే ఈ వివాదం.**

భారతదేశంలో ముస్లింలు మెజారిటీగా ఉన్న ఏకైక రాష్ట్రమైన జమ్మూకాశ్మీర్‌లో రాజ్యాంగంలోని ఆర్టికల్ 370 కింద ఉన్న ప్రత్యేక రక్షణలను రద్దు చేయడం, యూనిఫాం సివిల్ కోడ్ ఏర్పాటుతో పాటు, 460 ఏళ్ళుగా అయోధ్యలో ఒక మసీదు ఉన్న స్థలంలో రామునికి గొప్ప ఆలయాన్ని నిర్మించాలనే ముఖ్యమైన ఎజెండాను ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి లు ముందుకు తెచ్చాయి. ఈ కారణంగానే బాబ్రీ మసీదు స్థలంలో రాముని విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం కాషాయ దళానికి ఒక విజయోత్సవ సమయమైంది.

అయితే నేను ఇంతకు ముందు రాసినట్లు...ఇది ఉత్తరప్రదేశ్‌లో ధూళిమయంగా ఉన్న ఒక చిన్న పట్టణంలో రెండు ఫుట్‌బాల్ మైదానాల పరిమాణంలో ఉండే చిన్నపాటి భూమికి సంబంధించిన వివాదం కాదు. ఇది మధ్య యుగాల నాటి మసీదు (ఇప్పుడు నేలమట్టం చేయబడిన)కు, ఆలయానికి మధ్య పోటీ కూడా కాదు. ఇది ఏ రకమైన దేశం? భవిష్యత్తులో ఎలాంటి దేశంగా ఉంటుంది? ఈ దేశానికి చెందిన వారెవరు? ఎలాంటి షరతులపైన ఆధారపడి భిన్న అస్తిత్వాలు, భిన్న విశ్వాసాలు కలిగిన ప్రజలు ఈ విశాలమైన భూమిపై కలిసి జీవించాలనే విషయం గురించే ఈ వివాదం.

భారతదేశం గురించి ఒక భావన ఉంది. ఆ భారతదేశ భావన కోసమే గాంధీజీ ఇష్టపూర్వకంగా తన జీవితాన్ని త్యాగం చేశాడు. ఆ భావననే బి.ఆర్.అంబేద్కర్ రాజ్యాంగంలో పొందుపరిచాడు. ప్రతీ అస్తిత్వం, ప్రతీ విశ్వాసానికి చెందిన ప్రజలందరినీ అన్ని విషయాల్లో సమానంగా చూసే భారతదేశం ఇది. భారతదేశ హిందువులు, సిక్కులు, జైనులు, బౌద్ధులు, వాస్తవానికి పార్శీలు, క్రైస్తవుల వలెనే భారతీయ ముస్లింలు కూడా విశ్వాసంతో, చట్టబద్ధంగా వారి జన్మభూమి, వారి ఎంపిక పట్ల సమానమైన హక్కును కోరడమే ఆ భావన. శక్తివంతులైన, మెజారిటీ విశ్వాసాలు గల ప్రజల వాదనలకు లోబడి ఇతర మతాల ప్రజలు తమ వాదనలను వదులుకోకుండా, విశ్వాసాలలో ఎలాంటి క్రమానుగత ఆదేశాలు ఉండవనే హామీ ఉంటుంది.

ఈ భారతదేశ భావనకు వ్యతిరేకంగా, భారతదేశానికి సంబంధించి బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్, హిందూ మహాసభలకు మరొక ఊహ ఉంది. అదేమంటే, ఈ దేశం హిందూ (అగ్ర వర్ణాలకు) ప్రజలకు చెందినది. దీనిలో సిక్కులు, జైనులు, బౌద్ధులు ఉంటారు. ఎందుకంటే, వారి మతాలు కూడా భారతదేశ మట్టిలోంచే పెరిగాయి. అయితే ఇస్లాం, క్రైస్తవులు విదేశీ విశ్వాసాలను పాటిస్తారు కాబట్టి వారిని "విదేశీయులు"గా గుర్తిస్తారు. వారిని భారతదేశంలో నివసించడానికి మెజార్టీ హిందువులు (అగ్రవర్ణాలు) అనుమతిస్తారు. అయితే మెజారిటీ మతం, సంస్కృతికి చెందిన మనోభావాలు, విశ్వాసాలకు లోబడి ఉండాలనే షరతుపై మాత్రమే అనుమతిస్తారు.

బాబ్రీ మసీదు స్థలంలో రామ మందిర నిర్మాణం కోసం జరిగే ప్రచారం మొత్తం కూడా హిందువుల కోసమేనన్నట్టు సాగింది. కానీ విశ్వహిందూ పరిషత్ అనే ప్రధాన తగాదాలమారి హిందూత్వ సంస్థ, ఆర్‌ఎస్‌ఎస్, హిందూ మహాసభలు అనేకమంది హిందువుల మనోభావాలకు ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. కానీ హిందువులంతా ఆ సంస్థల్ని ఏ రకంగానూ సమర్థించడం లేదు.

16వ శతాబ్దంలో మసీదును నిర్మించడానికి వాస్తవంగా రాముని హిందూ దేవాలయాలయాన్ని కూల్చివేశారనే రుజువు లేదనే విషయాన్ని, హిందూ వ్యాజ్యగాళ్ళకు భూమిని కేటాయిస్తూ ఇచ్చిన సుప్రీంకోర్టు తీర్పు ధ్రువీకరిస్తుంది. కానీ సర్వోన్నత న్యాయస్థానం తీర్పు తర్వాత నేనడిగినట్లు, వాస్తవానికి మసీదు నిర్మించిన స్థలంలో హిందూ ఆలయం ఉందని నిరూపించే రుజువులు ఉన్నాయా? మసీదు ఉన్న స్థలంలో రామమందిరం నిర్మించాలని బిజెపి నాయకుడు ఎల్.కె. అద్వానీ నాయకత్వంలోని మొత్తం ఉద్యమం కోరుకుంది కాబట్టి 21వ శతాబ్దంలో చరిత్రలో జరిగిన తప్పిదాల్ని సరిచేసుకునే ప్రయత్నం చేయడానికి చట్టపరమైన, రాజ్యాంగ ఆధారాలు ఏమైనా ఉన్నాయా?

ఇది ఎప్పటికి అంతమవుతుందో ఎవరు నిర్ణయిస్తారు? ఈ "దిద్దుబాట్లు" ఇతర వివాదాస్పద స్థలాలకు వర్తిస్తుందా? ఇలా చరిత్రలో మనం ఎంతవరకు వెళ్లాలి? 500 సంవత్సరాల చరిత్ర దగ్గరే ఎందుకు ఆగాలి? 1000 లేక 1500 లేక 2000 సంవత్సరాలు లేక ఇంకా దూరంగా ఎందుకు వెళ్ళకూడదు? 9వ శతాబ్దం వరకు భారతదేశంలో అనేక ప్రాంతాల్లో బౌద్ధం ఉండేది, బ్రాహ్మణవాద హిందూ మతం అత్యంత క్రూరంగా బౌద్ధ మతాన్ని అణచివేసి, భారతదేశంలో దాదాపు తుడిచిపెట్టింది. బౌద్ధ స్తూపాలను కూల్చి వేయడం ద్వారా అనేక దేవాలయాలను నిర్మించారనే రుజువులు చరిత్రలో ఉన్నాయి.

కాబట్టి హిందూ దేవాలయాలున్న ప్రాంతాల్లో బౌద్ధ ప్రార్థనా స్థలాన్ని పున:స్థాపన చేయాలని మనం ఇప్పుడు వాదనలు చెయ్యాలా? వాస్తవానికి, భారతదేశంలోని అనేక గిరిజన ప్రజల ప్రార్థనా స్థలాల్ని వేల సంవత్సరాలుగా హిందూ ప్రార్థనా స్థలాలకు ఇచ్చేట్లు వారిని ఒత్తిడి చేశారు. చరిత్రలో మనం ఎంత వెనక్కి వెళ్ళాలనే విషయాన్ని ఎవరు నిర్ణయిస్తారు? మనం కొన్ని చరిత్రల్నే ఎందుకు ఎంచుకోవాలి, ఇతరులను సరిదిద్దడానికి ఎందుకు ఎంచుకోకూడదు? మరీ ముఖ్యంగా మన రాజ్యాంగంలో, చట్టంలో ఏది ఈ ఎంపికల్ని సమర్థిస్తుంది?

రాముడు అయోధ్యలో జన్మించాడని చాలా మంది హిందువులు నమ్ముతారు అయితే ఆయన పుట్టిన అయోధ్య వాస్తవానికి నేడున్న అయోధ్య ఒకటేనా అనే దానిపై భిన్నమైన విశ్వాసాలున్నాయి. ప్రస్తుత అయోధ్యలో కూడా రాముడు పుట్టిన ప్రదేశంగా అక్కడి నివాసితులు చెప్పుకునే ప్రదేశాలు చాలానే ఉన్నాయి. రాముడు మరెక్కడో జన్మించాడనే అసంఖ్యాక హిందువుల విశ్వాసం, నమ్మకం కంటే కూడా, రాముడు మసీదు గోపురం కింద జన్మించాడనే ఒకే విశ్వాసం, నమ్మకానికే సుప్రీంకోర్టు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వడానికి గల కారణాలు ఏమిటి?

ఆందోళనకరమైన విషయమేమంటే, కేవలం బిజెపి-ఆర్‌ఎస్‌ఎస్ వారు మాత్రమే కాక విస్తృత స్థాయిలో రాజకీయ భావాలున్న పెద్ద వర్గాల వారు కూడా నూతన రామ మందిరం ప్రకారమే నైతిక, ఆధ్యాత్మిక, చట్టపరమైన చట్టబద్ధతను కలిగి ఉన్నారు. మూడు నేర పూరితచర్యల ఫలితంగా మసీదు ఒక ఆలయంగా మారింది. 1949లో మసీదులోకి రాముని విగ్రహాన్ని రహస్యంగా, చట్టవిరుద్ధంగా ప్రవేశపెట్టడమనేది మసీదులో ప్రార్థనలకు అంతరాయం కల్గించిన మొదటి నేరపూరిత చర్య.

రెండవది, 1992లో అలజడి సృష్టించే అల్లరిమూక చేతిలో మసీదు కూల్చివేత, ఈ చర్యను అద్వానీ లాంటి నాయకులు కేరింతలతో ప్రోత్సహించారు. గాంధీ హత్యానంతరం, దేశానికిది విచారకరమైన రోజని ఉపరాష్ట్రపతి కె.ఆర్.నారాయణన్ అన్నారు. ఈ ఉద్యమం, కూల్చివేత 1989 నుండి 1993 ప్రారంభం వరకు దేశవ్యాప్తంగా భయంకరమైన అల్లర్లను సృష్టించాయి. వేల సంఖ్యలో ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. దాని మానని గాయాలు దశాబ్దాల తర్వాత కూడా దేశాన్ని ముక్కలు చేయడం కొనసాగుతూనే ఉంది.

మూడవది, మసీదును కూల్చిన తరువాత 36 గంటల్లో కూల్చి వేయబడిన మసీదు ఉన్న స్థలంలో తాత్కాలికంగా రాముని ఆలయాన్ని నిర్మించడం ద్వారా స్థలం యొక్క యథాతథ స్థితిని మార్చడాన్ని నిషేధిస్తూ ఇచ్చిన కోర్టు ఆజ్ఞల ఉల్లంఘన. రామ మందిర నిర్మాణానికి స్థలాన్ని అప్పగించిన తీర్పు, చట్టాన్ని మూడు సార్లు ఉల్లంఘించి, సుప్రీంకోర్టు ఆజ్ఞల్ని ధిక్కరించి, భారత రాజ్యాంగంలోని హామీలను, అన్ని మతాలవారి సమానత్వానికి సంబంధించిన ప్రధానమైన వాగ్దానాన్ని అగౌరవపరచిన వారికి బహుమానంగా ఇచ్చింది.

16వ శతాబ్దంలో మహాకవి తులసీదాస్, వాల్మీకి సంస్కృత రామాయణాన్ని సాధారణ ప్రజల భాష అయిన అవధిలో తిరిగి చెప్పాడు. ఆయన రామచరిత మానస్ అనేది ప్రపంచ సాహిత్య చరిత్రలో మహా కావ్యాలలో ఒకటి. ఆయన, పవిత్రమైన సంస్కృత భాషలో రాయకుండా సాధారణ ప్రజల భాషలో రాసినందుకు బ్రాహ్మణులు ఆగ్రహంతో ఊగిపోయారు. వారి దాడులకు ప్రతిస్పందనగా తులసీదాస్ 'దోహ' ను రచించాడు. అది ఈ మాటలతో మొదలైంది: "నేను బిచ్చం ఎత్తుకొని తింటాను, మసీదులో నిద్రపోతాను." అంటే తన కాలంలో, అన్ని మతాలకు చెందిన నిరాశ్రయులు, దిక్కులేని వారు ఆశ్రయం పొందే స్థలాలుగా మసీదులు ఉండేవి. తులసీదాస్ తన జీవిత కాలంలో ఎక్కువ భాగం వారణాసి, అయోధ్యలలోనే గడిపాడని చరిత్ర ధ్రువీకరిస్తుంది. అదేవిధంగా తులసీదాస్ యువకుడుగా ఉన్న సమయంలోనే అయోధ్యలో బాబ్రీ మసీదును ఏర్పాటు చేశారని కూడా అదే చరిత్ర స్థిరపరుస్తుంది. సామాన్య ప్రజల భాషలో రామకథను రాసినందుకు దాడికి గురైన మహాకవి తులసీదాస్ వాస్తవానికి బాబ్రీ మసీదులో నిద్రించి ఉంటాడనేది నా ఊహ. ప్రతీ ఒక్క భారతీయుడు వారి వారి పద్ధతుల్లో రాముని గురించి ఆలోచించే రోజులివి.

నాకు ఆశ్చర్యం కలిగించే విషయమేమంటే-ఈ సుదీర్ఘమైన చరిత్రలో ఏ రాముడు విజయం సాధిస్తాడు? నాథూరామ్ గాడ్సే గాంధీని చంపినపుడు, గాంధీ పెదవులపై ఉన్న రాముడా? లేక రామ్ అని పేరున్న, గాంధీని చంపిన నాథూరామ్ గాడ్సే రాముడా?

**('స్క్రోల్. ఇన్' సౌజన్యంతో)**
**/ వ్యాసకర్త మానవ హక్కుల కార్యకర్త /**

కవిత్వం

## దివిటీలను వెలిగిద్దాం...

వాడు
ఉన్మాది రూపమే
వాడి విడిది
మతోన్మాదమే
సమాజ విరోధి
వాడు.

ఉన్మాదానికి
మతోన్మాదానికి
ప్రేముండదు.

జాలి
కరుణ అసలే
వుండదు
ఉన్నదల్లా
కసాయి తనమే.

అంధత్వం
మూఢత్వం
కలగలిస్తే
వాడి పైశాచికత్వ
ఆనందం.

కసాయితనమే
వాడి గొప్పతనం.

వాడి
కుళ్లిపోయిన
ఆలోచనలు
తిరోగమన
భావజాలాన్ని
వొంట బట్టించుకుని
యాత్రలు చేస్తాడు.

అవేవో
చేయనిద్దాం
యాడికెళ్తాడో
వెళ్లనిద్దాం
ఇది
ప్రజాస్వామ్యం కనుక!

మనకు
వుంది
ఓ స్వేచ్ఛ.

రండి
ఉద్యమంలా
కదులుదాం.

రాజ్యాంగ స్ఫూర్తిగా
శిథిలమైన
భావజాలాల్ని
బొంద పెడదాం.

రేపటికి
మానవత్వ వికాసం
కావాలి
రండి...
సమూహంగా
విజ్ఞాన దివిటీలను
వెలిగిద్దాం.

**- మామిండ్ల రమేష్ రాజా, సెల్ : 7893230218**

# అమెరికా అధ్యక్ష బరిలో యువత ఏదీ?

వ్యాసం

**వి.వి. వెంకటేశ్వరరావు**

అగ్రరాజ్యమైన అమెరికా అధ్యక్ష ఎన్నికలు ఎప్పుడు జరిగినా యావత్ ప్రపంచం ఎంతో ఆసక్తిగా పరిశీలిస్తూ ఉంటుంది. అయితే...దశాబ్దాల కాలంగా అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ఎప్పుడైనా...ఎవరైనా యువ నాయకుడు పోటీ చేస్తాడా..? లేదా..? అనే విషయంలో ప్రపంచ దేశాలు ఎదురు చూస్తూనే ఉంటున్నాయి. ఎప్పటికప్పుడు ఆ ఎదురు చూపులు అడియాసలైపోతున్నాయి.

అమెరికా ఎన్నికలను పరిశీలిస్తే.. అక్కడ వయస్సు పైబడిన వారే తప్ప...యువతరం అగ్రపీఠాన్ని అధిరోహించే అవకాశాలు దరిదాపుల్లో కూడా ఎక్కడా కనిపించడం లేదు. ప్రపంచ దేశాలను పాలించే స్థాయికి యువతరం ఎప్పుడు ఎదుగుతుందా అని విశ్వవ్యాప్తంగా ఎదురు చూస్తుంటే.. అందుకు భిన్నంగా అగ్రరాజ్య ఎన్నికలు జరుగుతుండటం ఇప్పుడు ప్రధానమైన చర్చకు దారితీసింది.

తాజాగా అమెరికా అధ్యక్ష ఎన్నికల బరిలో అభ్యర్థులు శరవేగంతో తమ గెలుపు ఓటములపై కసరత్తు ముమ్మరం చేశారు. ఇదిలా ఉంటే...పలు ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి పీఠాన్ని అధిరోహించేందుకు ఉవ్విళ్లూరుతున్నాడు. అయోవా రాష్ట్ర రిపబ్లికన్ పార్టీ ప్రైమరీ ఎన్నికల్లో గెలిచిన డొనాల్డ్ ట్రంప్ ఇప్పుడు న్యూ హ్యాంప్‌షైర్ రాష్ట్ర ప్రైమరీలోనూ మెజారిటీతో గెలవాలని తీవ్రంగా ప్రయత్నిస్తున్నాడు. ట్రంప్ వరుసగా రెండు రాష్ట్రాల్లో గెలిస్తే దేశాధ్యక్ష ఎన్నికలో రిపబ్లికన్ పార్టీ నామినేషన్ ఆయన్నే వరించవచ్చు. అటువంటి పరిస్థితుల్లో ప్రస్తుత అధ్యక్షుడు జో బైడెన్ (డెమోక్రటిక్ పార్టీ)తో డొనాల్డ్ ట్రంప్ తలపడటం ఖాయమవుతుంది. అధ్యక్ష పదవికి బైడెన్ (81), ట్రంప్ (77) వంటి వృద్ధ సింహాలు తప్ప మరో గతి లేదా అని మెజారిటీ అమెరికన్ ఓటర్లు ఇప్పుడు మదనపడుతున్నారు.


అధ్యక్ష పదవికి నామినేషన్ కోసం పోటీపడిన అభ్యర్థుల్లో ముగ్గురు ఇప్పటికే తప్పుకోవడంతో రిపబ్లికన్ పార్టీలో పోటీ అంతా ట్రంప్, భారత సంతతికి చెందిన నిక్కీ హేలీ మధ్యనే కేంద్రీకృతమైంది. భారత సంతతికే చెందిన మరో అభ్యర్థి వివేక్ రామస్వామి, న్యూ జెర్సీ గవర్నర్ క్రిస్ క్రిస్టీ, ఫ్లోరిడా గవర్నర్ రాన్ డిశాంటిస్‌లు బరినుంచి వైదొలగిన సంగతి తెలిసిందే. రామస్వామి, డిశాంటిస్‌లు ట్రంప్‌కు తమ మద్దతు ప్రకటించారు. క్రిస్టీ మాత్రం మొదటి నుంచి ట్రంప్‌ను వ్యతిరేకించడంతో ఆయన మద్దతుదారులు నిక్కీ హేలీ వైపు మొగ్గు చూపించే అవకాశాలున్నాయి.

ఇదిలా ఉండగా, న్యూ హ్యాంప్ షైర్ గవర్నర్ సునును మద్దతు ఉన్న హేలీ ఆ రాష్ట్ర ప్రైమరీలో ట్రంప్‌నకు గట్టి పోటీ ఇవ్వనున్నాడు. ఇక్కడ కూడా అయోవాలో మాదిరిగా ట్రంప్ గెలిస్తే, పోటీ నుంచి తప్పుకోవలసిందిగా హేలీపై ఒత్తిడి పెరగడం ఖాయమనిపిస్తోంది. న్యూ హ్యాంప్‌షైర్ లోని కుగ్రామం డిక్స్ విల్‌నాచ్‌లో జరిగిన ప్రైమరీ ఎన్నికల్లో హేలీయే గెలుపొందాడు. ఆ గ్రామంలోని మొత్తం ఆరుగురు ఓటర్లు హేలీకే ఓటు వేశారు. వీరిలో నలుగురు రిపబ్లికన్ పార్టీ ఓటర్లుగా నమోదు కాగా, మిగిలిన ఇద్దరు తటస్థ ఓటర్లు. ఆరుగురు ఓటర్ల పోలింగ్ ప్రక్రియ కవరేజికి 60 మందికి పైగా విలేకరులు హాజరయ్యారు.

సాండర్స్ చాలా పాతవాడు. అలాగే బైడెన్, ట్రంప్ కూడా. అమెరికా 2024 సార్వత్రిక అధ్యక్ష ఎన్నికలకు ఇద్దరు రిపబ్లికన్ అభ్యర్థులు తమ పార్టీ అధ్యక్ష అభ్యర్థిగా ఉండేందుకు ఉవ్విళ్లూరుతున్నారు. అధ్యక్షుడు జో బైడెన్ డెమొక్రాటిక్ పార్టీ వ్యూహాత్మక నామినీగా ఉండగా, అనేక మంది థర్డ్ పార్టీ ఆశావహులు పోటీలో చేరారు.

మాజీ అమెరికా అధ్యక్షుడిగా విధులు నిర్వహించిన డొనాల్డ్ ట్రంప్ నాలుగు వేర్వేరు క్రిమినల్ కేసుల్లో తన నేరారోపణలను ఎదుర్కొంటున్నాడు. మాజీ అమెరికన్ అధ్యక్షుడు రిపబ్లికన్‌లలో తన ప్రజాదరణను పెంచుకోవడానికి, అలాగే అవసరమైన నిధులను సేకరించడానికి తన శక్తిమేరకు ప్రయత్నిస్తున్నాడు. మళ్లీ ఎన్నికైతే, తన శత్రువులపై ప్రతీకారం తీర్చుకుంటానని ట్రంప్ ప్రమాణం చేశాడు. అత్యంత కట్టుదిట్టమైన భద్రతా చర్యలతో ఇమ్మిగ్రేషన్ విధానాలను విధించడం వంటి ఇతర భారీ మార్పులను తీసుకు వస్తానని ట్రంప్ వాగ్దానం చేశాడు. ఒబామా కేర్ హెల్త్ ఇన్సూరెన్స్‌ను తొలగిస్తామని, చైనాతో వాణిజ్యంపై కఠిన ఆంక్షలు విధిస్తామని కూడా డొనాల్డ్ ట్రంప్ అమెరికా ప్రజలకు హామీ ఇస్తున్నాడు.

జో బైడెన్, ఇప్పటికే అమెరికా అధ్యక్ష పీఠంపై ఉన్నాడు. తన వయస్సు, పేలవమైన ఆమోదం




రేటింగ్‌ల గురించిన ఆందోళనల మధ్య, పదవిలో మరో నాలుగు సంవత్సరాలు తనకు సత్తువ ఉందని ఓటర్లను ఒప్పించేందుకు సర్వశక్తులను ఒడ్డుతున్నాడు. అయితే...ట్రంప్‌ను ఓడించగల ఏకైక డెమొక్రాటిక్ అభ్యర్థి అతనేనని బైడెన్ మిత్రపక్షాలు చెబుతున్నాయి.

ఉక్రెయిన్‌పై రష్యా దాడికి పాశ్చాత్య ప్రభుత్వాల ప్రతిస్పందనకు బైడెన్ నాయకత్వం వహించాడు. ఇజ్రాయిల్-పాలస్తీనా యుద్ధంలో ఇజ్రాయిల్‌కు మద్దతుగా నిలబడ్డాడు. అమెరికా పారిశ్రామిక ఉత్పత్తిని పెంచడానికి భారీ ఆర్థిక ఉద్దీపన కార్యక్రమాన్ని చేపట్టాడు. అయినప్పటికీ ఓటర్ల నుండి ఆశించినంతగా గుర్తింపు పొందలేకపోయాడు. బైడెన్ ఇమ్మిగ్రేషన్ పాలసీ రిపబ్లికన్లతో పాటు డెమొక్రాట్‌ల నుండి పెద్ద ఎత్తున విమర్శలకు దారితీసింది. ఆయన పాలనలో అమెరికా-మెక్సికో సరిహద్దు దగ్గర వలసదారులు రికార్డు స్థాయికి చేరుకున్నారు.

ఈ పరిస్థితులలో అమెరికా అధ్యక్ష ఎన్నికల ముంగిట్లో వుంది.

**/ వ్యాసకర్త సెల్ : 6300866637 /**

జనవాక్యం

## సన్యాసులకు భూములా?

సన్యాసినని చెప్పుకునే విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానందకి భూములెందుకు? 2021లో ప్రభుత్వం విశాఖలో రూ.225 కోట్ల విలువ చేసే పదిహేనెకరాల భూమిని, చదును చేసి, రూ.రెండు కోట్లతో సిమెంటు రోడ్డు వేసి, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు కేటాయించింది. ఇపుడు ఆ భూమిని ఇతర వ్యాపారాలకు మార్చు కునేట్లుగా జివో ఇవ్వాలని శారదా పీఠం వారు అడుగుతున్నారు. ఇందుకేనా ఐదు సంవత్సరాల క్రితం నిన్ను ముఖ్యమంత్రిగా చూడాలని ఉందని చెప్పి ముఖ్యమంత్రిని ముద్దు పెట్టుకున్నది? అంతేకాదు అప్పటి తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్ కూడా హైదరాబాద్ లోని కోకాపేటలో కోట్లాది రూపాయల విలువ చేసే రెండెకరాల భూమిని ఎకరం రూపాయికే అనగా రెండు రూపాయలకు రెండు ఎకరాలు భూమిని ఈ దొంగ సన్యాసి స్వరూపానందకు ధారాదత్తం చేశారు. కనుక రెండు ప్రభుత్వాలు తక్షణమే స్వరూపానంద ఆశ్రమానికి ఇచ్చిన భూమిని, తిరిగి స్వాధీనం చేసుకునే విధంగా, ఆ జీవోలను రద్దు పరచి భూమిని స్వాధీనం చేసుకోవాలి. భూమి లేని పేదలకు పంచినా ఉపయోగం.

**- నార్నె వెంకట సుబ్బయ్య,**
**ఎ.పి హేతువాదసంఘం అధ్యక్షుడు.**

**మీ రచనలను పంపాల్సిన మెయిల్ :**
editpageps@gmail.com

# అనువైన భూమి ఇవ్వలేదు: కేంద్రం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

వైజాగ్ రైల్వే జోన్ భవనం నిర్మాణానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అనువైన భూమిని ఇవ్వలేదని, ప్రస్తుతం గుర్తించిన భూమి ముంపునకు గురవుతుందని రైల్వే మంత్రి అశ్వినీ వైష్టవ్ అన్నారు. శుక్రవారం రాజ్యసభలో టిడిపి ఎంపి కనకమేడల రవీంద్ర కుమార్ అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానం ఇచ్చారు. "వైజాగ్ రైల్వే జోన్ భవనం నిర్మాణానికి 52 ఎకరాల భూమి గుర్తించారు. అయితే ఆ భూమి ముంపునకు గురవుతుంది. భవన నిర్మణానికి అనువైనది కాదు. భవన నిర్మాణానికి అనువైన ప్రాంతంలో భూమిని గుర్తించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రక్రియ ప్రారంభించింది" అని తెలిపారు.

# కరకంబాడిలో బడుగుల భూ పోరాటం

- గుట్ట స్థలంలో వేలాది గుడారాలు
- పేదలకు అండగా సిపిఎం, భూపోరాట సాధన కమిటీ


గుట్టపై వెలసిన వేలాది గుడారాలు, పేదలకు అండగా మాట్లాడుతున్న మురళి

ప్రజాశక్తి - తిరుపతి

తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ఇంటి స్థలాలు ఇస్తామంటూ మభ్యపెట్టి, ఐదేళ్లు గడిచినా ఇవ్వకపోవడంతో ఎర్రజెండా చేత పట్టి వేలాదిమంది పేదలు గుట్టపై గుడిసెలు వేసుకున్నారు. తిరుపతి జిల్లా, రేణిగుంట మండలం, కరకంబాడి ప్రాంతంలోని గుట్టపై బడుగులు చేపట్టిన ఈ భూ పోరాటానికి సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.బాలసుబ్రమణ్యం, కందారపు మురళి, భూ పోరాట సాధన కమిటీ నాయకులు మద్దతు తెలిపారు. రెండు వారాలుగా పేదలు పోరాటం చేస్తూనే ఉన్నారు. పేదలను ఎలాగైనా బయటికి పంపించేందుకు, గుడిసెలు తొలగించేందుకు రెవెన్యూ అధికారులు విఫలయత్నాలు చేశారు. తాజాగా కొండపైకి పేదలు వెళ్లకుండా జెసిబిలతో గుంతలు తవ్వించేందుకు ప్రయత్నించగా అడ్డుకున్నారు. దీంతో జెసిబిలు వెనుదిరిగాయి. మరోవైపు స్థానిక అధికార పార్టీ నేతలు అనేక నిర్బంధాలు విధిస్తూ, పేదలను భయపెట్టేందుకు తీవ్రయత్నాలు చేస్తున్నారు. అయినప్పటికీ పేదలు ఏమాత్రం వెరవకుండా ఉద్యమిస్తున్నారు. కలెక్టర్ దృష్టికి సమస్యను తీసుకెళ్లినా పరిష్కారానికి చొరవ చూపకపోవడంతో పేదలు పోరాటాన్ని కొనసాగిస్తున్నారు. తమకు న్యాయం చేసేం తవరకు ఎట్టి పరిస్థితుల్లోనూ గుట్టను విడవబోమంటూ పేదలు స్పష్టం చేశారు.

# బడ్జెట్‌లో ఆదివాసీలకు అన్యాయం

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బడ్జెట్ కేటాయింపుల్లో ఆదివాసీలకు అన్యాయం చేశారని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి కిల్లో సురేంద్ర అన్నారు. ఇది ఆదివాసీల చీకటి బడ్జెట్ అని విమర్శించారు. పార్వతీపురంలోని సుందరయ్య భవనంలో శుక్రవారం నిర్వహించిన గిరిజన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర రైతు, కార్మిక సంఘాలు తలపెట్టిన గ్రామీణ బంద్, కార్మిక సమ్మె ఆందోళనకు ఆదివాసీ గిరిజన సంఘం సంపూర్ణ మద్దతు ఇస్తుందని తెలిపారు. కేంద్ర మధ్యంతర బడ్జెట్ కేటాయింపుల్లో ఆదివాసీలకు 8.5 శాతం నిధులు కేటాయించాల్సి ఉండగా, కేవలం 2.5 శాతం నిధులు కేటాయించడం దుర్మార్గ మన్నారు. మొత్తం రూ.47 లక్షల కోట్ల బడ్జెట్ కేటాయింపుల్లో ఆదివాసీలకు రూ. 1.20 లక్షల కోట్లు కేటాయించాల్సి ఉండగా కేవలం రూ.12500 కోట్లు కేటయించడం పట్ల తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.





# హత్య కేసులో ఇద్దరికి జీవిత ఖైదు

- మరో ముగ్గురికి మూడేళ్లు జైలు శిక్ష
- రూ.6.5 లక్షల జరిమానా

ప్రజాశక్తి - ముద్దనూరు (కడప)

2016లో చర్చిలో చోటు చేసుకున్న హత్య కేసుకు సంబంధించి శుక్రవారం కడప జిల్లా ప్రొద్దుటూరు జిల్లా రెండవ అదనపు జిల్లా జడ్జి జి.ఎస్ రమేష్ కుమార్ సంచలన తీర్పు ఇచ్చారు. ఇద్దరికి యావజ్జీవ కారాగారం, మరో ముగ్గురికి మూడేళ్ల జైలు శిక్షతోపాటు రూ. ఐదు లక్షలు జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. సిఐ దస్తగిరి వివరాల ప్రకారం.. స్థానిక ఎల్‌ఎం కాంపౌండ్‌లోని సిఎస్‌ఐ చర్చిలో 2016 ఫిబ్రవరి 7న చర్చి పెద్ద మనుషుల ఎన్నిక కోసం ఎన్నికలు నిర్వహించారు. బోనం రాజా రత్నం, బోనం సురేష్, బోనం అనిల్ కుమార్, బోనం రవి ప్యానల్ ఓటమి పాలయ్యారు. అంతకు ముందు వీరు చర్చికి పెద్ద మనుషులుగా ఉన్నారు. చర్చికి సంబంధించిన లావాదేవీలంతా వీరే చూసేవారు. ఎన్నికల అనంతరం అదే రోజు రాత్రి చర్చిలో గెలుపొందిన సభ్యులు, యవనస్తులు కలిసి ఓడిపోయిన వారిని చర్చి జమా ఖర్చులు, మిగులు డబ్బులు గురించి అడిగారు. 'మీకు ఎందుకు చెప్పాలిరా..' అంటూ బోనం రాజా రత్నం, బోనం సురేష్, బోనం అనిల్ కుమార్, బోనం రవి కలిసి అంటూ ముందుగా తెచ్చుకున్న కత్తులతో గెలుపొందిన వారిపై దాడి చేశారు. ఈ దాడిలో యామవరం ఉదయ్ కుమార్ (27)అక్కడికక్కడే మృతి చెందారు. ఎర్రదాసరి సుధీకర్, దారా సురేష్ బాబు, పెళ్లకూరి విజయ్ కుమార్, బోనం రమేష్, బోనం ప్రశాంత్ తీవ్రంగా గాయపడ్డారు.

బాధితుడు బోనం ప్రశాంత్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుల్లో ఇద్దరు అనారోగ్యంతో మృతి చెందారు. 8 ఏళ్ల విచారణ అనంతరం నేరం రుజువు కావడంతో బోనం సురేష్‌కు రూ. 1.5 లక్షలు, బోనం రవికి జీవిత ఖైదు, 1.5 లక్షలు జరిమానా విధించారు. మరో ముగ్గురు తేలు అశోక్‌కు మూడేళ్ల జైలు శిక్షణతో పాటు రూ.50 వేల జరిమానా, బోనం అనిల్ కుమార్ మూడేళ్లు జైలు శిక్ష, రూ. రెండు లక్షలు జరిమానా, బోనం రాజా రత్నంకు మూడేళ్లు జైలు శిక్ష, ఒక లక్ష జరిమానా విధిస్తూ జడ్జి తీర్పునిచ్చారు. జరిమానా చెల్లించని పక్షంలో మరో ఐదేళ్లు కఠినగారా శిక్ష అనుభవించాలని ఆదేశించారు.



# 'శ్రీనివాససేతు'కి జాతీయస్థాయిలో అవార్డు

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

తిరుపతిలో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన శ్రీనివాససేతు ఫ్లై ఓవర్ బ్రిడ్జ్‌కు జాతీయస్థాయిలో మొదటి స్థానం దక్కింది. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్రిడ్జ్ ఇంజనీర్స్ వారు ముంబైయిలో శుక్రవారం నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవంలో శ్రీనివాససేతు ఫ్లై ఓవర్ బ్రిడ్జ్ నిర్మాణాన్నికి మొదటి స్థానం లభించింది.తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ సూపరింటెండెంట్ ఇంజనీర్ తిరుమాలిక మోహన్, మున్సిపల్ ఇంజనీర్ చంద్రశేఖర్‌కు, ఫ్లై ఓవర్ పనులను చేపట్టిన అప్కాన్స్ ప్రతినిధి రంగస్వామికి అవార్డును అందజేశారు.

# సైన్స్‌తోనే భవిష్యత్తు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

సైన్సుతోనే భవిష్యత్తు ఆధారపడి ఉంటుందని పలువురు వక్తలు అన్నారు. నేషనల్ సైంటిఫిక్ టెంపర్ క్యాంపెయిన్‌లో భాగంగా జెవివి ఆధ్వర్యంలో రాజమహేంద్రి మహిళా కళాశాలలో శుక్రవారం కళాజాతా నిర్వహించారు. కళాశాల కరస్పాండెంట్ టికె.విశ్వేశ్వరరెడ్డి ఈ జాతాను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజలు సైన్స్‌ను నమ్మి, నిరంతరం సైన్సును అధ్యయనం చేస్తూ భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలన్నారు. స్వశక్తితో అందరూ గొప్ప వ్యక్తులుగా ఎదగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జాతా కెప్టెన్ జి.మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.



# పించన్ రూ.9 వేలు చేయాలి

- పెన్షనర్స్, రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరోకేంద్ర ప్రభుత్వం ఎంప్లాయిస్ పెన్షన్ కింద వున్న రిటైర్డు ఉద్యోగులకు రూ.9 వేలకు ఇపిఎస్ పెన్షన్‌ను పెంచాలని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. విజయవాడలోని ధర్నా చౌక్‌లో అసోసియేషన్ ఆధ్వర్యంలో రిటైర్డు ఉద్యోగులు తమ సమస్యలను పరిష్కరించాలని శుక్రవారం రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె సత్తిరాజు మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా 75 లక్షల మందికి పైగా ఇపిఎస్ పెన్షనర్లకు చాలీచాలని పెన్షన్ ఇస్తున్నారని తెలిపారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి రాకముందు కనీస పెన్షన్ రూ.9 వేలకు పెంచుతామని హామీ ఇచ్చి విస్మరించారని విమర్శించారు. ఇపిఎస్ పెన్షనర్లకు కూడా హయ్యర్ పెన్షన్‌కు దరఖాస్తు చేసుకునేందుకు అనుమతించాలని కోరారు. అలాగే రిటైర్డు ఉద్యోగులకు వైద్య సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్రం తక్షణం సీనియర్ సిటిజన్‌లకు రైల్వే ప్రయాణాల్లో రాయితీని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా ఇప్పటికే 95 పెన్షనర్ల సంఘాలు సమస్యల పరిష్కారం కోసం ఏకతాటిపైకి వచ్చాయని తెలిపారు. పెన్షనర్ల సమస్యల పట్ల కేంద్రం ఇలాగే నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి సిహెచ్ సత్యనారాయణరాజు, రాష్ట్ర కార్యదర్శి చంద్రమౌళి, నాయకులు సుధాకరప్ప, శేషయ్య, కె బాబూరావు, సిహెచ్ రాంబాబు, కె శ్రీనివాసరావుపాల్గొన్నారు.



# తొలి టి20లో ఆసీస్ గెలుపు


## వెస్టిండీస్‌తో సిరీస్



**హోబర్ట్:** వెస్టిండీస్‌తో జరిగిన తొలి టి20లో ఆస్ట్రేలియా సునాయాసంగా విజయం సాధించింది. మూడు టి20ల సిరీస్‌లో భాగంగా బెల్రైవ్ వేదికగా శుక్రవారం జరిగిన తొలి టి20లో ఆతిథ్య ఆస్ట్రేలియా జట్టు 11 పరుగుల తేడాతో విండీస్‌ను చిత్తుచేసింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 7వికెట్ల నష్టానికి 213పరుగులు చేసింది. ఛేదనలో వెస్టిండీస్ చివరి బంతి వరకు పోరాడి 8వికెట్లు కోల్పోయి 202పరుగులే చేయగల్గింది. ఆసీస్ ఓపెనర్ డేవిడ్ వార్నర్(70), ఇంగ్లిస్(39), టిమ్ డేవిడ్(37) బ్యాటింగ్‌లో రాణించారు. వెస్టిండీస్ బౌలర్లు ఆండీ రసెల్‌కు మూడు, జోసెఫ్‌కు రెండు, హోల్డర్, షెఫర్డ్‌కు ఒక్కో వికెట్ దక్కాయి. భారీ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో వెస్టిండీస్ ఓపెనర్ కింగ్(53) అర్ధసెంచరీకి తోడు ఛార్లెస్(42), ఆల్‌రౌండర్ హోల్డర్(34) బ్యాటింగ్‌లో రాణించినా ప్రయోజనం లేకపోయింది. ఆస్ట్రేలియా స్పిన్నర్ ఆడం జంపాకు మూడు, స్టొయినీస్‌కు రెండు, బెహ్రెన్‌డార్ఫ్, మ్యాక్స్‌వెల్, అబట్‌కు ఒక్కో వికెట్ దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ డేవిడ్ వార్నర్‌కు లభించింది. దీంతో మూడు టి20ల సిరీస్‌లో ఆస్ట్రేలియా జట్టు 1-0 ఆధిక్యతలో ఉండగా.. రెండో టి20 11(ఆది)న ఆడిలైడ్ వేదికగా జరగనుంది.

## పారిస్ ఒలింపిక్స్ తర్వాత

# అథ్లెటిక్స్‌కు ఫ్రేజర్ ప్రైస్ గుడ్‌బై



**జమైకా:** మూడుసార్లు ఒలింపిక్ ఛాంపియన్ షెల్లీ-అన్ ఫ్రేసర్ ప్రైజ్ అథ్లెటిక్స్‌కు గుడ్‌బై చెప్పనున్నట్లు ప్రకటించింది. 2024 పారిస్ ఒలింపిక్స్ తన కెరీర్‌లో ఆఖరి అథ్లెటిక్స్ పోటీలు అని ప్రైస్ శుక్రవారం ట్విటర్ వేదికగా తెలిపింది. మహిళల 100మీ. స్ప్రింట్‌లో ఫ్రేసర్ వరుసగా నాలుగు ఒలింపిక్స్‌లో పతకాలతో సత్తా చాటింది. బీజింగ్ వేదికగా జరిగిన 2008 ఒలింపిక్స్‌లో తొలిసారి 100మీ. స్ప్రింట్‌లో స్వర్ణ పతకం సాధించిన ప్రైస్.. 2016(రియో)లో రజతం, 2020 టోక్యో ఒలింపిక్స్‌లో స్వర్ణ పతకం సాధించింది. ఓ బిడ్డకు తల్లి అయిన 37ఏళ్ల ప్రైస్.. కుటుంబ సభ్యులతో ఎక్కువ సమయం గడపాలని ఈ నిర్ణయం తీసుకున్నట్లు ట్వీట్‌లో పేర్కొంది. ఒలింపిక్స్‌లో జమైకా తరఫున వరుసగా నాలుగు ఒలింపిక్స్‌లో పతకం సాధించిన ఏకైక స్ప్రింటర్ ప్రైస్ మాత్రమే.


**HDFC BANK** We understand your world

**హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్** బ్రాంచి ఆఫీసు: 50-96-5, ప్లాట్ నం.175, సీతంధార, పాత ఎస్‌బిహెచ్ ఎదురుగా, విశాఖపట్నం-530013.

**స్వాధీనతా ప్రకటన (స్థిరాస్తి కొరకు)**

(ది సెక్యూరిటీ ఇంటెరెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్, 2002 యొక్క రూల్ 8తో చదువబడే చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింది ప్రకారం).

[illegible]

**ఆస్తి యొక్క షెడ్యూలు**

తిరుమలశెట్టి వేంకటేశ్వర రావు పేరున ఉన్న గుంటూరు జిల్లా, రేపల్లె సబ్-రిజిస్ట్రీ, రేపల్లె మండలం, గంగడిపాలెం గ్రామం వద్దగల డోర్ నం.57/ఎ లో డివిజన్ నం.340/2లో 177చ.గ.ల విస్తీర్ణం మొత్తం మరియు సరిహద్దులు: తూర్పు: సర్కారు బండెల రోడ్. దక్షిణం: సర్కారు రోడ్, పడమర: లంకె వేంకటేశ్వర రావు ల్యాండ్, ఉత్తరం: ఉమ్మడి నడద దారి.

తేది: 09.02.2024 అధీకృత అధికారి, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్.

# విద్యుత్ కేంద్రాల భద్రతా సిబ్బందికి జీతాలు లేవు

- వందకోట్లకు పైగా బకాయిలు

**ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి**

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న విద్యుదుత్పత్తి సంస్థలను పరిరక్షించే బలగాలకు సకాలంలో జీతాలు అందడం లేదు. ఈ విషయంలో జెన్‌కో గాని, అధికారులుగాని స్పందించడంలేదని అంటున్నారు. దీంతో భద్రతను పర్యవేక్షించే స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ సిబ్బంది అనేక ఇబ్బందులకు గురి కావాల్సివస్తోంది. వీరికి బకాయిలు పడ్డ మొత్తం వందకోట్లకు పైగా రూపాయలుపైనే ఉన్నట్లు చెబుతున్నారు. రాష్ట్రంలో ఉన్న కీలక విద్యుదుత్పత్తి కేంద్రాలకు భద్రత కల్పించే బాధ్యతను చాలాకాలంగా ఎస్‌పిఎఫ్ కే అప్పగించారు. శ్రీశైలం జల విద్యుత్ కేంద్రంతోపాటు మరికొన్ని థర్మల్ విద్యుత్ కేంద్రాలు కూడా ఎస్‌పిఎఫ్ ఆధీనంలోనే ఉన్నాయి. ఈ కేంద్రాల వద్ద వందల సంఖ్యలో ఎస్‌పిఎఫ్ బలగాలు పహారా కాస్తుంటాయి. వాస్తవానికి ఎస్‌పిఎఫ్ ఒక ప్రత్యేక దళం అయినప్పటికీ, అనేక ప్రభుత్వ రంగ సంస్థలు వీరి సేవలను వినియోగించుకుంటున్నాయి. దీనికోసం ఆయా సంస్థలే ఎస్‌పిఎఫ్ బలగాలకు జీతభత్యాలు భరించాల్సి ఉంటుంది. ఇందులో భాగంగానే జెన్‌కో కూడా తన పరిధిలోని రాయలసీమ థర్మల్ విద్యుత్ కేంద్రం, నెల్లూరు జిల్లాలోని దామోదరం సంజీవయ్య విద్యుత్ కేంద్రం, ఇబ్రహీంపట్నం వద్ద ఉన్న నార్ల తాతారావు విద్యుత్ కేంద్రం, నాగార్జునసాగర్ పవర్ హౌస్, నాగార్జునసాగర్ టెయిల్ పాండ్ డ్యామ్ కేంద్రాలకు ఎస్‌పిఎఫ్ బలగాలను వినియోగిస్తోంది. ఈ ఆరు కేంద్రాల్లో విధులు నిర్వహిస్తున్న ఎస్‌పిఎఫ్‌కి జెన్‌కో నుంచి 134 కోట్ల రూపాయల వరకు బకాయి ఉన్నట్లు తెలిసింది. అత్యధికంగా నార్ల తాతారావు విద్యుత్ కేంద్రానికే 43 కోట్ల వరకు చెల్లింపులు చేయాల్సి ఉందని అధికారులు అంటున్నారు. ఆ తరువాత రాయలసీమ విద్యుత్ కేంద్రంలో పనిచేస్తున్న బలగాలకు 30 కోట్లకుపైగా, దామోదరం సంజీవయ్య విద్యుత్ కేంద్రంలో పనిచేసే వారికి 25 కోట్ల రూపాయలకుపైగా బకాయిలు ఉన్నట్లు చెబుతున్నారు. ఈ బకాయిలపై 2022 అక్టోబర్ లోనే అనేక పర్యాయాలు జెన్‌కో అధికారులకు, ఆర్థికశాఖ అధికారులకు ఎస్‌పిఎఫ్ నుంచి లేఖలు వెళ్లాయి. అయినప్పటికీ ఇంతవరకు నిధులు విడుదల కాలేదని సమాచారం.




ధర్నా చేస్తున్న నిరుద్యోగులు

## మెగా డిఎస్‌సి కోసం
# నిరుద్యోగుల ధర్నా

**ప్రజాశక్తి-పల్నాడు జిల్లా**

రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 25 వేల టీచర్ పోస్టుల భర్తీ కోసం మెగా డిఎస్‌సి విడుదల చేయాలని, విద్యా రంగాన్ని బలోపేతం చేయాలనే డిమాండ్‌తో డివైఎఫ్‌ఐ, ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువత పల్నాడు జిల్లా నరసరావుపేటలో శుక్రవారం ధర్నా చేశారు. అనంతరం కలెక్టరేట్‌కు ప్రదర్శనగా వెళ్లి డిఆర్‌ఒకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డివైఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న మాట్లాడుతూ ప్రతి ఏటా డిఎస్‌సి విడుదల చేస్తామని ఎన్నికల సమయంలో జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చి విస్మరించారన్నారు. ఎన్నికల సమీపిస్తున్న తరుణంలో 6,100 పోస్టులతో నోటిఫికేషన్ విడుదల చేసి డిఎస్‌సి అభ్యర్థులను మోసం చేశారని మండిపడ్డారు. లక్షల సంఖ్యలో ఉన్న డిఎస్‌సి అభ్యర్థులకు ఈ ఉద్యోగాలు ఎలా సరిపోతాయని ప్రశ్నించారు. జిఒ 117ను వెంటనే రద్దు చేయాలని, మూసేసిన పాఠశాలలను పునఃప్రారంభించాలని డిమాండ్ చేశారు. పోరాటాల ఫలితంగా రద్దయిన అప్రెంటిస్ విధానాన్ని మళ్లీ అమలు చేయాలనుకోవడం దుర్మార్గమన్నారు. ధర్నాలో డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయరాజు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.సాయికుమార్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఆంజనేయులు నాయక్, శ్రామిక మహిళా సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ డి.శివకుమారి, ప్రజాసంఘాల నాయకులు మద్దతు తెలిపారు.

# స్టాక్ మార్కెట్లోకి మరిన్ని పిఎఫ్ నిధులు..!

- ఇపిఎఫ్‌పై వడ్డీ తగ్గింపు
- సిబిటి ప్రతిపాదన

**న్యూఢిల్లీ :** ఉద్యోగ, కార్మికుల ప్రావిడెంట్ ఫండ్ నిల్వలపై వడ్డీ రేట్లు తగ్గనున్నాయని రిపోర్టులు వస్తున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2023-24కి గాను ఇపిఎఫ్‌పై 8 శాతం వడ్డీ ఇవ్వాలని ఇపిఎఫ్ఒ సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ (సిబిటి) ప్రతిపాదనలు చేసిందని సమాచారం. ఈ విషయమై శనివారం జరిగే సిబిటి సమావేశంలో నిర్ణయం తీసుకోనున్నారని తెలుస్తోంది. అదే విధంగా స్టాక్ మార్కెట్లలో ఇపిఎఫ్ పెట్టుబడుల పరిమితిని 10 శాతం నుంచి 15 శాతానికి పెంచే ప్రయత్నం కూడా చేస్తోంది. ఒకే వేళ అదే జరిగితే స్టాక్ మార్కెట్లలో ఎప్పుడైనా సంక్షోభం నెలకొంటే... ఆరు కోట్ల మంది ఉద్యోగ, కార్మికుల సొమ్ము భద్రతపై నీలి నీడలు నెలకొననున్నాయి. నేడు జరగనున్న భేటీలో పిఎఫ్ ఖాతా నిల్వలపై వడ్డీరేటును 8 శాతం చెల్లించాలని ప్రతిపాదిస్తే కేంద్ర ఆర్థిక శాఖ ఆమోదానికి పంపుతారని ఆ వర్గాలు పేర్కొంటున్నాయి. గడిచిన ఆర్థిక సంవత్సరం 2022-23లో 8.15 శాతం వడ్డీ చెల్లించారు. 1977-78లో అత్యల్పంగా 8 శాతం వడ్డీ అందించారు. ఆ తర్వాత ఈ స్థాయిలో తగ్గించడం ఇదే తొలిసారి. 8 శాతం వడ్డీ రేటుపై సిబిటి ప్రతిపాదనలను కేంద్రం ఆమోదిస్తే ఆర్థికశాఖ నోటిఫికేషన్ జారీ చేయనుంది.

# అనుకోని ప్రధాని.. అరుదైన పురస్కారం..!

**న్యూఢిల్లీ :** దక్షిణాది నుంచి, మరీ ముఖ్యంగా తెలుగు గడ్డ నుంచి దేశంలోనే సర్వశక్తివంతమైన ప్రధాని పదవిని అధిష్ఠించిన వ్యక్తిగా పాములపర్తి వెంకట నరసింహారావు (పివి నరసింహారావు) నిలిచారు. ఇది అనుకోకుండా జరిగిందే. ముందు నుంచి నెహ్రూ కుటుంబానికి విధేయుడిగా ఉన్న పివి నరసింహారావు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా, కేంద్ర హోం, విదేశీ వ్యవహారాలు, రక్షణశాఖల మంత్రిగా పనిచేశారు. అప్పటికే ఎనిమిది ఎన్నికల్లో వరుసగా విజయాలు సాధించారు. 1991 నాటికి ఆయన రాజకీయాల నుంచి విశ్రాంతి తీసుకోవాలనుకొని ఎన్నికల్లో నిలబడలేదు. అయితే ఈ ఎన్నికల ప్రచారంలో రాజీవ్ గాంధీ దారణ హత్య తర్వాత అనూహ్యంగా ఆయన పేరు తెరపైకి వచ్చింది. వివాదరహితుడు, అందరికీ ఆమోదయోగ్యుడు కావడంతో ప్రధాని పదవి ఆయన్ను వరించింది. 1991 జూన్ 21న బాధ్యతలు స్వీకరించారు.

సోవియట్ యూనియన్ పతనం తరువాత మన దేశ విదేశాంగ విధానంలో గణనీయమైన మార్పువచ్చింది. అది ఆర్థిక రంగంలోనూ మార్పులకు దారి తీసింది. ప్రభుత్వ రంగ సంస్థలను బలోపేతం గావిస్తూ, స్వావలంబన కోసం పాటుపడాల్సింది పోయి ప్రైవేటీకరణ, సరళీకరణ, ప్రపంచీకరణ (ఎల్‌పిజి) విధానాలకు పివి నరసింహారావు ప్రభుత్వం తెరలేపింది. ఇందుకోసం ప్రపంచ బ్యాంకు ఉద్యోగి, రిజర్వు బ్యాంకు మాజీ గవర్నరు మన్మోహన్ సింగ్‌ను ఆర్థికమంత్రిగా తీసుకొచ్చి ఈ దేశంలో కార్పొరేట్లకు, బడా వ్యాపారులకు అనుకూలంగా ఆర్థిక సంస్కరణలను ప్రవేశపెట్టారు. ఇందుకుగాను పివిని అపర చాణుక్యుడని కార్పొరేట్ మీడియా ఆకాశానికెత్తింది. పివి నేతృత్వంలోని మైనార్టీ ప్రభుత్వానికి మెజార్టీ చేకూర్చేందుకు పెద్దయెత్తున ఫిరాయింపులు ప్రోత్సహించాయి. అవినీతి కుంభకోణాలు కూడా అసాధారణ రీతిలో చోటుచేసుకోనారంభించింది ఈ సంస్కరణలు ప్రవేశపెట్టాకే. ప్రైవేటు కంపెనీలు తమకు అవసరమైనవి దిగుమతి చేసుకొనేలా స్వేచ్ఛను ఇచ్చింది. అలాగే 1991 బడ్జెట్‌కు ముందు.. కొత్త పారిశ్రామిక విధానాన్ని పీవీ ప్రభుత్వం ప్రకటించింది. అప్పటివరకు పరిశ్రమలకు, పెట్టుబడులకు ఇబ్బందిగా మారిన లైసెన్స్ విధానం నుంచి ఆర్థిక వ్యవస్థను దూరంగా తీసుకెళ్లింది. దీనికింద మోనోపోలీస్ అండ్ రిస్ట్రిక్టివ్ ట్రేడ్ ప్రాక్టీస్ యాక్ట్‌లో మార్పులు తెచ్చింది. వ్యాపారాల పునర్ వ్యవస్థీకరణ, విలీనం, కలయికలను సులభతరం చేసింది.



18 పరిశ్రమలు మినహా మిగిలిన వాటికి పెట్టుబడితో సంబంధం లేకుండా లైసెన్స్‌ల అవసరాన్ని తొలగించింది. బడ్జెట్‌తో పివి ప్రభుత్వం చేతులు దులుపుకోలేదు. ఆ తర్వాత కూడా మరో ఎనిమిది నెలల పాటు సంస్కరణల జోరును కొనసాగించింది. ఎగుమతులను ప్రోత్సహించడానికి సెకండ్ ట్రేడ్ పాలసీ, చిన్న సంస్థలకు ప్రోత్సాహకాలను అందించింది. ఆర్థికరంగంలో సంస్కరణలను సూచించేందుకు ఆర్‌బీఐ గవర్నర్ ఎం.నరసింహన్ అధ్యక్షతన, ఆ తర్వాత పన్ను సంస్కరణల బాధ్యతలను ఆర్థికవేత్త రాజ చల్లయ్య అధ్యక్షతన రెండు కమిటీ ఏర్పాటు చేసింది.

## రైతు బాంధవుడు



ఉత్తర్‌ప్రదేశ్‌లోని సామాన్య కుటుంబంలో చౌధరి చరణ్ సింగ్ 1903 డిసెంబర్ 23న జన్మించారు. మహాత్ముడి స్ఫూర్తితో స్వాతంత్ర్య సంగ్రామంలోకి అడుగుపెట్టారు. తొలుత ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ తరఫున చురుగ్గా వ్యవహరించిన ఆయన.. అక్కడి విధానాలు నచ్చక సొంత పార్టీ పెట్టుకున్నారు. 1967లో భారతీయ క్రాంతి దళ్‌ను స్థాపించారు. తర్వాత కాలంలో యూపీ సీఎంగా రెండుసార్లు బాధ్యతలు నిర్వర్తించారు. 1967 ఏప్రిల్ 3 నుంచి 1968 ఫిబ్రవరి 25 వరకు తొలిసారి సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటుచేశారు. ఆ ప్రభుత్వం ఏడాది తిరగకముందే కుప్పకూలింది. దీంతో రాష్ట్రపతి పాలన అమల్లోకి వచ్చింది. ఇందిర కాంగ్రెస్ మద్దతుతో 1970 ఫిబ్రవరి 18 నుంచి అదే ఏడాది అక్టోబర్ 1 వరకు రెండోసారి ముఖ్యమంత్రిగా వ్యవహరించారు. ఇందిర కాంగ్రెస్ మద్దతు ఉపసంహరణతో ఆయన ప్రభుత్వం మరోసారి కుప్పకూలింది. అప్పటివరకు యూపీ రాజకీయాలకే పరిమితమైన చరణ్‌సింగ్.. ఆ తర్వాత జాతీయ రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. మొరార్జీదేశాయ్ మంత్రివర్గంలో కేంద్ర హోంశాఖ, ఆయన హయాంలోనే 1979 జనవరి నుంచి జులై వరకు డిప్యూటీ ప్రధానిగా, ఆర్థిక మంత్రిగా పనిచేశారు. ఇందిర కాంగ్రెస్ వెలుపలి నుంచి మద్దతు ఇవ్వడంతో ప్రభుత్వం ఏర్పాటైంది. దీంతో 1979 జులై 28 నుంచి ఆగస్టు 20 మధ్య కేవలం 23 రోజుల పాటు దేశ ఐదో ప్రధానిగా చరణ్‌సింగ్ సేవలందించారు. ఇందిర కాంగ్రెస్ తన మద్దతును ఉపసంహరించుకోవడంతో సంకీర్ణ ప్రభుత్వం కూలిపోయి మళ్లీ ఎన్నికలు జరిగేంత (1980 జనవరి) వరకు తాత్కాలిక ప్రధానిగా వ్యవహరించారు.

**రైతుల కోసం సంస్కరణలు..**

రైతు కుటుంబంలో జన్మించిన చరణ్‌సింగ్‌కు వారి కష్టాల గురించి బాగా తెలుసు. అందుకే రైతుల కోసం, గ్రామీణ భారతం కోసం ఏదైనా చేయాలనుకున్నారు. దేశంలోని అతిపెద్ద రాష్ట్రమైన యూపీలో వ్యవసాయం రూపురేఖలు మార్చిన ఘనత చరణ్‌సింగ్‌కే దక్కుతుంది. బ్రిటీష్ హయాంలో 1939లోనే రైతుల కోసం రుణ విముక్తి బిల్లును తీసుకొచ్చారు. అప్పుల ఊబిలో కూరుకుపోయిన ఎంతోమంది రైతన్నలకు ఇది ఉపశమనం కల్పించింది. అన్నదాతల ఆత్మహత్యలను తగ్గించడంలో కీలక భూమిక పోషించింది. స్వాతంత్ర్యం అనంతరం యూపీ తొలి సీఎం గోవింద్ వల్లభ్‌పంత్ మంత్రివర్గంలో రెవెన్యూ మంత్రిగా పని చేశారు. ఆ సమయంలోనే జమిందారీ వ్యవస్థ నిర్మూలన చట్టం, ల్యాండ్ హోల్డింగ్ యాక్ట్ తీసుకొచ్చారు. భూస్వాముల చేతుల్లో మూలుగుతున్న భూమిపై పేదలకు హక్కులు కల్పించారు. ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మంత్రులకు జీతాలు, ఇతర ప్రయోజనాల్లో భారీగా కోత పెట్టారు. 1980 జనవరి 14న ఆయన తుది శ్వాస విడిచారు.

## ఐపిఎస్ కాదనుకుని....



మాన్‌కొంబు సాంబశివన్ స్వామినాథన్ (ఎం.ఎస్. స్వామినాథన్) తమిళనాడులోని కుంభకోణంలో 1925 ఆగస్టు 7న జన్మించారు. అతనికి 15 ఏళ్లు నిండకముందే తండ్రి చనిపోవటంతో అప్పటికే కుటుంబం నిర్వహిస్తున్న ఆసుపత్రిని చూసుకొనేందుకు వైద్య విద్య చదవాల్సి వచ్చింది. కానీ, విద్యార్థిగా బెంగాల్‌లో దారుణ క్షామాన్ని చూసిన స్వామినాథన్, ఆకలితో ఎవరూ చనిపోయే పరిస్థితి ఉండకూడదని తపించారు. తాను వైద్యవృత్తిని చేపట్టబోనని కుటుంబానికి తేల్చి చెప్పి కోయంబత్తూరులోని మద్రాసు అగ్రికల్చర్ కాలేజీలో చేరారు. ప్రిన్సిపాల్ పిలిచి 'మంచి మార్కులు వచ్చాయి. అనవసరంగా ఈ కోర్సులో ఎందుకు చేరాలనుకుంటున్నావు?' అని స్వామినాథన్‌ను అడుగగా, ఆ సమయంలో అగ్రికల్చర్ కోర్సు చదవటమనేది నామోషీగా భావించేవారని, ఆ భావనను తొలగించేందుకే తాను ఇందులో చేరుతున్నానంటూ బదులు చెప్పారట .

1944లో మొదలైన స్వామినాథన్ వ్యవసాయ విద్యా ప్రస్థానం- జెనెటిక్స్‌లోకి, పంటలు, దిగుబడుల మెరుగుదల వైపు సాగింది. చీడపీడలను తట్టుకొని ఎక్కువ దిగుబడినిచ్చే వంగడాలను తయారుచేస్తే రైతులకే కాకుండా యావత్ మానవాళికి మేలు జరుగుతుందనే తపనతో ఆయన అడుగులు వేశారు. పీజీ పూర్తయ్యాక యూపీఎస్సీ పరీక్షలో ఐపీఎస్‌కు ఎంపికయ్యారు. కానీ, ఫెలోషిప్‌పై హాలెండ్‌లో వ్యవసాయ విద్యలో ఉన్నత చదువుకు అవకాశం రావడంతో అటువైపే మొగ్గు చూపారు. బంగాళదుంప జన్యు పరిణామంపై పరిశోధన చేశారు. తర్వాత అమెరికాకు వెళ్లి కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ చేశారు. విస్కాన్సిన్ విశ్వవిద్యాలయం ప్రెసిడెంట్ అక్కడే మంచి జీతంపై అధ్యాపక పోస్టు ఆఫర్ చేసినా తిరస్కరించారు. 1954లో కటక్‌లోని 'కేంద్ర వరి పరిశోధన సంస్థ'లో చేరి, తర్వాత భారతీయ వ్యవసాయ పరిశోధన సంస్థకు మారారు.

స్వాతంత్ర్యం వచ్చేనాటికి దేశంలో ఏటా 60 లక్షల టన్నుల గోధుమలు మాత్రమే పండేవి. విదేశాల నుంచి సరకు వస్తేగానీ పొట్ట నిండని పరిస్థితి. అమెరికా నుంచి గోధుమలను భారీగా దిగుమతి చేసుకునేవాళ్లం. 1960ల ఆరంభంలోనూ దేశంలో గోధుమల ఉత్పత్తి కోటి టన్నులు మాత్రమే. వరి దిగుబడి మరింత తక్కువ. 1966లో కరవు కారణంగా కోటి టన్నుల గోధుమల్ని అమెరికా నుంచి తెప్పించుకున్నాం. ఈ నేపథ్యంలో భారత వ్యవసాయ రంగ ముఖచిత్రాన్ని మార్చాలని స్వామినాథన్ నడుం బిగించటంతో హరిత విప్లవానికి బీజం పడింది. అధిక దిగుబడినిచ్చే వంగడాల తయారీ, ట్రాక్టర్ల లాంటి ఆధునిక పరికరాల వాడకం, సాగునీటి సదుపాయాలు మెరుగుపరచటం, ఎరువులు, పురుగుమందుల వాడకం, సాగు విస్తీర్ణం పెంచటం ఈ హరిత విప్లవంలో ప్రధానాంశాలు. 1967-68 నుంచి 1977-78 మధ్య పరిస్థితిలో భారీ మార్పు మొదలైంది. వరి, గోధుమ తదితర పంటలపై స్వామినాథన్ జరిపిన విశేష కృషితో దేశంలో ఆహారధాన్యాల ఉత్పత్తి గణనీయంగా పెరిగి హరిత విప్లవాన్ని సాధించింది. అయితే హరిత విప్లవం కారణంగా రసాయనాలు, ఎరువుల వాడకం పెరిగి భూసారం తగ్గిందనే విమర్శలనూ అంగీకరించటం స్వామినాథన్ వినమ్రతకు నిదర్శనం. "స్థానికంగా ఉండే వంగడాలను కోల్పోవద్దు. భూసారాన్ని కాపాడుకోకుండా, నీటి యాజమాన్య పద్ధతులు పాటించకుండా ఇష్టం వచ్చినట్లు వ్యవసాయం చేస్తే ఎడారులను సృష్టించినవారమవుతాం. హరిత విప్లవం కంటే సతత హరిత (ఎవర్‌గ్రీన్) విప్లవం కావాలి" అని ఆయన కోరుకున్నారు.

ఎంతో శోధించి, పరిశోధించి రూపొందించిన వంగడాలతో భారత్‌లో బంగారు పంటలు పండించిన స్వామినాథన్.. వయోధిక కారణాలతో చెన్నై తేనాంపేటలోని స్వగృహంలో 2023 సెప్టెంబర్ 28న తుదిశ్వాస విడిచారు.

## భావ ప్రకటనకు సంకెళ్లు

- జర్నలిస్ట్ నిఖిల్ వాగ్లేపై పోలీసుల ఎఫ్ఐఆర్
- అద్వానీకి భారతరత్నపై విమర్శల ఫలితం

**న్యూఢిల్లీ :** భారత్‌లో భావప్రకటనా స్వేచ్ఛకు చోటు ఉండటం లేదు. బీజేపీ పాలనలో ఇది చాలా తీవ్రమైంది. ఐక్యరాజ్యసమితితో పాటు పలు జాతీయ, అంతర్జాతీయ నివేదికలు, సంస్థలూ ఇదే విషయాన్ని చెప్తున్నాయి. బీజేపీ సీనియర్ నాయకులు ఎల్.కె అద్వానీకి కేంద్రంలోని మోడీ సర్కారు భారతరత్న అవార్డును ప్రకటించిన విషయం తెలిసిందే. కేంద్రం నిర్ణయాన్ని పలువురు తప్పుబట్టారు. 'మహారాష్ట్రలోని ఒక జరల్నిస్టు కూడా ఇదే భావాన్ని వ్యక్తం చేశారు. అద్వానీకి భారతరత్నను ప్రకటించటంపై నిఖిల్ వాగ్లే విమర్శించారు. ఈ మేరకు తన అభిప్రాయాన్ని సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా వ్యక్తపరిచారు. తన భావాన్ని ప్రకటించటమే ఇప్పుడు ఆ జర్నలిస్టుకు శాపమైంది. దీని ఫలితంగా ఇప్పుడు ఆయనపై కేసు నమోదైంది. బీజేపీ నాయకుడు చేసిన ఫిర్యాదు మేరకే మహారాష్ట్ర పోలీసులు సదరు జర్నలిస్టుపై ఎఫ్ఐఆర్ దాఖలు చేయటం గమనార్హం. బీజేపీకి చెందిన సునీల్ దేవధర్.. విశ్రాంబాగ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన కొద్ది రోజులకే వాగ్లేపై ఐపీసీలోని సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదైంది.

### సిఎం జగన్, కొలీజియంపై

## కఠిన పదజాలం వ్యాఖ్యలు కొట్టివేత

- హైకోర్టు న్యాయమూర్తి రాకేష్ కుమార్ తీర్పులోని అంశాలను పక్కన పెట్టిన సుప్రీం

**ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో**

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని కఠిన పదజాలంతో వ్యాఖ్యలు చేస్తూ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాకేష్ కుమార్ నేతృత్వంలోని ధర్మాసనం జారీ చేసిన వివాదాస్పద ఆదేశాలను సుప్రీంకోర్టు కొట్టివేసింది. జస్టిస్ రాకేష్ కుమార్ 2020 డిసెంబర్ 31 ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను శుక్రవారం విచారించిన సుప్రీంకోర్టు న్యాయమూర్తులు బేలా ఎం త్రివేది, పంకజ్ మిథాల్‌లతో కూడిన ధర్మాసనం హైకోర్టు ఉత్తర్వుల్లోని అన్ని వివాదాస్పద పరిశీలనలను పక్కనబెట్టింది. ప్రభుత్వ భూములను వేలం వేయడాన్ని సవాలు చేసే కేసు నుండి న్యాయమూర్తిని తప్పుకోవాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన తిరస్కరణ దరఖాస్తుకు ప్రతిస్పందనగా జస్టిస్ రాకేష్ కుమార్ తీర్పు ఇచ్చారు. ఈ క్రమంలో, జస్టిస్ కుమార్ ఇద్దరు ప్రధాన న్యాయమూర్తుల బదిలీకి సంబంధించి సుప్రీంకోర్టు కొలీజియం నిర్ణయాన్ని విమర్శించారు. తన తీవ్ర అసమ్మతిని వ్యక్తం చేశారు. అలాగే వైఎస్ జగన్మోహన్ రెడ్డి నేతృత్వంలోని పరిపాలన వ్యవస్థ హైకోర్టును అణగదొక్కే ప్రయత్నాలకు కారణమైందని పేర్కొన్నారు. రాజ్యాంగ సంస్థల పనితీరులో ప్రభుత్వం జోక్యం చేసుకుంటోందని ఆరోపించారు. ముఖ్యమంత్రిపై క్రిమినల్ కేసుల పరిష్కారంలో జాప్యంపై కూడా తీవ్ర విమర్శలు చేశారు. ఎవరైనా న్యాయమూర్తిపై ఫిర్యాదు చేసినట్లయితే, పరిష్కారం పెద్ద బెంచ్ లేదా హైకోర్టు ముందు ఉంటుందని పేర్కొన్నారు. సరైన ప్రాతిపదిక లేకుండా న్యాయమూర్తిని కించపరిచే ఏదైనా ఫిరాయింపులు లేదా సాహసం ధిక్కారమేనని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో పౌరుల ప్రాథమిక హక్కుల పరిరక్షణ "చాలా కష్టంగా" మారిందని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు కొలీజియం మరింత పారదర్శకంగా ఉండాలని, హైకోర్టు న్యాయమూర్తులు కూడా రాజ్యాంగబద్ధమైన పదవులను కలిగి ఉన్నారనే వాస్తవాన్ని పరిగణనలోకి తీసుకోవాలని అన్నారు.

### 'ఓటుకు నోటు' కేసు

## మధ్యప్రదేశ్‌కు బదిలీ చేయండి

- సుప్రీంకోర్టులో బిఆర్ఎస్ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల పిటిషన్
- తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డికి నోటీసులు

**ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో**

'ఓటుకు నోటు' కేసు విచారణను తెలంగాణ నుంచి మధ్యప్రదేశ్‌కి బదిలీ చేయాలని బిఆర్ఎస్ నేతలు దాఖలు చేసిన పిటిషన్‌పై ప్రతివాది, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. ఈ పిటిషన్‌పై నాలుగు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. 2015లో తెలంగాణలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు కోసం నామినేటెడ్ ఎమ్మెల్యే స్టీఫెన్‌సన్‌కు రేవంత్ రెడ్డి కోట్లు లంచంగా చూపి... అందులో అడ్వాన్స్‌గా రూ. 50 లక్షలు ఇచ్చారనేది ప్రధాన ఆరోపణగా ఉంది. ఈ వ్యవహారంలో తెలంగాణ ప్రభుత్వం వర్సెస్, ఏ రేవంత్ రెడ్డి, తెలంగాణ ప్రభుత్వం వర్సెస్ సండ్ర వెంకట వీరయ్యలతో రెండు కేసులు నమోదయ్యాయి. ప్రస్తుతం రెండు కేసుల విచారణ తెలంగాణలోని ప్రత్యేక న్యాయమూర్తి ధర్మాసనం ముందు పెండింగ్‌లో ఉన్నాయి. అయితే హైదరాబాద్ నుంచి ఈ కేసుల విచారణను తెలంగాణ వెలుపల మధ్యప్రదేశ్ లేదా చత్తీస్‌గఢ్ కు బదిలీ చేయాలని బిఆర్ఎస్ నేతలు, మాజీ మంత్రులు జగదీష్ రెడ్డి, సత్యవతి రాథోడ్, మహ్మూద్ అలీ, కల్వకుంట్ల సంజయ్ లు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. న్యాయవాది పి మోహిత్ రావు దాఖలు చేసిన ఈ పిటిషన్ శుక్రవారం జస్టిస్ గవాయి, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారించింది. ఈ కేసులో ప్రతివాదిగా ఉన్న రేవంత్ రెడ్డి ప్రస్తుతం తెలంగాణ ముఖ్యమంత్రి, హోం మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారని పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాదులు సిద్దార్థ్ దవే, డి శేషాద్రి నాయుడు, న్యాయవాది మోహిత్ లు వాదనలు వినిపించారు. అలాగే ఈ కేసులో వెంటనే ట్రయల్ కూడా మొదలు పెట్టడానికి సన్నాహాలు చేస్తున్నట్లు తమకు సమాచారం ఉందని నివేదించారు. ఇప్పటికిప్పుడు ట్రయల్ మొదలైతే... విచారణపై ప్రభుత్వ పెద్దల ప్రభావం చూపే అవకాశం ఉందని వాదనలు వినిపించారు. రేవంత్ రెడ్డిపై 88 క్రిమినల్ కేసులు నమోదైనట్లు తెలిపారు. పలు సందర్భాల్లో పోలీసులను బెదిరించేలా రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు చేశారని ధర్మాసనానికి నివేదించారు. 2015 నుంచి విచారణ జాప్యం అయ్యేలా నిందితులు ఏదో ఒక సాకుతో పిటిషన్లు వేసినట్లు పేర్కొన్నారు. ఈ కేసులో ఎపి మాజీ సిఎం చంద్రబాబు నాయుడు జోక్యం ఉందని తెలిపారు.

## రూ.570 కోట్ల విలువైన ఎలక్టోరల్ బాండ్‌లు విక్రయం

- ఇదంతా గతనెలలోనే
- 60 శాతం రూ.1 కోటి డినామినేషన్
- ఆర్టీఐ సమాధానంలో వెల్లడి

న్యూఢిల్లీ : ఈ ఏడాది జనవరి 2 నుంచి 11 వరకు కొనసాగిన ఎలక్టోరల్ బాండ్ల విక్రయం తాజా దశలో రూ. 570 కోట్లకు పైగా విలువైన ఎలక్టోరల్ బాండ్లు విక్రయించబడ్డాయి. సామాజిక కార్యకర్త కమోడోర్ లోకేష్ బాత్రా దాఖలు చేసిన సమాచార హక్కు (ఆర్టీఐ) ప్రశ్నకు ఇది సమాధానంగా వెలువడింది. తాజా దశ అమ్మకం అనేది.. గతేడాది నవంబర్‌లో స్కీమ్ చెల్లుబాటును సవాలు చేస్తూ సుప్రీంకోర్టు నాలుగు పిటిషన్లను విచారించడం ప్రారంభించినప్పటి నుంచి విక్రయించబడిన రెండో బ్యాచ్ ఎలక్టోరల్ బాండ్‌లు, 2018లో పథకం ప్రారంభించబడినప్పటి నుంచి విక్రయించబడిన 30వ బ్యాచ్ ఎలక్టోరల్ బాండ్‌లు. బాత్రా ప్రశ్నకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ) ఇచ్చిన సమాధానం ప్రకారం.. బెంగళూరు, చెన్నై, గాంధీనగర్, కోల్‌కతా, హైదరాబాద్, న్యూఢిల్లీ, విశాఖపట్నం, ముంబయి, జైపూర్ ఎస్బీఐ శాఖలలో రూ. 5,71,80,03,000 విలువైన ఎలక్టోరల్ బాండ్‌లు విక్రయించబడ్డాయి. రూ. 1,000, రూ. 10,000, రూ. 1 లక్ష మరియు రూ. 1 కోటి విలువ కలిగిన 897 బాండ్‌లలో దాదాపు సగం(415) కోల్‌కతాలో విక్రయించబడ్డాయి. అత్యధికంగా అమ్ముడైన రూ. 1 కోటి విలువ కలిగిన బాండ్‌లు 540 (60 శాతం వరకు) కాగా.. ఇందులో కోల్‌కతా(161), హైదరాబాద్ (131), చెన్నై (73)లు ముందు వరుసలో ఉన్నాయి. ఎలక్టోరల్ బాండ్ విక్రయం తదుపరి దశ ఫిబ్రవరి లేదా మార్చిలో జరుగుతుందని సమాచారం.

## ఆహారధాన్యాలసాగు, ఉత్పత్తి ఈ ఏడాదే అతి తక్కువ

(మొదటిపేజీ తరువాయి)

అంచనాల్లో పేర్కొనగా తుదకు 154 లక్షల టన్నులే లభించాయి. వరి విషయానికే వస్తే 2021-22లో 135 లక్షల టన్నులొస్తాయనుకుంటే ఫైనల్‌గా 121 లక్షల టన్నులొచ్చాయి. 2022-23లో 133 లక్షల టన్నులొస్తాయని అంచనా వేయగా 126 లక్షల టన్నులే వచ్చాయి. ఈ పూర్వరంగంలో ప్రస్తుతం వేసిన రెండవ అంచనాలు చివరాఖరులోనూ ఇలాగే ఉంటాయని చెప్పలేం. కళ్లముందు కరువు, తుపాన్ నష్టం కనిపిస్తుండగా వరి దిగుబడి (ఈల్డ్)ని ప్రభుత్వం భారీగా అంచనా వేసింది. ఈ ఐదేళ్లల్లోనే అత్యధికంగా ఎకరాకు 2,404 కిలోలొస్తాయంది. ఇది అతి అంచనా అని నిపుణులు చెబుతున్నారు.

## 1.5 డిగ్రీల సెంటిగ్రేడ్‌ను అధిగమించిన గ్లోబల్ వార్మింగ్

- ప్రప్రథమంగా ఏడాది పొడవునా నమోదైన ఇదే పరిస్థితి

**బ్రస్సెల్స్ :** మొట్టమొదటిసారిగా, గ్లోబల్ వార్మింగ్ ఏడాది పొడవునా 1.5 డిగ్రీల సెంటిగ్రేడ్ దాటిపోయిందని వాతావరణ నిపుణులు శుక్రవారం తెలిపారు. వాతావరణ మార్పులకు సంబంధించి అధ్వాన్న ప్రభావాలను నివారించాలంటే ఉష్ణోగ్రతను 1.5 డిగ్రీల సెంటిగ్రేడ్‌కు పరిమితం చేయాల్సిన అవసరం వుందంటూ శాస్త్రవేత్తలు ఎన్నాళ్లనుండో చెబుతున్నారు. గ్లోబల్ వార్మింగ్ 1.5 డిగ్రీల సెంటిగ్రేడ్‌ను దాటి 2 డిగ్రీలకు చేరుకుంటే మరింత ఉధృతంగా వడగాలులు, సముద్ర మట్టాలు పెరగడం, వన్యప్రాణి నష్టం వంటి ముప్పులు అధికమవుతాయని 2018లో విడుదలైన ఐక్యరాజ్య సమితి నివేదిక హెచ్చరించింది. యురోపియన్ యూనియన్‌కి చెందిన కొపర్నికస్ క్లైమేట్ ఛేంజ్ సర్వీస్ తాజాగా కొత్త డేటా వెలువరించింది. గ్లోబల్ వార్మింగ్‌ను కట్టడి చేయాలన్న లక్ష్యానికి కట్టుబడి వుంటామంటూ ప్రపంచ నేతలు హామీ ఇచ్చిన 2015 నాటి పారిస్ ఒప్పంద ఉల్లంఘన గురించి ఆ డేటా మాట్లాడలేదు. కానీ సుదీర్ఘకాలంలో ఇది ప్రపంచాన్ని మరింత సన్నిహితం చేస్తుందని వ్యాఖ్యానించింది. భూగోళం మరింత వేడెక్కకుండా నివారించాలంటే కాలుష్యకారక వాయువులను సత్వరం తగ్గించడమొక్కటే ఏకైక మార్గమని కొపర్నికస్ డిప్యూటీ డైరెక్టర్ సమంతా బర్గెస్ తెలిపారు. వార్షిక సగటు 1.5 డిగ్రీల సెంటిగ్రేడ్ అధిగమించడం ఇక్కడ ప్రధానమైన అంశమని రాయల్ మెటీరియోలాజికల్ సొసైటీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ప్రొఫెసర్ లిజ్ బెంట్లీ పేర్కొన్నారు. 'తప్పుడు దిశగా ఇది మరొక అడుగు. మనమేం చేయాలనేది మనం తెలుసుకుని వుండాలి." అని ఆయన వ్యాఖ్యానించారు. ఈ అభిప్రాయంతో ప్రపంచ మెటీరియోలాజికల్ ఆర్గనైజేషన్ చీఫ్ సాలో కూడా ఏకీభవించారు. ఈ ప్రభావంతో ఉత్తర అమెరికా, యూరప్‌ల్లో మరింతగా శీతల తుపానుల ముప్పు పెరుగుతుందన్నారు. 'ఏదైతే మన కళ్ల ముందు కనిపిస్తోందో ఆ ధోరణి చాలా స్పష్టంగా వుంది. ఆందోళనకరంగా వుంది" అని ఆమె అన్నారు. వెంటనే ప్రపంచ దేశాలు సత్వరం స్పందించాల్సిన ఆవశ్యకత వుందన్నారు. మన శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నా, మన కామన్‌సెన్స్ సూచిస్తున్నా వాటిని కాదని ఆర్థిక ప్రయోజనాలను దృష్టిలో వుంచుకుని మనం వెనుకడుగు వేస్తున్నామని ఆమె వ్యాఖ్యానించారు.

### ఉత్తరాఖండ్ హింసాకాండలో

## ఐదుకు చేరిన మరణాల సంఖ్య

- ముగ్గురి పరిస్థితి విషమం
- అల్లరి మూకలపై జిల్లా మేజిస్ట్రేటు ఆరోపణలు
- గాయపడిన పోలీసులతో సీఎం పుష్కర్‌సింగ్ ధమీ భేటీ

**డెహ్రాడూన్ :** ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీలో చెలరేగిన హింసలో మృతుల సంఖ్య ఐదుకు చేరింది. మరో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నది. తాజా పరిస్థితిపై జిల్లా మేజిస్ట్రేట్ శుక్రవారం మీడియా సమావేశంలో మాట్లాడారు. అల్లరి మూక పోలీస్ స్టేషన్‌లో చిక్కుకున్న పోలీసు సిబ్బందిని సజీవ దహనం చేయటానికి యత్నించిందని తెలిపారు. బన్‌భూల్‌పురా ప్రాంతంలోని నాజూల్ ల్యాండ్‌లో మసీదు, మదర్సాలను అక్రమ నిర్మాణాల పేరుతో స్థానిక అధికార యంత్రాంగం కూల్చివేత డ్రైవ్‌ను నిర్వహించటంతో గురువారం హింస చెలరేగిన విషయం తెలిసిందే. కూల్చివేత డ్రైవ్‌కు వచ్చిన పోలీసులు, కార్మికులపై రాళ్లు రువ్వడం, కార్లను తగులబెట్టటం, పోలీసు స్టేషన్‌ను చుట్టుముట్టడం వంటివి అల్లరి మూకలు చేశాయి. దీంతో ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్‌సింగ్ ధమి.. కనిపిస్తే కాల్చేయాలంటూ ఆదేశాలు జారీ చేశారు.

సీఎం శుక్రవారం జిల్లాకు వచ్చి గాయపడిన పోలీసు సిబ్బందిని పరామర్శించారు. కోర్టు ఆదేశాల మేరకు ఆక్రమణల నిరోధక డ్రైవ్ కొనసాగుతోందనీ, పరిపాలన యంత్రాంగం ముందుగానే ప్రజలకు తెలియజేసిందని ఆయన అన్నారు. అల్లర్లకు కారకులైనవారిపై కఠిన చర్యలుంటాయని తెలిపారు. ఉత్తరాఖండ్ డీజీపీ అభినవ్ కుమార్ మాట్లాడుతూ.. మృతుల సంఖ్య ఐదుకు పెరిగిందన్నారు. పోలీసులు ఆత్మరక్షణ కోసమే కాల్పులు జరిపారన్నారు. జిల్లాలో కర్ఫ్యూ కొనసాగటంతో పాటు భారీగా పోలీసులను మోహరించారు.

### ఇండో-పసిఫిక్, పశ్చిమాసియా పరిస్థితులపై

## ఆస్ట్రేలియాలో విదేశాంగ మంత్రి జైశంకర్ చర్చలు

**పెర్త్ :** ఆస్ట్రేలియాతో ద్వైపాక్షిక సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యంపై భారత విదేశాంగ మంత్రి జై శంకర్ శుక్రవారం చర్చలు జరిపారు. హిందూ మహాసముద్ర ప్రాంత దేశాల పరిస్థితులపై పెర్త్‌లో జరుగుతున్న రెండు రోజుల సదస్సుకు జైశంకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆస్ట్రేలియా విదేశాంగ మంత్రి పెన్నీ వాంగ్‌తో ఆయన పలు అంశాలపై చర్చించారు. ఇండో-పసిఫిక్ ప్రాంతం, పశ్చిమాసియాలో పరిస్థితులు, ఇతర ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాలపై వారిరువురు సుదీర్ఘంగా చర్చలు జరిపారు. హిందూ మహా సముద్ర ప్రాంత దేశాలకు సంబంధించిన పలు అంశాలపై కూడా పరస్పరం అభిప్రాయాలు తెలుసుకున్నామని జై శంకర్ ఎక్స్‌లో పోస్టు పెట్టారు. "సుస్థిర హిందూ మహా సముద్ర ప్రాంతం దిశగా" అన్నది ఈ ఏడాది సదస్సు ప్రధాన అంశంగా వుంది. మొత్తంగా 22 దేశాలకు చెందిన మంత్రులు, ప్రతినిధి బృందాలు ఈ సదస్సులోపాల్గొంటున్నాయి. 16 దేశాలకు చెందిన సీనియర్ అధికారుల బృందాలు, ఆరు బహుళపక్ష సంస్థలు పాల్గొంటున్నాయి. మొత్తంగా 400మందికి పైగా సామాజిక, కార్పొరేట్‌నేతలు, విధాన అమలుకర్తలు, మేధావులు, వృత్తినిపుణులు, 40 దేశాల నుండి మీడియా సిబ్బంది హాజరవుతున్నారు. 2016లో తొలుత సింగపూర్‌లో ఈ సదస్సును ప్రారంభించారు. ఈ ప్రాంతంలో అందరి భద్రత, అభివృద్ధికి ప్రాంతీయ సహకారానికి గల అవకాశాలు(సాగర్)పై చర్చించేందుకు ఒక ఉమ్మడి వేదికగా ఈ సమావేశాలు కీలక పాత్ర పోషిస్తాయి.



### వ్యవసాయ విధానాలపై

## స్పెయిన్‌లో భగ్గుమన్న రైతాంగం

- నాల్గవ రోజు ట్రాక్టర్లతో రోడ్ల దిగ్బంధనం

**మాడ్రిడ్:** యూరోపియన్ యూనియన్ అనుసరిస్తున్న వ్యవసాయ విధానాలకు వ్యతిరేకంగా, తీవ్ర కరువు బారిన పడిన రైతాంగాన్ని తక్షణమే ఆదుకోవాలని కోరుతూ స్పెయిన్‌లో రైతులు ఉద్యమించారు. వీరి ఆందోళన శుక్రవారం నాలుగో రోజుకు చేరుకుంది. వేలాది మంది రైతులు ట్రాక్టర్లతో జాతీయ రహదారులను దిగ్బంధించారు. ఇంకొందరు కాలి నడకన ప్రధాన నగర కేంద్రాలకు చేరుకుని తమ నిరసన తెలియజేస్తున్నారు. బార్సిలోనా, జరాగోజా, కెటాలినా తదితర ప్రాంతాల్లో వేలాది ట్రాక్టర్లతో రైతులు జాతీయ రహదారులపై అడ్డంగా నిలిపి వాహనాల రాకపోకలను స్తంభింపజేశారు. విపరీతంగా పెరిగిపోయిన వ్యవసాయ ఉత్పత్తి ఖర్చులను తగ్గించాలని, పర్యావరణ అనుకూల విధానాలపేరుతో పురుగు మందులు, ఇతర రసాయనిక ఎరువుల వాడకంపై పెట్టిన ఆంక్షలు సడలించాలని, తీవ్ర కరువు పరిస్థితులను ఎదుర్కొంటున్న రైతాంగానికి పరిహారం చెల్లించాలని వారు గత కొంతకాలంగా డిమాండ్ చేస్తున్నా ప్రభుత్వం పెడచెవిన పెట్టడంతో రైతు సంఘాలు ఈ నిరసనలకు పిలుపునిచ్చాయి. వచ్చే వారం కూడా ఈ నిరసనలు కొనసాగనున్నాయి.

ఈ నెల21న దేశ రాజధాని మాడ్రిడ్‌లో మహా ర్యాలీ నిర్వహణకు రైతులు సన్నద్ధమవుతున్నారు. ఈ ఆందోళనల నేపథ్యంలో స్పెయిన్ ప్రధాని పెడ్రో శాంఛెజ్ గురువారం పార్లమెంటులో మాట్లాడుతూ, రైతులను ఆదుకుంటామని, రష్యా-ఉక్రెయిన్ యుద్ధం వల్ల రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలను యూరోపియన్ యూనియన్ దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. లక్షా 40వేల మంది రైతులకు కరువు పరిహారంగా 27 కోట్ల యూరోలను విడుదలజేస్తున్నట్లు వ్యవసాయ మంత్రి ప్రకటించారు. ఇదే తరహా ఆందోళనలు గ్రీస్, ఫ్రాన్స్, పోలండ్ వంటి ఇతర యూరపు దేశాల్లో ఇటీవల తలెత్తిన సంగతి తెలిసిందే.

## మోడీతో జగన్ భేటీ

(మొదటిపేజీ తరువాయి)

కోరారు. దీనికి కేంద్ర ఆర్థిక శాఖ ఓకే చెప్పింది. దీంతోపాటు ప్రాజెక్టు తొలి విడతను సత్వరమే పూర్తి చేయడానికి రూ.12,911కోట్ల నిధుల విడుదలకూ అంగీకరించింది. అయితే, ఈరెండు అంశాలు కేంద్ర కేబినెట్ ఆమోదం కోసం ఎదరుచూస్తున్నాయి. పోలవరం మొదటి విడత పూర్తి చేయడానికి దాదాపు రూ.17,144 కోట్లు ఖర్చు అవుతాయి.ఇందుకు సంబంధించిన ప్రతిపాదన జలశక్తి శాఖ వద్ద పెండింగ్‌లోఉందని, దానిని సత్వరమే పరిష్కరించాలని ముఖ్యమంత్రి కోరినట్లు తెలిసింది. అలాగే, తెలంగాణ నుంచి ఏపి జెన్‌కోకు రావాల్సిన రూ.7,230 కోట్ల బకాయిలు వెంటనే చెల్లించేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

"రాష్ట్రంలో జిల్లాలను పునర్విభజించాక ప్రతి జిల్లాకు ఒక మెడికల్ కాలేజీ ఉండేలా కొత్తగా నిర్మించతలపెట్టిన 17 మెడికల్ కాలేజీలకు కేంద్ర సహాయం కావాలని అని కోరారు. "విశాఖనగరాన్ని భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టుతో అనుసంధానించేలా ప్రతిపాదించిన భోగాపురం, భీమిలి, రుషికొండ, విశాఖపట్నం పోర్టులను కలిపే 55 కిలోమీటర్ల 6 లైన్ల రహదారికి తగిన సహాయ సహకారాలు అందించాలి" అని కోరారు. "విభజన చట్టంలో పేర్కొన్న విశాఖపట్నం-కర్నూలు హైస్పీడ్ కారిడార్‌ను వయా కడప మీదుగా బెంగుళూరు వరకూ పొడిగించాలి. దీనిపై తగిన పరిశీలనలు పూర్తి చేసిన ఈ ప్రాజెక్టు సాకారం అయ్యేలా చూడాలి. కడప- పులివెందుల-ముదిగుబ్బ -సత్యసాయి ప్రశాంతి నిలయం-హిందూపూర్ కొత్త రైల్వేలైన్‌ను దీంట్లో భాగంగా చేపట్టాలి. ఈ ప్రాజెక్టు వల్ల వెనుకబడ్డ రాయలసీమ ప్రాంతానికి చక్కటి కనెక్టివిటీ ఏర్పడుతుంది. విశాఖపట్నం మెట్రో రైల్ ప్రాజెక్టుకు వీలైనంత త్వరగా ఆమోదం తెలపాలి" అని విజ్ఞప్తి చేశారు.

## ఇమ్రాన్ పార్టీ ముందంజ

(మొదటిపేజీ తరువాయి)

ఇండిపెండెంట్లు 88 సీట్లు గెలుచుకున్నారు. ప్రధాన పార్టీలైన పిఎంఎల్-ఎన- 61, పిపిపి- 50 స్థానాలతో ఆ తరువాతి స్థానాల్లో వరుసగా నిలిచాయి. ఇతర చిన్న పార్టీలకు 18సీట్లు లభించాయి. ఒక స్థానంలో అభ్యర్థి చనిపోయిన కారణంగా ఎన్నిక వాయిదా పడింది. మరో 48సీట్లకు ఫలితాలు ప్రకటించాల్సి వుంది. 265 స్థానాలున్న పాక్ పార్లమెంటులో సాధారణ మెజార్టీ లభించాలంటే 133 స్థానాలు కావాలి. మహిళలు, మైనార్టీల రిజర్వుడు స్థానాలు అన్నీ కలిపితే మొత్తం 336 స్థానాలకు గాను సాధారణ మెజార్టీ సాధించాలంటే 169 స్థానాలు అవసరం. ఫలితాల ప్రస్తుత సరళిని బట్టి చూస్తే హంగ్ పార్లమెంటు ఏర్పడే అవకాశముంది. రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో పంజాబ్, ఖైబర్ ఫఖ్తూన్ అసెంబ్లీల్లో పిటిఐ, సింధ్‌లో పిపిపి ఆధిక్యంలో ఉన్నాయి. ప్రధాన రాజకీయ నాయకులందరూ ఈ ఎన్నికల్లో సునాయాసంగా గట్టెక్కారు.



### మీ కోసం

పెరుగు సరిగ్గా తోడుకోకుండా పల్చగా ఉంటే, ఓ బేసిన్‌లో నీళ్లు పోసి.. పెరుగు గిన్నెను ఆ నీటిలో ఉంచాలి. ఇప్పుడు పొయ్యి మీద ఈ బేసిన్ పెట్టి నీళ్లను మరగపెడితే, కొద్దిసేపటికే పెరుగు గట్టిగా తయారవుతుంది.

### జీవన సౌరభం

చదవడం తెలిస్తే
ప్రతి మనిషీ
ఒక పుస్తకమే..

# తెల్ల పిల్లి - నల్ల పిల్లి



పేదరాశి పెద్దమ్మ పెరట్లో పెద్ద మామిడి చెట్టు, రేగు చెట్టు, రాస ఉసిరి చెట్టు ఉన్నాయి. సెలవు రోజు పిల్లలందరూ ఆ చెట్ల కింద చేరి ఆడుకుంటున్నారు. అప్పుడే అక్కడికి వచ్చింది పెద్దమ్మ.

'పిల్లలూ, కర్రలు, రాళ్ళు చెట్టు మీదకి విసరకండి. మీ నెత్తి మీద పడతాయి' అని గట్టిగా చెప్పింది. పెద్దమ్మ రాకను గమనించిన పిల్లలంతా పెద్దమ్మ చుట్టూ చేరారు. రుద్ర ఒక పిల్లి పిల్లని ఎత్తుకుని వచ్చాడు. అది మ్యావ్ మ్యావ్ అని అరవసాగింది.

'పెద్దమ్మా పెద్దమ్మా... పిల్లి కథ చెప్పవా' అని అడిగారు పిల్లలు.

'సరే' నంటూ పిల్లి కథ చెప్పడం ప్రారంభించింది పెద్దమ్మ.

అనగనగా బిడ్డిక అనే ఊళ్లో రాజు అనే గజదొంగ ఉండేవాడు. అతడికి పిల్లి అంటే వల్లమాలిన ప్రేమ. పక్క ఊరు నుంచి నల్లటి పిల్లి పిల్లని తెచ్చి పాలు పోసి పెంచాడు. ఆ పిల్లిపిల్ల రోజూ రాజు దగ్గరే నిద్రపోయేది. ఇరవై నాలుగు గంటలూ రాజుతోనే ఉండేది. పక్క ఊరిలో వరహాలు శెట్టి అనే షావుకారు నివసిస్తూ ఉండేవాడు. అతడికి కిరాణా కొట్టు ఉంది. అందులోని సరుకులన్నీ ఎలుకలు పాడుచేస్తున్నాయని ఒక తెల్లపిల్లిని పెంచుకున్నాడు. ఒక రోజు రాత్రి వరహాలు శెట్టి ఇంటికి దొంగతనానికి బయలుదేరాడు రాజు. నల్ల పిల్లిని కూడా వెంట తీసుకెళ్లాడు. చీకట్లో నడుచుకుంటూ వరహాలు శెట్టి ఇంటికి చేరుకున్నాడు. ఇంటి పైకప్పును తొలగించి నెమ్మదిగా ఇంట్లోకి ప్రవేశించాడు. అతడి వెనకాలే పిల్లి కూడా ఇంట్లోకి వెళ్ళింది. ఆ మూల ఈ మూల నెమ్మదిగా డబ్బుల పెట్టె కోసం వెతికాడు రాజు. ఈలోపు నల్లపిల్లి వరహాలు శెట్టి ఉన్న గదిలోకి వెళ్లింది. అతడి మంచం దగ్గర నిద్రపోతున్న తెల్లపిల్లిని చూసింది.

'మిత్రమా, బాగున్నావా? (మ్యావ్) అని తెల్ల పిల్లిని ఆప్యాయంగా పలకరించింది. 'బాగున్నాను' (మ్యావ్) అని సమాధానమిచ్చింది తెల్ల పిల్లి. 'ఏం చేస్తున్నావ్?' అని నల్లపిల్లి, తెల్ల పిల్లిని అడిగింది.

'ఇక్కడ దొరికిన ఎలుకల్ని తింటూ గడుపుతున్నాను' అని తెల్ల పిల్లి చెప్పింది. 'ఇన్నాళ్లు ఎక్కడ ఉన్నావు? (మ్యావ్)" అని తెల్ల పిల్లి, నల్లపిల్లిని అడిగింది. ' పక్క ఊరిలో' అని సమాధానమిచ్చింది నల్లపిల్లి.

ఇలా రెండు పిల్లులు మ్యావ్ మ్యావ్ అని అరుస్తూ కుశలప్రశ్నలు వేసుకుంటుంటే ఇంట్లో వారికి తెలివి వచ్చింది. దీపం వెలిగించారు. ఆ వెలుగులో పారిపోతున్న రాజుని చూశారు. ఇరుగు పొరుగు సాయంతో దొంగని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. పిల్లిని చంకన పెట్టుకు వెళ్ళడమంటే ఇదే' అని కథ ముగించింది పెద్దమ్మ.

కాశీ విశ్వనాథం పట్రాయుడు,
94945 24445.

## నేను గీసిన బొమ్మ





సైదు నీరజ
5వ తరగతి
కైకలూరు మండలం,
ఏలూరు జిల్లా,
94415 19570.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

# బాధితుడే భరోసాగా నిలుస్తున్నాడు!

**జీవితం ఎన్నో సవాళ్లను మన ముందుంచుతుంది. ప్రతి అవరోధాన్ని అధిగమిస్తూ ముందుకు సాగిపోవాలి. ముఖ్యంగా యువతలో ఆ పోరాట పటిమ ఉండాలి. సవాళ్లను ఎదుర్కొంటూ ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిగా నిలవాలి. అలాంటి కుర్రవాడే చెన్నయ్ గ్రామీణ ప్రాంతానికి చెందిన 21 ఏళ్ల సంజయ్. ఒకప్పుడు అతను హెచ్‌ఐవి బాధితుడు. పుట్టుకతోనే సంక్రమించిన ఆ వ్యాధి నుంచి సంజయ్ ఇప్పుడు పూర్తిగా కోలుకున్నాడు. అయితే ప్రస్తుతం సంజయ్ తనకు సంక్రమించిన వ్యాధిని, అది మిగిల్చిన చేదు జ్ఞాపకాలని పదిమందికీ చెప్పే సాహోసపేత నిర్ణయంలో ముందుకు వెళుతున్నాడు. ఓ సంఘటన అతణ్ణి ఈ ప్రయాణానికి ప్రేరేపించింది.**





ఏడో తరగతి చదువుతున్న సృజన పాఠశాలకు సరిగ్గా వెళ్లడం లేదు. బాగా చదివే అమ్మాయి. ఎందుకు ఇలా చేస్తోంది? ఎవరికీ అర్థం కాలేదు. అప్పుడే ఆ ప్రాంతంలో హెచ్‌ఐవి పాజిటివ్ వ్యక్తుల సమూహాలతో కొన్ని సమావేశాలు నిర్వహించింది ఓ స్వచ్ఛంద సంస్థ. అందులో వీడియో గ్రాఫర్‌గా పనిచేస్తున్నాడు సంజయ్. అక్కడ ఓ సమావేశానికి హాజరైన ఆ బాలిక తన తల్లీదండ్రీ చనిపోయారని, అమ్మమ్మ దగ్గర పెరుగుతున్నానని చెప్పింది. 'అమ్మానాన్న ఎందుకు చనిపోయారో నాకు తెలియదు. చిన్నప్పుడే ఇక్కడికి వచ్చేశాను. బడికి వెళితే మొదట్లో బాగానే ఉంది. కానీ ఇప్పుడు స్కూల్లో టీచర్లు నన్ను దూరం పెడుతున్నారు. ఫ్రెండ్స్ ఎవ్వరూ నాతో మాట్లాడడం లేదు. చదువుపై శ్రద్ధ తగ్గిపోయింది. రోగం వల్ల అమ్మనాన్న చనిపోయారని అమ్మమ్మ చెప్పింది. నాకు ఏ రోగమూ లేదు. అయినా అందరూ నన్ను హేళన చేస్తున్నారు. అందుకే చదువుకోవాలని ఉన్నా స్కూలుకు వెళ్లడం లేదు' అంటూ బోరుబోరున ఏడ్చేసింది.

ఆ దృశ్యం చిత్రీకరిస్తున్న వీడియోగ్రాఫర్ సంజయ్ చెంపలు కూడా కన్నీళ్లతో తడిసిపోయాయి. 'దెబ్బతిన్న వాడికే నొప్పి విలువ తెలుస్తుంది' అన్నట్లుగా ఆ క్షణం ఆ చిన్నారిలో తనను తాను చూసుకున్నాడు సంజయ్.

రెండున్నర దశాబ్దాల క్రితం ప్రపంచాన్ని కుదేపేసిన ఎయిడ్స్ వ్యాధికి పెద్దలతో పాటు పిల్లలు కూడా బలయ్యేవారు. అనారోగ్యం కంటే అవగాహనా లోపంతో అశువులు బాసిన వారే ఎక్కువ. అంతలా భయపెట్టిన హెచ్‌ఐవి వైరస్‌కి అమ్మ కడుపులో ఉండగానే గురైన పసివారు కోకొల్లలు. చెన్నయ్ నమ్మకల్ ప్రాంతంలో పుట్టి పెరిగిన 21 ఏళ్ల సంజయ్ అలాంటి పిల్లవాడే. పుట్టుకతోనే సంక్రమించిన వ్యాధితో ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నాడు. చుట్టూ వున్న వారు తనను ఎందుకు దూరం పెడుతున్నారో తెలియని అమాయకత్వంలోనే పెరిగాడు. వయసు పెరిగేకొద్దీ పరిస్థితులు అర్థమయ్యాయి. అమ్మ చనిపోయింది. నాన్న మంచానికే పరిమితమయ్యాడు.

'నాతో పాటు పుట్టిన అక్కలిద్దరూ ఏ మందులూ వేసుకునేవారు కాదు. నేను మాత్రమే ఎందుకు? అని ప్రశ్నించేవాడ్ని. 3వ తరగతి నుంచే మూడు పూటలా మందులు వేసుకోవాల్సి వచ్చేది. అమ్మ చనిపోయాక కొన్ని రోజులకు మందులు వేసుకోవడం మానేశాను. దీంతో గాయాలు త్వరగా మానేవి కావు. ఎప్పుడూ అనారోగ్యంగా ఉండేవాడ్ని. స్కూలుకు వెళితే పిల్లలందరితో కూర్చొనిచ్చేవారు కాదు. దూరం పెట్టేవారు. చాలా బాధేసేది. స్కూలుకు వెళ్లబుద్ధి అయ్యేది కాదు. నేను 8వ తరగతికి వచ్చేటప్పటికి హెచ్‌ఐవి సోకినా ఆరోగ్యంగా జీవించవచ్చని తెలుసుకున్నాను. నా జీవితానికి మార్చుకోవాలంటే మందులు వేసుకోవాల్సిందేనని నిర్ణయించుకున్నాను. ఓ స్వచ్ఛంద సంస్థ ఇచ్చిన ప్రోత్సాహంతో ఇప్పుడు వ్యాధి నుంచి కోలుకున్నాను' అని చెబుతున్న సంజయ్ విజువల్ కమ్యూనికేషన్స్ పూర్తిచేసి వీడియో గ్రాఫర్‌గా కొత్త జీవితం ప్రారంభించాడు.

ఇప్పుడు తను సురక్షితమే.. కానీ తనలాంటి వారు ఎంతోమంది. ఇంకా భయంభయంగానే జీవిస్తున్నారు. వ్యాధి ఉందని తెలిస్తే సమాజం చిన్నచూపు చూస్తుందని భయపడుతున్నారు. ఎన్‌జివో తరపున వీడియో చిత్రీకరణ చేస్తున్న సంజయ్‌కి ఆ పాప సంఘటన కర్తవ్యబోధ చేసినట్లైంది. 'వ్యాధి నుంచి కోలుకున్నా నేనెప్పుడూ బాధితుడిని అని ఎవరికీ చెప్పలేదు. మొన్నీమధ్యే నా స్నేహితులకు చెప్పాను. అందరూ ఇలాగే ఉంటే సమాజ ధోరణిలో మార్పు ఎలా వస్తుంది? అందుకే ఇప్పటికీ ఎంతోమంది పిల్లలు వివక్షకు గురవుతున్నారు. చదువుకు దూరమై నిరాశనిస్పృహలలో జీవిస్తున్నారు. వారందరి జీవితాల్లో వెలుగులు నింపాలంటే నాలాంటి వారు ముందుకు రావాలి. వ్యాధి నుంచి బయటపడవచ్చని వాళ్లల్లో ధైర్యంనింపాలి' అంటున్న సంజయ్ ఆ ఆలోచన రావడంతోనే 'హెచ్‌ఐవి అండ్ ఎయిడ్స్ నంబిక్కయుమ్ నలవాల్వుమ్' పేరుతో ఓ యూట్యూబ్ ఛానెల్ ప్రారంభించాడు. అందులో ముందుగా తన కథను ప్రసారం చేశాడు. స్వచ్ఛంద సంస్థ మద్దతుతో హెచ్‌ఐవి అవగాహనా చర్చలు జరుపుతున్నాడు. సంస్థతో కలిసి గ్రామీణ ప్రాంతాల్లో పర్యటిస్తున్నాడు. వ్యాధిగ్రస్తుల పట్ల సమాజంలో నెలకొన్న పక్షపాతాన్ని తొలగించేందుకు నడుం బిగించాడు. తన గతం తాలూకు చేదు జ్ఞాపకాలని బహిరంగంగా చెప్పే సాహసోపేత నిర్ణయంలో ముందుకు వెళుతున్నాడు.

## నులి పురుగులను నియంత్రిద్దాం

పిల్లల్లో మనకు తరచూ నులిపురుగుల సమస్య కనిపిస్తుంది. ఇది వారి ఆరోగ్యంపై తీవ్ర పెను ప్రభావాన్ని చూపిస్తోంది. అందుకనే ఏటా ఫిబ్రవరి 9న జాతీయ నులి పురుగుల నిర్మూలనా దినం జరుపుతారు. ప్రదర్శనలు వంటివి నిర్వహించి, పిల్లలకు, తల్లిదండ్రులకు నులి పురుగుల గురించి అవగాహన కల్పిస్తారు.

నులి పురుగులు నెలల వయస్సు చిన్నారి నుంచి వృద్ధుల వరకూ వేధిస్తాయి. ఇవి చాలా సులువుగా పొట్టలోకి చేరిపోతాయి. పేగులను ఆవాసం చేసుకుని వేల సంఖ్యలో గుడ్లు పెడతాయి. మల విసర్జన ద్వారా బయటకొచ్చి మన పరిసరాల్లో వ్యాపిస్తాయి. మట్టిలో కలిసిపోయిన గుడ్లు తీవ్ర వాతావరణాన్ని సైతం తట్టుకుని ఏళ్ల తరబడి అలాగే ఉంటాయి. మట్టిలో ఆడుకునే పిల్లలు కాళ్లూ చేతులు శుభ్రంగా కడుక్కోకుండా ఆహారం తింటే ఈ పరాన్నజీవులు కడుపులోకి చేరతాయి. తినే ఆహారం పేగుల్లోకి చేరినప్పుడు అందులోని పోషకాలను నులి పురుగులే పీల్చుకోవడంతో పిల్లల్లో ఎదుగుదల నిలిచిపోతుంది. తరుచూ అనారోగ్యం బారిన పడతారు.

**ఆల్బెండజోల్ మాత్రలతో నివారణ**

ఆల్బెండజోల్ మాత్రలు వాడటం ద్వారా నులిపురుగులను నిర్మూలించొచ్చు. ఒకటి - రెండేళ్ల మధ్య పిల్లలకు (200 మి.గ్రా) సగం మాత్ర, ఆపైన 19 ఏళ్ల వయస్సు వరకు ఒక మాత్ర (400 మి.గ్రా) తీసుకోవాలి. నులి పురుగులు ఉంటే ఒకటి లేదా రెండు రోజుల్లో మల విసర్జన ద్వారా బయటకు వస్తాయి. వీటిని ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఈ మాత్రలు వేసుకోవటం వల్ల అవి తగ్గిపోతాయి. పెద్ద వయస్సు వారు మూడు రోజుల పాటు మూడు మాత్రలు వేసుకోవాలి. వాటిని మింగకుండా చప్పరించాలి. రాష్ట్రవ్యాప్తంగా వైద్య, ఆరోగ్యశాఖ ద్వారా ఏటా రెండు సార్లు నులిపురుగుల నివారణ మాత్రలు ఉచితంగా పంపిణీ చేస్తారు. విద్యార్థులకు ఆయా విద్యాసంస్థల్లో ఈనెల 9, 16 తేదీల్లో మాత్రల పంపిణీ ఉంటుంది.



- డాక్టర్ జి.గీతాభాయి
కృష్ణా జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి, మచిలీపట్నం



## చిరంజీవి జీవిత చరిత్ర రాస్తున్నా ...

హీరో చిరంజీవి జీవితచరిత్ర పుస్తకాన్ని రాసే పనిలో నిమగ్నమై ఉన్నానని ప్రముఖ రచయిత యండమూరి వీరేంద్రనాథ్ వెల్లడించారు. 'చిరంజీవి నటించిన 'మంచుపల్లకి' సినిమాకు నేను డైలాగులు రాశాను. ఆ తర్వాత 40 సంవత్సరాలు మేమిద్దరం చాలా సన్నిహితంగా ఉన్నాం. ప్రస్తుతం మా మధ్య ఎలాంటి మనస్పర్థలు లేవు. నాలుగేళ్ల తర్వాత చిరంజీవి ఎలా రిసీవ్ చేసుకుంటారోనని భయపడ్డా. కానీ, ఆయన మాత్రం చాలా ప్రేమతో పలకరించారు. మీ జీవిత చరిత్ర రాస్తే బాగుంటుందని చెబితే ఆయన విని ఆశ్చర్యపోయారు. 'నిజంగా రాస్తారా.. నువ్వు రాస్తే అంతకంటే కావాల్సిందేముంది? ఇప్పుడే ప్రకటించమంటావా' అని చిరంజీవి అడిగారు. 'నేను ఓకే చెప్పటంతో ఆ స్టేజ్ పైనే ఈ విషయాన్ని వెల్లడించారు' అని వివరించారు.

## సీక్వెల్ బాటలో 'ఈగల్'



రవితేజ, కావ్య థాపర్ జంటగా కార్తీక్ ఘట్టమనేని తెరకెక్కించిన 'ఈగల్' చిత్రానికి సీక్వెల్ రానుంది. శుక్రవారం విడుదలైన ఈ చిత్రం నుండి తాజాగా ఈ వార్త బయటకి వచ్చింది. ఈ రెండో భాగం 'ఈగల్-యుద్ధకాండ'గా రానున్నట్టుగా వెల్లడించారు. మొదటి భాగంలో అనుపమ పరమేశ్వరన్, శ్రీనివాస్ అవసరాల, వినయ్ రాయ్ తదితరులు ముఖ్య పాత్రల్లో నటించారు. దేవ్ జాన్డ్ సంగీతం అందించారు.

# విశాఖలో 'ఆడుదాం ఆంధ్రా' ఫైనల్స్

- 13న ముగింపు
- చివరి రోజు సిఎం హాజరు
- పోటీలను ప్రారంభించిన మంత్రి రోజా

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

ఆడుదాం ఆంధ్రా రాష్ట్రస్థాయి పోటీలు శుక్రవారం విశాఖపట్నంలో ప్రారంభమయ్యాయి. 26 జిల్లాల నుంచి 2,964 మంది క్రీడాకారులు ఐదు విభాగాల్లో తలపడనున్నారు. ఈ పోటీలు 13వ తేదీతో యుగియనున్నాయి. చివరి రోజున ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి హాజరుకానున్నారు. విశాఖలోని రైల్వే గ్రౌండ్స్‌లో ఈ పోటీలను రాష్ట్ర క్రీడల శాఖ మంత్రి ఆర్‌కె రోజా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర స్థాయి పోటీలలో ప్రతిభ కనబరిచిన ఉత్తమ క్రీడాకారులకు జాతీయ అకాడమీలో శిక్షణ ఇప్పిస్తామన్నారు. విజేతలకు దాదాపు రూ.12 కోట్ల బహుమతులు ఇస్తున్నామని పేర్కొన్నారు. ఇప్పటి వరకూ రాష్ట్ర వ్యాప్తంగా 1.2 కోట్ల మందికిపైగా క్రీడాకారులు, ప్రజలు పాల్గొన్నట్టు తెలిపారు. ఈ పోటీల నిర్వహణకు రూ.120 కోట్ల నిధులు వెచ్చించామని తెలిపారు. ఆడుదాం ఆంధ్రా కిట్‌లపై సిఎం ఫొటో వేస్తే తప్పేంటి? అని, ఆంధ్రాకు దిష్టిబొమ్మగా పేరుగాంచిన చంద్రబాబు ఫొటో ఏమైనా వేయాలా? అని ప్రశ్నించారు. 2024 ఎన్నికల తర్వాత నాన్ లోకల్ పొలిటీషియన్లు చంద్రబాబు, పవన్, లోకేష్, షర్మిల తెలంగాణకు పారిపోవడం ఖాయమన్నారు. కార్యక్రమంలో శాప్ ఛైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి, ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రద్యుమ్న, ఎమ్‌డి ధ్యాన్‌చంద్ర, విశాఖ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకున్న రోజా







## 12TH ఫెయిల్‌కు అరుదైన గౌరవం

విధు వినోద్ చోప్రా దర్శకత్వంలో విక్రాంత్ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 12TH ఫెయిల్‌కు మరో అరుదైన గౌరవం దక్కింది. ఇంటర్నెట్ మూవీ డేటాబేస్ (ఐఎండీబీ) తాజాగా ప్రపంచవ్యాప్తంగా టాప్ 250 ఉత్తమ చిత్రాల జాబితాను విడుదల చేసింది. అందులో 12TH ఫెయిల్ 50వ స్థానంలో నిలిచింది. టాప్ 50లో ఉన్న ఏకైక ఇండియన్ సినిమా ఇదే. దీనిపై దర్శకుడు విధు వినోద్ చోప్రా స్పందిస్తూ .. ఎంతో ఆనందంగా ఉందని పేర్కొన్నారు. ఐఎండీబీలో అత్యధిక రేటింగ్ పొందిన ఇండియన్ సినిమాగా ఈ చిత్రం గతంలోనే రికార్డు నెలకొల్పిన విషయం తెలిసిందే. హాలీవుడ్ చిత్రాలను వెనక్కి నెట్టి 9.2 రేటింగ్‌తో సంచలనం సృష్టించింది.

## విక్రమ్ సినిమాలో ఎస్ జె సూర్య

ఎస్ యూ అరుణ్ కుమార్ దర్శకత్వంలో నటుడు విక్రమ్ 62వ చిత్రం తెరకెక్కనుంది. ఈ చిత్రం నుంచి మేకర్స్ ఓ ఇంట్రెస్టింగ్ అప్డేట్‌ని అందించారు. ఈ చిత్రంలో విలక్షణ నటుడు ఎస్ జె సూర్య కూడా నటిస్తున్నాడు. తనకి ఆహ్వానం పలుకుతూ చిత్రబృందం ఓ పోస్టర్ విడుదల చేసింది. ఈ చిత్రానికి జివి ప్రకాష్ సంగీతం అందిస్తుండగా హెచ్ ఆర్ పిక్చర్స్ నిర్మాణ బాధ్యత వహిస్తోంది.





## 23న 'వ్యూహం' విడుదల

రాంగోపాల్ వర్మ నిర్మించిన 'వ్యూహం' సినిమా విడుదలకు సిద్ధమైంది. హైకోర్టు సూచనలతో ఈ సినిమాకు రెండోసారి సెన్సార్ సర్టిఫికేటును జారీ చేశారు. దీంతో ఈ నెల 23న ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు చిత్రయూనిట్ ప్రకటించింది. షూటింగ్ ఎప్పుడో పూర్తి అయినా కొంతమంది కోర్టులో పిటిషన్ వేయడంతో విడుదలకు బ్రేక్ పడింది. చిత్రనిర్మాత, దర్శకుడు తదితరులు కోర్టును ఆశ్రయించడంతో మరోసారి సర్టిపై చేయాలని, హైకోర్టు, సెన్సార్ బోర్డుకు లేఖ రాసింది. దీంతో సెన్సార్ బోర్డు ఈ చిత్రానికి యూ సర్టిఫికేట్‌ను జారీ చేయడంతో విడుదల చేస్తున్నారు.





## 16న సైరన్ విడుదల

జయం రవి, కీర్తి సురేష్, అనుపమ పరమేశ్వరన్ ప్రధాన పాత్రల్లో తెరకెక్కించిన తాజా చిత్రం సైరెన్. హోమ్ మూవీ మేకర్స్ పతాకంపై సుజాత విజయకుమార్ నిర్మించారు. ఆంథోని భాగ్యరాజ్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. జీవీ ప్రకాష్‌కుమార్ సంగీతాన్ని అందించారు. చిత్రయూనిట్ చెన్నైలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించింది. జయంరవి మాట్లాడుతూ తాను రెండు డిఫరెంట్ పాత్రల్లో నటించానన్నారు. పిల్లల నుంచి పెద్దల వరకూ అందరినీ ఈ సినిమా అలరిస్తుందన్నారు. సముద్రఖని, అళగర్ పెరుమాళ్ ముఖ్యపాత్రలు పోషించారన్నారు.

## ఆంధ్ర 235/4

### ఉత్తరప్రదేశ్‌తో రంజీ మ్యాచ్

విశాఖపట్నం: రంజీట్రోఫీ ఎలైట్ గ్రూప్-బిలో భాగంగా ఉత్తరప్రదేశ్‌తో ప్రారంభమైన లీగ్ మ్యాచ్‌లో ఆంధ్రప్రదేశ్ జట్టు బ్యాటర్లు రాణించారు. కెప్టెన్ రికీ బుయ్(90బ్యాటింగ్)కు తోడు శశికాంత్(72), కరణ్ షిండే(45బ్యాటింగ్) రాణించారు. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఆంధ్ర ఓపెనర్లు ప్రశాంత్(14), మహీప్ కుమార్(0) నిరాశపరిచారు. దీంతో ఆంధ్రజట్టు స్వల్ప విరామంలోనే రెండు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఆ దశలో మాజీ కెప్టెన్ హనుమ విహారి(11) సహకారంతో శశికాంత్ అర్ధసెంచరీతో మెరిసాడు. విహారి ఔటయ్యాక కెప్టెన్ రికీ బుయ్-శశికాంత్ మరో వికెట్ పడకుండా జాగ్రత్తగా ఆడారు. ఈ క్రమంలో శశికాంత్ అర్ధసెంచరీ పూర్తయ్యాక సౌరబ్ కుమార్ బౌలింగ్‌లో ఔటయ్యాడు. ఆ తర్వాత రికీ బుయ్-కరణ్ షిండే కలిసి మరో వికెట్ పడకుండా జాగ్రత్తగా ఆడారు. దీంతో తొలిరోజు ఆట ముగిసే సమయానికి ఆంధ్ర ప్రదేశ్ జట్టు 80 ఓవర్లలో 4వికెట్ల నష్టానికి 235పరుగులు చేసింది. యుపి బౌలర్లు యశ్ దయాల్, అంకిత్ రాజ్‌పుత్, ఆకిబ్ ఖాన్, సౌరభ్ కుమార్‌కు ఒక్కో వికెట్ దక్కాయి.

**తన్మయ్, తిలక్ వర్మ సెంచరీలు..**

ప్లేట్ గ్రూప్‌లో హైదరాబాద్ ఓపెనర్ తన్మయ్ అగర్వాల్, కెప్టెన్ తిలక్ వర్మ సెంచరీలతో కదం తొక్కడంతో హైదరాబాద్ జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి 5వికెట్ల నష్టానికి 383పరుగులు చేసింది. ఉప్పల్ వేదికగా నాగాలాండ్‌తో గురువారం నుంచి ప్రారంభమైన మ్యాచ్‌లో తన్మయ్ అగర్వాల్(164), తిలక్ వర్మ(101బ్యాటింగ్) సెంచరీలతో కదం తొక్కారు. రోహిత్ రాయుడు(59) కూడా రాణించడంతో హైదరాబాద్ జట్టు భారీస్కోర్ దిశగా పయనిస్తోంది. నాగాలాండ్ బౌలర్లు జొనాథన్‌కు రెండు, రెహమాన్, క్రివిట్సో, ఇమ్మివతిలకు ఒక్కో వికెట్ దక్కాయి.

## 'విజేతల' ప్రకటనపై రగడ

### మహిళల అండర్-19 శాఫ్ ఛాంపియన్‌షిప్ సంయుక్త విజేతలు భారత్-బంగ్లాదేశ్





ఢాకా: అండర్-19 శాఫ్ మహిళల ఛాంపియన్‌షిప్ ఫైనల్ విజేత ప్రకటన ఉద్రిక్తతలకు దారితీసింది. నిర్వాహకులు చివరకు భారత్-బంగ్లాదేశ్ జట్లను సంయుక్త విజేతలుగా ప్రకటించాల్సి వచ్చింది. తొలుత నిర్ణీత సమయంలో 1-1తో ఇరుజట్లూ నిలవగా మ్యాచ్ పెనాల్టీ షూటౌట్‌కు దారితీసింది. అక్కడా ఇరుజట్లు 11-11గోల్స్‌తో సమంగా నిలిచాయి. దీంతో విజేతను నిర్ణయించడంపై నిర్వాహకులు టాస్ వేశారు. ఇందులో భారత్ గెలిచింది. దీంతో టైటిల్ విజేతగా భారత్‌ను నిర్వాహకులు తొలుత ప్రకటించారు. దీనిపై బంగ్లాదేశ్ జట్టుతోపాటు అక్కడి అభిమానులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. కొందరు ఫ్యాన్స్ మైదానంలోకి రాళ్లు, మంచినీటి సీసాలను విసిరారు. చివరికి ఇరుజట్లను సంయుక్త విజేతగా నిర్ణయిస్తూ ప్రకటన చేయడం గమనార్హం. దాదాపు రెండు గంటల తర్వాత భారత క్రీడాకారిణులను కట్టుదిట్టమైన భద్రత నడుమ మైదానం వెలుపలికి తీసుకొచ్చారు. ఈ సంఘటనపై ఏఐఎఫ్‌ఎఫ్ ప్రధాన కార్యదర్శి ఎం.సత్యనారాయణ్ స్పందించారు. "స్థానిక అభిమానుల నుంచి ఇలాంటి ప్రవర్తన ఊహించలేదు. టాస్ ద్వారా విజేతగా తేల్చిన తర్వాత.. బంగ్లా ఫ్యాన్స్ మాపై కొన్ని వస్తువులను విసరడం బాధించింది. అధికారులు కూడా మమ్మల్ని విజ్ఞప్తి చేయడంతో సంయుక్త విజేతలుగా ట్రోఫీని అందుకొనేందుకు అంగీకరించాం. మా క్రీడాకారులు, జట్టు సిబ్బందికి భద్రతను కల్పించడమే మా తొలి ప్రాధాన్యం" అని సత్యనారాయణ్ స్పష్టం చేశారు.

## కెఎల్ రాహుల్ ఫిట్



ముంబయి: టీమిండియా మిడిలార్డర్ బ్యాటర్ కెఎల్ రాహుల్ ఫిట్‌నెస్ సాధించాడు. బెంగళూరులోని ఎన్‌సిఎ అకాడమీలో ఉన్న రాహుల్.. ఇంగ్లండ్‌తో మిగిలిన మూడు టెస్ట్‌లకు బిసిసిఐ జట్టును ప్రకటించడానికి ముందు ముంబయిలో ఉన్నాడు. దీంతో అతడు ఫిట్‌నెస్ సాధించాడు. ఇక శ్రేయస్ అయ్యర్ నెట్స్‌లో ప్రాక్టీస్ చేస్తూ.. గజ్జల్లో నొప్పితో బాధపడ్డాడు. ఈ విషయాన్ని బిసిసిఐ తెలియజేసినట్లు సమాచారం.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68